మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

శనివారం SATURDAY 5.10.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 10+12+4 Pages: 10 + 12+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 121 ‖ వెల (Price) రూ.6.50

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

లడ్డూ వివాదంపై స్వతంత్ర సిట్



- ఐదుగురు సభ్యులతో ప్రత్యేక దర్యాప్తు బృందం
- సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో సమగ్ర విచారణ జరగాలి
- సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

› 8

36 మంది నక్సల్స్ మృతి!



- ఛత్తీస్‌గఢ్‌లో భీకర ఎన్‌కౌంటర్
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- మృతులు పీఎల్‌జీఏ 5, 6 సభ్యులు
- ఈ ఏడాది ఇప్పటివరకు 185 మంది నక్సల్స్ మృతి

› 8

హై హై నాయకా!

పెద్దోళ్ల సవాల్..

పేదోళ్ల ఇండ్లు ఢమాల్



- ఫాంహౌస్‌లు అక్రమమంటూ పదేపదే ప్రకటిస్తున్న సీఎం రేవంత్
- అక్రమమైతే కూల్చేయండంటున్న పొంగులేటి, పట్నం, కేవీపీ
- ఇప్పటిదాకా పెద్దోళ్ల ఫాంహౌస్‌ల వైపు కన్నెత్తి చూడని హైడ్రా
- సీఎం అన్న తిరుపతిరెడ్డి ఇంటిపైనా స్టే తెచ్చుకునే దాకా గడువు
- ఎలాంటి నోటీసులు లేకుండానే సామాన్యుడి ఇండ్లు నేలమట్టం

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): 'నేను కొట్టినట్టు చేస్త... నువ్వు ఏడ్చినట్టు చెయ్యి' అంటూ కాంగ్రెస్ సర్కారులోని పెద్దలు పరస్పరం ఆడుతున్న 'హైడ్రా'మా ఇది! హైడ్రా తెరపైకి వచ్చింది మొదలు.. పెద్దోళ్లు సవాళ్లు విసురుతూనే ఉన్నారు. బడాబాబుల చెరువుల కబ్జా బాగోతాలు బయటికి వస్తూనే ఉన్నాయి. కానీ ఏ ఒక్క వ్యవస్థ కూడా బుల్డోజర్లు తీసుకున్నది లేదు. వాటిని కూల్చింది లేదు. కానీ, మరోవైపు ఏకంగా 21 చోట్ల సుమారు 127 నిర్మాణాలను హైడ్రా నేలమట్టం చేసింది. ఇందులో సినీనటుడు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్, కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు సోదరుడి

› 2వ పేజీలో



కబ్జాదారులం కాదు.. యజమానులం

- దశాబ్దాల నుంచి ఇక్కడే నివసిస్తున్నం
- పైసా పైసా కూడబెట్టి స్థలం కొనుక్కున్నం
- ఒళ్లు హూనం చేసుకొని ఇల్లు కట్టుకున్నం
- అనుమతులన్నీ ఇచ్చి కూలుస్తమంటరా?
- మూసీ భూబాధితుల తీవ్ర ఆవేదన

ఎల్బీనగర్, అక్టోబర్ 4: ఒక పూట తిని.. రెండు పూటలు పస్తులుండి పైసా పైసా కూటబెట్టుకున్నం.. సొంతిల్లు ఉండాలని కాయకష్టం చేసినం.. ఇంటి కలను నిజం చేసుకునేందుకు స్థలాలు కొని ఇండ్లు కట్టుకున్నం.. సర్కారీ ఆఫీసుల చుట్టూ తిరిగి అన్ని అనుమతులు తీసుకున్నం.. అలాంటిది ఇప్పుడొచ్చి ఇంటిని కూల్చివేస్తామంటే

› 2వ పేజీలో


225 ఎకరాల 'రాజీ'కీయం!

- సుల్తాన్‌పల్లి జాగీర్దారీ భూములపై రేవంత్ సర్కారు మౌనం
- బీఆర్‌ఎస్ హయాంలోనే తీవ్రంగా యత్నించిన ప్రకాశ్‌గౌడ్
- సొంతపార్టీ ఎమ్మెల్యే అయినా రాజీపడని కేసీఆర్ ప్రభుత్వం
- అవి ప్రభుత్వ భూములేనని కోర్టుల్లో రెవెన్యూశాఖ అఫిడవిట్
- వాటి కోసమే రాజేంద్రనగర్ ఎమ్మెల్యే పార్టీ మారినట్టు ఆరోపణ
- గతంలో హైకోర్టు, తాజాగా రంగారెడ్డి కోర్టుల్లో రైతుల రాజీ
- సుప్రీంకు వెళ్లే అవకాశమున్నా సర్కారు ఉద్దేశపూర్వక మౌనం
- భూముల పరిరక్షణ దిశగా న్యాయపోరాటాన్ని మరిచిన సర్కార్!
- ధరణిలోనూ రికార్డులు మార్చేందుకు కదులుతున్న పావులు
- ప్రత్యక్షంగా వ్యవహారం నడుపుతున్న ఏపీ సీఎం బంధువు!

3,375 కోట్ల విలువైన సర్కారు భూములు ధారాదత్తమేనా?

పేదల ఇండ్లు కూల్చేసి, వారి వంద గజాల జాగనో.. బస్తీలను నేలమట్టం చేసి ఎకరం, అరెకరం భూమినో స్వాధీనం చేసుకుని ఏదో ఘనకార్యం చేసినట్టు కాంగ్రెస్ ప్రభుత్వం చెప్తున్నది. పేదల్ని బజారుపాల్జేసి ఎంత భూమిని కాపాడామో లెక్కలు వల్లిస్తున్నది. కానీ సుల్తాన్‌పల్లిలోని వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని, వందల ఎకరాలను కొందరు పెద్దలు స్వాహా చేస్తుంటే మాత్రం ఇదే సర్కారు కావాలనే మౌనాన్ని ఆశ్రయిస్తున్నది.కేసీఆర్ హయాంలో భూముల పరిరక్షణకు ప్రభుత్వం సుదీర్ఘ న్యాయపోరాటం చేసింది. అది మంచిరేవుల కావొచ్చు.. కోకాపేట కావొచ్చు.. పుప్పాలగూడ, కేపీహెచ్‌బీ కావొచ్చు. సర్కారీ స్థలాల పరిరక్షణే ప్రధానలక్ష్యంగా రెవెన్యూశాఖను పరుగెత్తించింది. సుప్రీంకోర్టు దాకా వెళ్లి దశాబ్దాల నాటి పెండింగ్ కేసులనూ కొలిక్కితెచ్చింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం సర్కారీ భూముల పరిరక్షణను గాలికొదిలేసింది. న్యాయపోరాటం చేయాల్సిన సర్కారే.. తన 'సైలెన్స్'తో కొందరి స్వాహాపర్వానికి పరోక్షంగా సాయపడుతున్నది. ఎందుకంటే.. అవి 3,375 కోట్ల విలువైన భూములు! మొత్తం 225 ఎకరాలు! ఆ భూముల వెనుక కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యే ఉన్నారు! ఆయన వెనుక కాంగ్రెస్ ప్రభుత్వంలోని పలువురు పెద్దలు ఉన్నారు! ఈ వ్యవహారం వెనుక ఏపీ సీఎం చంద్రబాబు బంధువు ఉన్నారు!

› 4



మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి ఫాంహౌస్

‘సీఎం రేవంత్‌రెడ్డి గండిపేట, హిమాయత్‌సాగర్‌లో అడ్డంగా ఉన్న ఇండ్లు తీస్తున్నరు. అది మంచి కార్యక్రమం. నేను గతంలో మంత్రిగా పనిచేసిన వ్యక్తిని. మంచి హోదాలో ఉన్నందున నేనే ముందుండి బాధ్యత తీసుకొని నా ఫాంహౌస్‌ను తీయాల్సి ఉంటుంది. కానీ అది ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో లేదని అధికారులే నివేదిక ఇచ్చారు. ఒకవేళ నివేదిక తప్పు.. నిర్మాణం ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉంటే నేనే దగ్గర ఉండి తీసేయిస్త’

- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి వ్యాఖ్యలు ఇవి. చుట్టూ నీళ్లతో మధ్యలో ఓ ఐలాండ్‌లా ఉన్న మహేందర్‌రెడ్డి ఫాంహౌజ్ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టిన విషయం అందరికీ తెలిసిందే. అది చూసిన ఎవరైనా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ అంటూ లెక్కలు చూడరు. జలాశయంలోనే ఉంది కదా! అనే నిర్ణయానికొచ్చారు.



కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఫాంహౌస్

‘అది నేను కొన్నది. ఆ కాంపౌండ్ వాల్ నేను కట్టుకున్నది కాదు. వివేక్ వెంకటస్వామి ఫాంహౌస్ చట్టప్రకారం లేదని అంటున్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నా. పరువు నష్టం దావా వేస్తా. ఎఫ్‌టీఎల్ నుంచి 30 మీటర్ల తర్వాత కట్టుకోవచ్చని చట్టం ఉన్నది. ఈ చట్టం ప్రకారమే నేను నిర్మాణం చేపట్టాను. నేను ఏ విషయంలోనైనా చట్టం ప్రకారమే చేస్తాను’

- మాజీ ఎంపీ, తాజా కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఇలా సెలవిచ్చారు. కానీ జలమండలి అధికారుల నివేదికలో వివేక్ నిర్మాణాలు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్నాయని తేల్చారు. అందుకు నిదర్శనమే ఈ నివేదిక. అయినా.. బుల్డోజర్లకు అటువైపు వెళ్లే ధైర్యం లేదు.



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఫాంహౌస్

‘రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మంచి ఉద్దేశంతో హైడ్రాను ఏర్పాటు చేశారు. ఒకటే చాలెంజ్ విసురుతున్నా. హైడ్రా అధికారి రంగనాథ్‌ను ఆదేశిస్తున్నా. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు వాళ్లకు సంబంధించిన యూట్యూబ్, వ్యవస్థలు అందరూ కొత్త టేపు కొనుక్కొని నా ఇల్లు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్నా, చివరకు ఒక ఇటుకపెల్ల ఉన్నా వెంటనే ఇల్లు మొత్తం పడగొట్టండి. ఇది పొంగులేటి చాలెంజ్.

- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సవాల్ ఇది. తొలుత గాంభీర్యాన్ని ప్రదర్శించినా, ఆ తర్వాత గూగుల్ తల్లి మంత్రి గారి సౌధం గుట్టు విప్పింది. అంతేకాదు.. పురపాలక శాఖ 500 మీటర్ల (అర కిలోమీటరు) నిబంధన కూడా తెరపైకి రావటంతో ఇప్పటివరకు మంత్రువర్యులు నోరు మెదిపింది లేదు. రంగనాథ్ కాదు కదా.. కనీసం జలమండలి అధికారులు పాత టేపులను తీసుకొని కూడా అక్కడికి వెళ్లలేదు.

పెద్దోళ్ల సవాల్.. పేదోళ్ల ఇండ్లు ఢమాల్

మొదటిపేజీ తరువాయి...

నిర్మాణాలు మినహా అందరూ సామాన్యులే. కొందరు నిరుపేదలు కూడా ఉన్నారు. హైడ్రా ఏర్పాటైన నెలన్నర వ్యవధిలోనే ఎందరో సామాన్యులు నిలువ నీడ లేకుండా వీధిన పడ్డారు. పైసాపైసా కూడబెట్టుకొని, జీవితాశయంగా నిర్మించుకున్న కలల సౌధాలను సర్కారు నిర్దాక్షిణ్యంగా కండ్ల ముందే నేలమట్టం చేస్తుంటే గుండెలు అవిసేలా రోదించారు. కనీసం సామాను తీసుకునే సమయమైనా ఇవ్వండంటూ కాళ్లావేళ్లా పడ్డారు. ఏ ఒక్క అధికారి గుండె కరగలేదు. ఏ ఒక్క ప్రభుత్వ పెద్ద కనికరించలేదు. మరి.. ఎన్నాళ్లీ ‘పెద్దోళ్ల సవాల్.. పేదోళ్ల ఇండ్ల ధమాల్’ నీతి అని సామాన్యుడు ప్రశ్నిస్తున్నాడు.

రేవంత్ చెప్పినా బుల్డోజర్లు పోవటం లేదేం?


జంట జలాశయాల పరిధిలో పెద్దోళ్ల ఫాంహౌస్‌లు అక్రమమంటూ సీఎం రేవంత్‌రెడ్డి పదేపదే తన ప్రసంగాల్లో అధికారికంగానే ప్రకటిస్తున్నారు. ఒకటీ.. రెండు సార్లు కాదు! ఇప్పటివరకు దాదాపు ఏడెనిమిది వేదికలపై ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ.. పెద్దోళ్లు మురుగు వదిలితే ఆ నీటిని నగరవాసులు తాగాల్నా? అని ప్రశ్నించారు. నిజంగా ఇది అనాగరికమే! అయినా.. జంట జలాశయాల వైపు బుల్డోజర్లు మాత్రం పోవటం లేదు. ఆగస్టు 18న గండిపేట ఎఫ్‌టీఎల్‌లో ఉన్నదంటూ ఓ పారిశ్రామికవేత్త నిర్మాణాన్ని కూల్చిన హైడ్రా, ఆపై అసలు 111 జీవో పరిధి తమది కానే కాదు.. అని నాలుక మడతేసింది. ‘కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ ఫాంహౌస్‌ను కూలగొట్టాల్నా? లేదా?’ అని రెండు రోజుల కిందట ప్రజలు ఉన్న సభలోనే సీఎం ప్రశ్నించారంటే అది అక్రమమని ఆయన ధ్రువీకరించినట్టే కదా. పక్కా సమాచారం ఉంటే తప్ప సీఎం హోదాలో ఉన్న వ్యక్తి ధ్రువీకరించరనేది ప్రతి ఒక్కరికీ తెలిసిన సత్యమే. దీంతో కేవీపీ ఫాంహౌస్ ఎక్కడ ఉన్నదనేది కొలతలు తీయాల్సిన అవసరమూ లేదు. నిబంధనల కోసం వెతకాల్సిన పనిలేదనేది పలువురి అభిప్రాయం. కాకపోతే ఇవన్నీ కాంగ్రెస్ పెద్దల నోటి నుంచి వస్తున్నాయేగానీ, నోసలు మాత్రం అధికారులకు ఆదేశాలు ఇవ్వటం లేదు. అందుకే జంట జలాశయాల పరిధిలో ఉన్న బడాబాబుల ఫాంహౌస్‌ల జోలికి హైడ్రా వెళ్లడం లేదు. సంబంధిత జలమండలి, నీటిపారుదలశాఖ అధికారులు కూడా పోవటం లేదు. వీటి వెనుక అంతర్యమేమిటి? అంటూ ప్రజల్లో సందేహాలు వెల్లువెత్తుతున్నాయి.

సామాన్యులకు అవకాశాలేవి?

పెద్దోళ్ల ఫాంహౌస్‌ల విషయంలో సీఎం మొదలు అధికారుల వరకు తర్జనభర్జనలు పడుతున్నారు. సవాళ్లు-ప్రతి సవాళ్లు విసురుకుంటున్నారు. సమయం ఇవ్వాలని చెబుతున్నారు. కానీ గత రెండు నెలలుగా రాష్ట్రంలో.. మరీ ముఖ్యంగా హైదరాబాద్, శివారు ప్రాంతాల్లో పేకమేడల్లా కూలిపోతున్న సామాన్యుల నిర్మాణాల విషయంలో మాత్రం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఈ అవకాశాలు ఇవ్వడం లేదు. ‘నోటీసులిస్తే కోర్టుకు పోతారు.. స్టే తెచ్చుకుంటారు.. అందుకే ఇవ్వటం లేదు’ అని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సెలవిచ్చారంటే.. సామాన్యుడు న్యాయస్థానాలను ఆశ్రయించే ప్రాథమిక హక్కును కూడా ఈ ప్రభుత్వం హరించివేసింది.

సామాన్యుడి ప్రశ్నలు.. జవాబివ్వు రేవంత్


- మంత్రి పొంగులేటి నా నిర్మాణం బఫర్ జోన్‌లో ఉన్నా కూల్చేయండి అంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేరు తీసుకొని ఆదేశించినా అవి అమలు కావు. సామాన్యుడు నా నిర్మాణాన్ని కూల్చొద్దని కాళ్లావేళ్లా పడినా బుల్డోజర్లు ఆగవు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, అనుమతులు, పన్ను రశీదులు చూపినా.. అవన్నీ అక్రమమే! అవసరమైతే అనుమతులు ఇచ్చిన అధికారులనూ సస్పెండ్ చేస్తామంటున్నారు.
- న్యాయవాదికి ల్యాండ్ పేపర్ చూసి అన్నీ సక్రమమే అని చెప్పాడని సీఎం అన్న తిరుపతిరెడ్డి అన్నారు. ఎఫ్‌టీఎల్‌లో ఉన్నట్టు కొనుగోలు సమయంలో తనకు తెల్వదు అని అమాయకత్వాన్ని ప్రదర్శించారు. మరి.. సామాన్యులు కూడా అంతే కదా. ఎవరైనా ఇది చెరువులో ఉన్నదని చెప్తే కొనుగోలు చేస్తారా? గతంలో అన్ని అనుమతులు ఉన్నందునే బ్యాంకు రుణాలు కూడా వస్తే ఇంటిని నిర్మించుకున్నారు. సీఎం అన్నకు ఇచ్చిన సమయం సామాన్యులకు ఎందుకు ఇవ్వడం లేదు?
- మంత్రి కోమటిరెడ్డి లేఖ రాసిన 48 గంటల్లో బుల్డోజర్లు సినీనటుడు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ సెంటర్‌ను కూల్చివేశాయి. మరి మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి.. మంత్రి ఉత్తమ్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. అంటే చెరువుల పరిరక్షణ అనేది ఒట్టి బూటకం అని అర్థమవుతున్నది.
- సామాన్యుల విషయంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించటమే కాదు.. అన్ని శాఖల నుంచి నివేదికలు తెప్పించుకుంటున్నారు. శాటిలైట్ చిత్రాలను జల్లెడ పడుతున్నారు. కానీ ఇబ్రహీంపట్నం పరిధిలో ఏకంగా నీటిపారుదల శాఖ ఇంజినీర్లు అక్రమమని తేల్చి పోలీస్ కేసులు పెట్టినా ఆ రిసార్ట్‌లు, విల్లాల జోలికి ఎవరికీ వెళ్లరు. దీని వెనుక ఉన్న మతలబు ఏంది?.



అజీజ్‌నగర్‌లోని కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ రామచంద్రారావు ఫాంహౌస్

‘అజీజ్‌నగర్‌లోని నా ఫాంహౌస్ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఒక్క అంగుళం ఉన్నట్టు అధికారుల సర్వేలో తేలినా సొంత ఖర్చులతో నేనే కూల్చివేయిస్తా. కాంగ్రెస్ నేతగా నాకు మినహాయింపులు వద్దు. సాధారణ పౌరుడి విషయంలో చట్టం ఎలా వ్యవహరిస్తుందో అదే చాలు. వీలు చూసుకొని అధికారులను ఫాంహౌస్‌కు పంపండి. చట్ట ప్రకారం మార్కు చేస్తే.. ఏదైనా కట్టడం దాని పరిధిలో ఉంటే.. 48 గంటల్లో నా సొంత ఖర్చులతో కూలుస్తా. మార్కింగ్ చేసే సమయం, తేదీ ముందే ప్రకటించండి’

-తాజాగా కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో చెప్పిన విషయాలివి. కేవీపీ రామచంద్రారావు ఫాంహౌస్ జలాశయానికి ఆనుకొనే ఉన్నదనేది అక్కడికి వెళ్లిన ఎవరికైనా కండ్ల ముందు కనిపించే దృశ్యం. అయినా కొలుచుకోండి! కూల్చుకుంట!! అంటారు. ఎందుకంటే హైడ్రా అటు పోయేది లేదు.. కూల్చేది లేదు.



దుర్గం చెరువు పరిధిలో సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి ఇల్లు

‘బాజాప్తా అనుమతి తీసుకొని ఇల్లు కట్టుకున్నాను. కట్టుకునే సమయంలో ఇది ఎఫ్‌టీఎల్ ఉన్నది. బఫర్‌జోన్‌లో ఉన్నదే విషయం నాకు తెలియదు. డాక్యుమెంట్లు తీసుకున్న. న్యాయవాదికి ఇచ్చిన. అంతా సరిగా ఉన్నదంటేనే ఇల్లును కొనుగోలు చేశా. నోటీసులు ఇస్తే ఇవ్వండి. కూల్చివేతలు నా ఒక్కడి కోసం కాదు. అందరి కోసం చేస్తున్నారు. అధికారులు చేయాలి. సీఎం ఏం చేస్తాడు? అక్రమ నిర్మాణాలుంటే కూల్చివేయాల్సిందే కదా’

-సీఎం రేవంత్‌రెడ్డి అన్న తిరుపతిరెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇవి. దుర్గం చెరువు పరిధిలో వెలిసిన అమర్ హౌసింగ్ సొసైటీ సభ్యులకు నెల వ్యవధితో అధికారులు నోటీసులు ఇచ్చారు. నెలన్నర గడిచినా అటువైపు కన్నెత్తి చూడలేదు. ఈలోగా హైకోర్టు నుంచి స్టే వచ్చింది. ఇంకేముంది.. అంతా గప్‌చుప్!

‘శ్రీశైలం జాతీయ రహదారి పక్కనే చేసిన కేఎల్ఆర్-వర్టెక్స్ గిగా సిటీ రియల్ వెంచర్‌తో సూరం చెరువు కబ్జాకు గురైన మాట వాస్తవమే. 60.32 ఎకరాల విస్తీర్ణంలోని సూరం చెరువును కబ్జా చేసి వెంచర్ చేసినట్టుగా నేనే చాలాకాలంగా ప్రభుత్వ, అధికార యంత్రాంగానికి ఫిర్యాదు చేస్తున్నా. కబ్జా నుంచి చెరువును విడిపించేందుకు పోరాటం చేస్తున్నా అధికారులు స్పందించటం లేదు. చివరకు మంత్రి ఉత్తమ్‌కు సైతం ఈ చెరువు కబ్జాపై ఫిర్యాదు చేసిన. ఈ వెంచర్‌లో సూరం చెరువు మాత్రమే కాదు.. మరో పదెకరాలకుపైగా విస్తీర్ణంలో ఉన్న కొత్త కుంటను కూడా మట్టితో పూడ్చారు. దీనిపైనా అధికారులకు ఫిర్యాదు చేసిన. కేసులు కూడా నమోదు చేయించా’

- మహేశ్వరం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి వ్యాఖ్యలు ఇవి. వాస్తవానికి ఈ వెంచర్ వ్యవస్థాపకుడే కేఎల్ఆర్. ఆ తర్వాత తాను వైదొలిగానంటారు. అది వేరే విషయం. సాక్షాత్తు నీటిపారుదల శాఖ మంత్రికి ఫిర్యాదుచేసినా చట్టం చేతులు ముడుచుకొనే కూర్చున్నది.

‘రంగారెడ్డి జిల్లా కాగజ్‌ఘాట్ పరిధిలోని అలీ చెరువు విస్తీర్ణం 25 ఎకరాలు. చెరువు పరిధిలో ఎన్ఆర్ డెవలపర్స్‌కు చెందిన ముప్పాళ్ల వెంకటనర్సయ్య అక్రమ నిర్మాణాలు చేపట్టారు. తగిన చర్యలు తీసుకోండి’.

- నడి చెరువులో రిసార్టు ఏర్పాటు చేసి, విల్లాలు కట్టడంపై నీటిపారుదల శాఖ ఏఈ ఈ ఆర్ శారద పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు (ఎఫ్ఐఆర్-110/ 2024)లోని సారాంశమిది. అంతేకాదు.. ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు చేపడుతున్నందున చర్యలు తీసుకోవాలని డీఈఈ సైతం హెచ్ఎండీఏకు లేఖ రాశారు. ఏ ఒక్క అధికారి కన్నెత్తి చూడరు. ఎందుకంటే బీహార్ అసెంబ్లీ బలపరీక్షకు కాంగ్రెస్ ఎమ్మెల్యేల క్యాంపు నిర్వహించింది ఇక్కడే. వారిని కలిసేందుకు రేవంత్ వస్తుండని ప్రభుత్వ నిధులతో చెరువులో రోడ్డును నిర్మించారు.

కాంగ్రెస్ ఆట.. రఘునందన్ పాట

హైడ్రాకు మద్దతుపై అనుమానాలు • పార్టీ ఎంపీపై బీజేపీలో రసవత్తర చర్చ



హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): మూసీ పరీవాహక ప్రాంతంలో హైడ్రా కూల్చివేతలపై మెదక్ ఎంపీ రఘునందన్‌రావు వ్యవహారసరళి బీజేపీలో హాట్‌టాపిక్‌గా మారింది. కూల్చివేతల విషయంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల కన్నా మిన్నగా సీఎం రేవంత్‌రెడ్డిని, కాంగ్రెస్ సర్కార్‌ను ఆయన వెనుకేసుకొస్తున్న తీరుపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఎన్ కన్వెన్షన్ కూల్చివేత నుంచి జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో కూల్చివేతల్లో వేల కుటుంబాలు నిలువనీడలేక రోడ్డుపాలవుతున్నాయి. ఈ కూల్చివేతలపై అధికార, ప్రతిపక్ష పార్టీలు అన్నతేడా లేకుండా రేవంత్‌సర్కార్‌పై ముప్పేటయుద్ధం ప్రకటిస్తున్నాయి. కానీ, ఎంపీ రఘునందన్‌రావు మాత్రం సీఎం రేవంత్‌రెడ్డికి రక్షణ కవచంగా నిలుస్తున్నట్టు ఆయన మాటలే వెల్లడిస్తున్నాయి. ‘ఏండ్ల తరబడి నీళ్లల్ల కట్టిన ఇండ్లను కూల్చాల్సిందే. ఆ ఇండ్లకు బ్యాంకు లోన్లు ఉన్నా కూల్చివేయాల్సిందే. అలా కూల్చటం చేతకాకపోతే హైడ్రా కమిషనర్ పక్కకు తప్పుకుంటే మంచిది’ అని రఘునందన్‌రావు వ్యాఖ్యానించారు. హైడ్రాను జిల్లాలకు విస్తరించాలని సూచించారు.

ఆయన రూటే సెపరేటు

పార్టీలు, ప్రజాప్రతినిధులు అందరూ ప్రజల పక్షాన ఉంటే ఒక్క రఘునందన్‌రావు మాత్రమే సీఎంను వెనకేసుకు రావటంలో ఆంతర్యం ఏమిటని బీజేపీలో చర్చ జరుగుతున్నది. కూల్చివేతల విషయంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధుల కన్నా ఎక్కువగా రఘునందన్‌రావు ఎందుకు మీదేసుకుంటున్నారు? అన్న చర్చ సాగుతున్నది. ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై రఘునందన్‌రావు చేసిన వ్యాఖ్యలపై హైకోర్టు సీరియస్ అయింది. న్యాయస్థానాన్ని కించపరిచేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

ముందో మాట.. వెనుకో మాట!

హైడ్రాపై కేంద్ర మంత్రుల తీరు ఇదీ • వీరి ప్రోద్బలంతోనే మరిన్ని అధికారాలు

గవర్నర్‌పై ఒత్తిడితోనే ఆర్డినెన్స్‌కు ఆమోదం

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): అక్రమ కట్టడాల పేరుతో పేద, మధ్య తరగతి కుటుంబాల ఇండ్లను కూల్చివేస్తున్న హైడ్రాకు సూపర్ పవర్స్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్సును గవర్నర్ ఆమోదించడం వెనుక ఇద్దరు కేంద్ర మంత్రుల సహకారం ఉన్నట్టు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. పైకి మూసీ బాధితుల పక్షాన ఉన్నట్టు నటిస్తూనే లోపల హైడ్రా చట్టాన్ని బలోపేతం చేయడానికి వారిద్దరు సహకరించినట్టు సమాచారం. ఒకవైపు పేదల ఇండ్ల మీదికి బుల్డోజర్లు దింపితే ప్రభుత్వాన్ని స్తంభింపచేస్తామని పత్రికా ముఖంగా ప్రకటనలు చేస్తూనే.. మరోవైపు గవర్నర్ మీద ఒక రకమైన ఒత్తిడి తీసుకొచ్చి ఆర్డినెన్స్ మీద సంతకం చేయించినట్టు తెలిసింది.

బీజేపీ ద్వంద్వ వైఖరి

హైదరాబాద్‌లోని మూసీ పరీవాహక ప్రాంతాల సందరీకరణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి వర్గాల ఇండ్లు కూల్చే విషయంలో బీజేపీ ద్వంద్వ వైఖరిని ప్రదర్శిస్తున్నది. ఆ పార్టీ నేతలు పేదల ఇండ్ల పైకి బుల్డోజర్లు ప్రయోగిస్తే సహించం అని పత్రికా ముఖంగా ప్రకటనలు చేయడం తప్ప ఇంతవరకు ప్రత్యక్ష ఆందోళనల్లోకి రాలేదు. బాధిత కుటుంబాలను పరామర్శించలేదు. రాష్ట్ర ప్రభుత్వం సామాన్య ప్రజలను రోడ్డుపాలు చేస్తూ అమానవీయంగా వ్యవహరిస్తున్నట్టు మెయిన్ స్ట్రీమ్ మీడియా, సోషల్ మీడియా రాస్తున్నది. దీనిపై వివరణ ఇవ్వాలని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించవచ్చు. లేదంటే రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రుల హోదాలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో ఒక రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేయవచ్చు. కానీ వారు ఇప్పటివరకు ఇటువంటి రాజ్యాంగ బద్ధమైన పనులేమీ చేయలేదు. కేవలం పత్రికా ప్రకటనలకు మాత్రమే పరిమితమై జబ్బలు చరుస్తూ వస్తున్నారు.

గవర్నర్‌పై ఒత్తిడి

హైడ్రాకు మరిన్ని విస్తృత అధికారాలు కల్పిస్తూ ప్రభుత్వం రూపొందించిన ఆర్డినెన్స్‌కు ఈ నెల ఒకటిన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆమోద ముద్ర వేశారు. పది రోజుల్లోనే వివాదాస్పద ఆర్డినెన్సును గవర్నర్ ఆమోదించటం ఆశ్చర్యంగా ఉంది. రాష్ట్ర క్యాబినెట్ ఆర్డినెన్సును గవర్నర్‌కు పంపిన వెంటనే కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ స్పందించి ఉంటే ఫలితం మరో రకంగా ఉండేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. హైడ్రా విధివిధానాలు, ప్రత్యేక అధికారాలు కల్పించటంపై తమ అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోవాలని కోరి ఉంటే గవర్నర్ ఇంత తొందరగా ఆమోదం తెలిపేవారు కాదని రాజ్‌భవన్ వర్గాలు చెప్తున్నాయి. నిజానికి ఈ ఆర్డినెన్స్‌పై గవర్నర్ పలు సందేహాలు వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఆయన దాదాపు 18 రకాల సందేహాలు వ్యక్తం చేసినట్టు తెలిసింది.



చేవెళ్ల మండలం కౌకుంట్లలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితారెడ్డి

ఫాంహౌస్‌లు ఎక్కడున్నాయో చూపించండి

ఉంటే చట్టరీత్యా కూల్చేయండి • సీఎం రేవంత్‌రెడ్డికి సబితారెడ్డి డిమాండ్

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 4 : తన కుమారులకు ఫాంహౌస్‌లు ఉన్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారని, అవి ఎక్కడున్నాయో ఆయనే చెబితే బాగుంటుందని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలోని స్వగ్రామమైన కౌకుంట్లలో మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి ఏది మాట్లాడాలో, ఏది మాట్లాడకూడదో తెలియని పరిస్థితిలో రేవంత్ రెడ్డి ఉన్నారని విమర్శించారు. తన కుమారులకు ఫాంహౌస్‌లు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం సరికాదన్నారు. అవి ఎక్కడున్నాయో ఆయనే స్వయంగా చూపిస్తే బాగుంటుందని డిమాండ్ చేశారు. ఫాంహౌస్‌లు ఉన్నాయని నిర్ధారిస్తే చట్టరీత్యా కూల్చివేసుకోవచ్చని సూచించారు. లేనివి ఉన్నట్టు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యతతో మాట్లాడితే బాగుంటుందని సూచించారు.

మా కన్నీళ్లు తుడిచేదెవరు?


మూసీవాసుల రోదన.. కొనసాగుతున్న ఆపరేషన్ రివర్‌బెడ్

మూసీ పరీవాహక ప్రాంతాల్లో తహసీల్దార్ల బృందాలు

నిర్వాసితులను తరలిస్తున్న అధికారులు.. నిర్వాసితుల ఆవేదన

హైదరాబాద్ సిటీబ్యూరో/ఎల్బీనగర్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ) : మూసీ ఆపరేషన్ నిర్వాసితుల్లో దడ పుట్టిస్తున్నది. తహసీల్దార్ల బృందం మూసీ పరీవాహక ప్రాంతాల్లో సంచరిస్తూ నిర్వాసితులను ఒప్పించే యత్నం చేస్తున్నది. ఆ బృందాలను చూస్తేనే అక్కడి జనం వణికిపోతున్నారు. విడదసీ.. తరలించు అన్నట్టుగా ఒక్కో బృందం కొన్ని కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని వారిని ఖాళీ చేయించే చర్యలకు పాల్పడుతున్నది. శుక్రవారం సైదాబాద్, నాంపల్లి, ఉప్పల్, నాగోల్ ప్రాంతాల్లో అధికారులు నిర్వాసితులతో చర్చించారు. తమంతట తాము ఖాళీ చేస్తే రూ.25 వేల పారితోషకం ఇస్తామంటూ ఆశ చూపించారు. కానీ చాలామంది తమ గూడును వదలడానికి అంగీకరించలేదు. కొంతమంది పెద్ద దిక్కులేని వాళ్లు భయంగానే అంగీకరించినట్టు చెప్తున్నారు. సైదాబాద్‌లో 32 కుటుంబాలను ఉప్పల్‌లోని ప్రతాప సింగారం డబుల్ బెడ్రూం ఇండ్లకు తరలించినట్టు అధికారులు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి మంచి బుద్ధి ప్రసాదించాలని, మూసీ పరీవాహకంలోని తమ ఇండ్లజోలికి రాకుండా చూడాలంటూ కొంతమంది మూసీ నిర్వాసితులు ఫణిగిరికాలనీ వెంకటసాయినగర్‌లోని సాయి సన్నిధి ఆలయంలో సాయిబాబాకు వినతి పత్రం అందజేశారు.

పండుగ పూట ఏడ్పినం



‘డబ్బులు పెట్టి జాగాలు కొనుక్కొని ఇండ్లు కట్టుకున్నం. మాది అక్రమ నిర్మాణం అంటే చెప్పుతో కొడతాం. ఎవడొస్తడో రమ్మను రేవంత్‌రెడ్డి. నిన్న, ఇయ్యాల వచ్చి మా ఇండ్లు కూల్చి వేస్తానంటే ఎలా? ఇక్కడి నుంచి పోయి ఎక్కడో చెత్త కుప్ప ప్రాంతంలో ఉండాలంటే ఎందుకు పోతాం? మా బాధలు ఏం చూసిండు రేవంత్‌రెడ్డి? మా వద్దకు రమ్మను. ఇండ్ల కూల్చివేతను మానుకుంటేనే మంచిది. లేకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. సీఎం సీటు నుంచే దింపేస్తం. మా ఇండ్లలో మేమే ఉంటాం. కొత్తపేటలోని పట్టాదారుల నుంచి కొనుగోలు చేశాం. మేం 35 ఏండ్ల క్రితం స్థలాలు కొని కట్టుకున్నాం. సీఎం పదవిలో ఉండి తాను ఏం మాట్లాడినా నడుస్తది అని రేవంత్‌రెడ్డి అనుకుంటే ఎట్లా? ఇల్లు పోతుందనే బాధతో ఏడ్చుకుంటూ బతుకమ్మను ఆడినం. అందుకే రేవంత్‌కు వ్యతిరేకంగా పాట పాడినం. మేం ఒక్కరం కాదు.. హైదరాబాద్ మొత్తం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నది. పాట పాడుతున్నది.

- ఓ మహిళ ఆక్రందన

కబ్జాదారులం కాదు.. యజమానులం


మొదటిపేజీ తరువాయి...

ఎలా? అది ప్రభుత్వ స్థలం అని, తామంతా కబ్జాదారులం అని అంటే ఎలా? అని మూసీ నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ‘సీఎం రేవంత్‌రెడ్డి మమల్ని భూకబ్జాదారులు అంటున్నారు. మేం భూకబ్జాదారులం కాదు. ఈ స్థలాలను కొనుకున్న యజమానులం. మా స్థలాల రక్షణ కోసం పోరాటం చేస్తున్నాం’ అంటూ కన్నీరుమున్నీరయ్యారు. దశాబ్దాల నుంచి ఇక్కడే ఉంటున్నామని, ఇప్పుడు ఆ జాగా తమది కాదని అధికారులు చెప్తుంటే ఏం చెయ్యాలో పాలుపోవటం లేదని వాపోతున్నారు. ‘ఇదంతా పట్టా స్థలమని గ్రామపంచాయితీ అనుమతులతో లే అవుట్లు ఏర్పాటు చేశాకే కొనుగోలు చేశాం. అన్ని అనుమతులతో ఇండ్లను కట్టుకున్నాం. పట్టా స్థలాల్లో నిర్మించిన ఇండ్ల జోలికి రాకుండా మూసీ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలి. మూసీ ప్రాజెక్ట్ రిపోర్టును ప్రజల ముందు ఉంచాలి’ అని ఎల్బీనగర్ నియోజకవర్గం మూసీ పరీవాహకంలోని చైతన్యపురి, కొత్తపేట డివిజన్లలోని కాలనీలు, బస్తీల ప్రజలు కోరుతున్నారు.

హైకోర్టు నుంచి స్టేలు

అన్ని అనుమతులతో నిర్మించిన తమ ఇండ్లను కూల్చేందుకు ప్రభుత్వ అధికారులు రావడంపై చైతన్యపురి ఫణిగిరికాలనీ శ్రీ వెంకటసాయినగర్ కాలనీ వాసులు సుమారు 17 మంది హైకోర్టు నుండి స్టేలు తీసుకున్నారు. తాము అన్ని అనుమతులతో ఇండ్లను నిర్మించుకుంటే ఇలా మూసీ ప్రాజెక్ట్ పేరుతో తమ నివాసాలను కూల్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఫణిగిరికాలనీకి చెందిన మరో 16 మంది కూడా హైకోర్టును ఆశ్రయించారు.

అనుమతులు ఉన్న ఇండ్లను వదిలేయాలి



ముందు మూసీ ప్రాజెక్ట్ రిపోర్టును ప్రజల ముందు ఉంచాలి. అన్ని అనుమతులతో నిర్మించిన నివాసాలను వదిలి మూసీ ప్రాజెక్ట్‌ను చేపట్టాలి. పట్టా స్థలాలు వదిలి మూసీకి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మించాలి. మూసీ లోయర్‌లో ఉన్న వారికి కూడా తహసీల్దార్ కన్వీన్స్ డీడ్ ఇచ్చారు. 1978లో గ్రామపంచాయితీ లే అవుట్‌తో ప్లాట్లు కొన్నాం.

- నర్సింహప్రసాద్, వెంకటసాయి నగర్, చైతన్యపురి


అప్పు చేసి జాగా కొనుక్కున్నాం



ఎంతో శ్రమించి, కష్టపడి సంపాదించి కూడబెట్టిన డబ్బులు, కొంత అప్పు చేసి ఇటీవలే ఫణిగిరి కాలనీలో 160 గజాల స్థలాన్ని రూ.40 లక్షలకు కొనుగోలు చేశాను. ఇల్లు కట్టుకోవాలని కలలు కంటున్నాను. అంతలోనే పిడుగుపాటు వార్త వినిపించింది. ఈ స్థలం రివర్‌బెడ్‌లో ఉన్నదంటూ మార్కింగ్ చేశారు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

- గొల్లపూడి వేణుగోపాల్, ఫణిగిరి కాలనీ

25 ఏండ్లుగా ఇక్కడే ఉంటున్నా



కార్పెంటర్‌గా కాయాకష్టం చేసి సంపాదించిన డబ్బుతో 25 ఏండ్ల క్రితం 100 గజాల స్థలంలో ఇల్లు కట్టుకుని ఉంటున్నాం. ఇప్పుడు మూసీ అభివృద్ధి అంటూ సీఎం రేవంత్‌రెడ్డి మా ఇండ్లను కూల్చేందుకు సిద్ధం అవుతున్నాడు. మూసీకి 100 మీటర్ల దూరంలో ఉన్నా మా ఇంటికి రివర్‌బెడ్ అంటూ మార్కింగ్ చేశారు. మా కుటుంబ పరిస్థితి ఏమిటి? మూసీ అభివృద్ధి చేయాలి కానీ కానీ పేదల ఇండ్లను కూల్చొద్దు.

- వీరాచారి, ఫణిగిరి కాలనీ

225 ఎకరాల రా‘జీ’కీయం..!

- 3,375 కోట్ల విలువైన సర్కారు భూములు ధారాదత్తమేనా?
- సుల్తాన్‌పల్లి జాగీర్దారీ భూములపై రేవంత్ సర్కారు మౌనం
- బీఆర్ఎస్ హయాంలోనే తీవ్రంగా యత్నించిన ప్రకాశ్‌గౌడ్
- సొంతపార్టీ ఎమ్మెల్యే అయినా రాజీపడని కేసీఆర్ ప్రభుత్వం
- అవి ప్రభుత్వ భూములేనని కోర్టుల్లో రెవెన్యూశాఖ అఫిడవిట్
- వాటి కోసమే రాజేంద్రనగర్ ఎమ్మెల్యే పార్టీ మారినట్టు ఆరోపణ
- భూముల వెనక ప్రకాశ్‌గౌడ్‌తోపాటు పలువురు ప్రభుత్వ పెద్దలు
- ప్రత్యక్షంగా వ్యవహారం నడుపుతున్న ఏపీ సీఎం బంధువు
- కేసీఆర్ హయాంలో ఇలాంటి భూముల కోసం న్యాయపోరాటం



హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి/మణికొండ, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి పరిధిలో దశాబ్దాలపాటు న్యాయ చిక్కుల్లో ఉన్న ప్రభుత్వ భూములను కేసీఆర్ ప్రభుత్వం పదేండ్ల కాలంలో కాపాడుకున్నది. కింది కోర్టులు.. హైకోర్టులు.. ఆ పైకోర్టుల వరకూ వెళ్లయినా ప్రైవేటు వ్యక్తులకు అవి దక్కకుండా దాదాపు రూ.50-60 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను పరిరక్షించుకున్నది. సర్కారు ల్యాండ్ బ్యాంకును బలోపేతం చేసింది. ఎక్కడా ప్రైవేటు వ్యక్తులతో రాజీ పడకుండా ప్రభుత్వ భూములను ప్రజా ప్రయోజనాలకు వినియోగించేలా చర్యలు తీసుకున్నది. కొందరు సొంతపార్టీ నేతలు ఒత్తిడి తెచ్చినా వెనక్కి తగ్గలేదు. భూములను ప్రయివేటు పరం కానివ్వలేదు. కానీ ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఓ ఎమ్మెల్యే మాత్రం ఆ భూముల కోసమే పార్టీ ఫిరాయించారన్నది బహిరంగ రహస్యం. సుల్తాన్‌పల్లిలోని 3,375 కోట్ల విలువైన 225 ఎకరాల ప్రభుత్వ భూమిని సదరు ఎమ్మెల్యే చెరపట్టారు! కేసీఆర్ హయాంలో వాటిని తమపరం చేసుకోవడానికి శతవిధాలా ప్రయత్నించినా వీలుకాకపోవడం, పైగా ప్రభుత్వం పకడ్బందీగా న్యాయపోరాటం చేయడంతో వెనక్కి తగ్గిన ఆయన.. ఇటీవల కాంగ్రెస్‌లో చేరి తాను ఆక్రమించిన భూములకు అధికారిక ముద్ర వేయించుకునే పనిలో పడ్డారు. ప్రభుత్వానికి చెందిన ఆ భూములపై న్యాయపోరాటం చేసి కాపాడాల్సిన కాంగ్రెస్ సర్కారు మాత్రం చేష్టలుడిగి చూస్తున్నది. పదేండ్లు కేసీఆర్ కాపాడిన ప్రభుత్వ భూములను.. రేవంత్ సర్కార్ ఎందుకు కాపాడలేకపోతున్నదన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. కాంగ్రెస్ సర్కార్ ఉద్దేశపూర్వక మౌనం అక్రమార్కులకు అవకాశం ఇచ్చినట్టుగా ఉన్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

5 వేల కోట్ల భూములు స్వాధీనం

రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మంచిరేవుల గ్రామంలోని సర్వే నెంబరు 391/1 నుంచి 20 వరకు 393 ఎకరాల భూమి. ఇందులోని 142.39 ఎకరాల భూమిని 1961లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భూమిలేని నిరుపేదలకు కేటాయించింది. అనంతరం మూడు దశాబ్దాల తర్వాత అంటే 1990 దశకంలో ల్యాండ్ అసైనీలు ఒక వ్యక్తికి జీపీఏ చేశారు. ఇది నిబంధనలకు విరుద్ధం కావడంతో 2005లో అప్పటి ప్రభుత్వం భూమిని స్వాధీనం చేసుకొని గ్రేహౌండ్స్‌కు కేటాయించింది. దీంతో అసైనీలు హైకోర్టును ఆశ్రయించారు. 2010లో హైకోర్టు సింగిల్ జడ్జి అసైనీలకు అనుకూలంగా తీర్పునిచ్చారు. ప్రభుత్వం హైకోర్టు డివిజన్ బెంచ్‌కు వెళ్లింది. తెలంగాణ ఏర్పాటు తర్వాత పటిష్టమైన ఆధారాలతో బీఆర్ఎస్ ప్రభుత్వం న్యాయపోరాటం చేసింది. ఫలితంగా 2022లో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చింది. గ్రేహౌండ్స్‌కు భూ కేటాయింపును హైకోర్టు సమర్థించింది. దీంతో అసైనీలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అక్కడ కూడా కేసీఆర్ ప్రభుత్వం సమర్థంగా న్యాయపోరాటం చేసింది. పక్కా ఆధారాలతో వాదనలు వినిపించింది. దీంతో నిరుడు ఆగస్టులో సుప్రీంకోర్టు తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వెలువరించింది. ఎకరా రూ.35 కోట్ల చొప్పున రూ.5వేల కోట్లు విలువైన భూమిని కేసీఆర్ ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ప్రజా ప్రయోజనాలకు దానిని వినియోగించింది.

623 ఎకరాల కోకాపేట భూములపై 15 ఏండ్లకు విజయం

రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం కోకాపేట పరిధిలో ఏకంగా 623 ఎకరాల భూమిపై కేసీఆర్ ప్రభుత్వం సమర్థవంతమైన వాదనలు వినిపించి, ఏకంగా 15 సంవత్సరాలపాటు సుదీర్ఘంగా కొనసాగిన కేసుకు ముగింపు పలికింది. కోకాపేట పరిధిలోని పలు సర్వే నంబర్లలో 1,635 ఎకరాల భూమి ఉన్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ ప్రభుత్వం హెచ్ఎండీఏ భూములను వేలం వేసింది. ఇందులో భాగంగా కోకాపేటలోని ఈ భూములను కూడా వేలం వేసినపుడు, అందులో 635 ఎకరాలను గోల్డెన్ మైల్ ప్రాజెక్టు కింద ఒక కార్పొరేట్ కంపెనీ దక్కించుకుంది. నిబంధనల ప్రకారం వేలం మొత్తంలో కొంత వాయిదాల రూపంలో ప్రభుత్వానికి ఆ కంపెనీ చెల్లించింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఆ భూముల్ని వేలం వేసిందేగానీ.. అందులోని న్యాయపరమైన చిక్కులపై దృష్టిసారించలేదు. దీంతో కొందరు వ్యక్తులు ఇది తమ భూమి అంటూ న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఫలితంగా ఆ భూములు న్యాయపరమైన చిక్కుల్లో పడటంతోపాటు వేలంలో దక్కించుకున్న కంపెనీ సైతం వాయిదాలు చెల్లించకుండా తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని కోర్టును ఆశ్రయించింది. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత సుదీర్ఘ న్యాయపోరాటం చేయడంతో సుప్రీంకోర్టులో హెచ్ఎండీఏకు అనుకూలంగా తీర్పు వచ్చింది. 15 ఏండ్ల తర్వాత అంటే 2017లో సుప్రీం తీర్పుతో 623 ఎకరాల భూమిపై హెచ్ఎండీఏకు హక్కులు దక్కాయి. కోకాపేట పరిధిలో ఎకరా రూ.50 కోట్లు అనుకున్నా.. ప్రభుత్వ పరమైన దీని విలువ సుమారు రూ.30వేల కోట్లపైనే!



ఓ రైతుకు ఇచ్చిన చెక్కు

కేసీఆర్ సర్కార్ చొరవతో భూముల పరిరక్షణ

కూకట్‌పల్లిలోని సర్వేనెంబరు 1009లో ఉన్న 20 ఎకరాల భూమిపై నెలకొన్న న్యాయపరమైన చిక్కులను కేసీఆర్ ప్రభుత్వం సమర్థవంతమైన వాదనలతో పరిష్కరించింది. రెండు దశాబ్దాల తర్వాత సుప్రీంకోర్టు ఈ భూమిపై తెలంగాణ హౌసింగ్ బోర్డుకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీంతో రూ.700 కోట్ల విలువైన భూమి హౌసింగ్ బోర్డుకు దక్కింది.

రెండున్నర దశాబ్దాలకు మోక్షం

పరశ్‌రామ్ రామ్‌చంద్ మలానీ అనే వ్యక్తికి పాకిస్తాన్‌లోని సింధ్‌లో 83.11 ఎకరాల భూమి ఉండేది. దేశ విభజన సమయంలో అతను హైదరాబాద్ వచ్చి స్థిరపడ్డారు. ఈ నేపథ్యంలో 1952, నవంబరు 22న బొంబాయి సెటిల్‌మెంట్ క్లెయిమ్ ఆఫీసర్ ఇచ్చిన ఆదేశాల మేరకు సింధ్‌లోని ఆ భూమికి బదులుగా ఇక్కడ 200 ఎకరాల భూమిని కేటాయించాలని దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు సీసీఎల్ఏ అధికారులు 2003, 2006లో పుప్పాలగూడలో 198.30 భూమిని ఆయన కుటుంబానికి కేటాయించారు. అనంతరం ఆ కేటాయింపును అప్పటి ఏపీ ప్రభుత్వం రద్దు చేసింది. దీనిపై సదరు వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించారు. కేటాయింపును రద్దు చేయడాన్ని 2016లో హైకోర్టు సమర్థించింది. తిరిగి కేసు సుప్రీంకోర్టు దాకా వెళ్లింది. ఇక్కడ కూడా కేసీఆర్ ప్రభుత్వం సమర్థవంతమైన వాదనలు వినిపించడంతో చివరకు 2019 అక్టోబరులో సుప్రీంకోర్టు తుది తీర్పు ఇచ్చింది. కాందిశీకుల భూములను కేటాయించే అధికారం సీసీఎల్ఏకు లేదని తేల్చి చెప్పింది. దీంతో ఎకరా రూ.35 కోట్ల వరకు విలువ ఉండే రూ.7వేల కోట్ల సర్కారు ఆస్తిని కేసీఆర్ ప్రభుత్వం కాపాడింది.

నకిలీ గుట్టును విప్పి రూ.10వేల కోట్ల భూముల స్వాధీనం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాప్రయోజనాల కోసం సేకరించిన భూమిని హెచ్ఎండీఏ కాపాడటంలో విఫలమై, ప్రైవేటు వ్యక్తులు స్వాధీనం చేసుకున్నప్పటికీ కేసీఆర్ ప్రభుత్వం పకడ్బందీగా న్యాయ పోరాటం చేసింది. సదరు ప్రైవేటు వ్యక్తుల నకిలీ లీలల్ని బయటపెట్టి శంషాబాద్‌లో ఏకంగా 181 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంది. 1990లో అప్పటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వం హెచ్ఎండీఏ ద్వారా ట్రక్ టెర్మినల్ కోసం శంషాబాద్‌లోని సర్వేనెంబరు 661, 721, 725ల్లో మూడు అవార్డుల ద్వారా మొత్తం 181 ఎకరాలను సేకరించింది. హెచ్ఎండీఏ ఆధీనంలోనే ఈ భూమి ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో అన్యాక్రాంతమవుతూ వచ్చింది. ఈ క్రమంలో కొందరు వ్యక్తులు ఇది వారసత్వంగా తమకు వచ్చిన భూమి అంటూ స్వాధీనం చేసుకోవడమే కాకుండా న్యాయస్థానాలను ఆశ్రయించారు. కేసీఆర్ ప్రభుత్వం సమర్థవంతమైన న్యాయవాదులను నియమించగా.. సదరు వ్యక్తులు కోర్టును తప్పుదోవ పట్టించేలా సమర్పించిన నకిలీ డాక్యుమెంట్ల గుట్టును కోర్టు ముందే విప్పారు. దీంతో కోర్టు తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పునివ్వగా.. ‘ఆపరేషన్ శంషాబాద్’ పేరిట ప్రభుత్వం ఆ భూమిని స్వాధీనం చేసుకున్నది. సుమారు రూ.10వేల కోట్ల భూమిని ప్రైవేటు వ్యక్తుల నుంచి కాపాడి ప్రభుత్వ ల్యాండ్ బ్యాంకులో జమ చేసింది. ఇలా చెప్పుకుంటూ పోతే అక్రమార్కుల చెర నుంచి కేసీఆర్ సర్కారు కాపాడిన భూముల విలువ సుమారు 60వేల కోట్ల వరకూ ఉంటుంది.

మరి... ఇప్పుడు?!

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం సుల్తాన్‌పల్లిలో ఏకంగా 225 ఎకరాల భూమి. వాస్తవానికి ఇవి జాగీర్దారీ భూములు. వీటి విలువ కనీసంగా రూ.రూ.3,375 కోట్ల వరకు ఉంటుంది. నిబంధనల ప్రకారం.. ఈ భూములు గతంలో కేటాయించిన రైతుల చేతుల్లోనైనా ఉండాలి, లేకపోతే ప్రభుత్వ ఆధీనంలోనైనా ఉండాలి. రైతులు అమ్ముకునేందుకు వీలులేదు. ఇతరులు కొనుగోలు చేసేందుకూ నిబంధనలు అంగీకరించవు. ఈ క్రమంలో భూముల వ్యవహారం రంగారెడ్డి కోర్టుతోపాటు హైకోర్టు వరకూ వెళ్లింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రికార్డులు తారుమారు చేసేందుకు చాలామంది ప్రయత్నించి విఫలమయ్యారు. చివరకు అప్పుడు అధికార పార్టీలోని ఎమ్మెల్యే సైతం అన్ని మార్గాల్లోనూ ఒత్తిడి చేశారు. అయినా కేసీఆర్ ప్రభుత్వం ససేమిరా అన్నది. న్యాయస్థానాల్లో రెవెన్యూ శాఖ తరపున అవి మా భూములేనంటూ అఫిడవిట్లు కూడా వేయించింది. కానీ ఇప్పుడు క్రమేణా కేసులు డిస్పోజ్ అయ్యాయి. ఈ క్రమంలో వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడుకునేందుకు రాష్ట్రప్రభుత్వం ఏం చేయాలి?! సుప్రీంకోర్టు వరకు వెళ్లయినా న్యాయపోరాటం చేయాలి. కానీ రేవంత్ ప్రభుత్వం మాత్రం మౌనం వహిస్తున్నట్టు తెలిసింది. అంతేకాదు.. అసలు ఆ భూముల అంశంలో ప్రభుత్వపరంగా రెవెన్యూశాఖ కనీసం తొంగి చూడటం లేదు. గతంలో ఒత్తిడి తెచ్చిన ఎమ్మెల్యే మళ్లీ గెలిచి ఇప్పుడు గోడ దూకి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దీంతో నెమ్మదిగా ఈ భూములు కార్పొరేట్ పరం అయ్యాయి. క్షేత్రస్థాయిలో భూములను చదును చేయడంతోపాటు చుట్టూ రేకులతో ప్రహరీ నిర్మించి.. కోర్టులో కేసు గెలిచాం, ఈ భూములు తమవేనంటూ బోర్డులు కూడా వెలిశాయి. రేపోమాపో రెవెన్యూ రికార్డుల్లోనూ భూములు వారికి ధారాదత్తం చేసేందుకు పావులు కదులుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఏమిటా భూములు.. ఏమా కథ?

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని సుల్తాన్‌పల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో 122, 123, 124, 125, 126తోపాటు 143 నుంచి 150ఏ, 151 ఏ, 152ఏ, 153ఏ, 154 వరకు మొత్తం 225 ఎకరాల భూమి ఉన్నది. 1954-55 నుంచి రికార్డుల్లో జాగీర్దార్లు సయ్యద్ షాబుద్దీన్, సయ్యద్ హైదర్ హుస్సేన్ నుంచి వారి వారసులైన మహ్మద్ తాయర్ అలీఖాన్, అమీర్ ముల్కీ అనే ఇద్దరికి వారసత్వంగా వచ్చింది. ఇదే సమయంలో గ్రామానికి చెందిన 75 మంది రైతులు ఆ భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించారు. రైతులు ఎలాగూ సేద్యం చేస్తున్నందున వారికి ఒక్కో నాగలి చొప్పున ఆ భూమిని జాగీర్దార్లు పంపిణీ చేశారు. అంటే ఒక్కో రైతుకు నాగలికి మూడు ఎకరాల చొప్పున ఇచ్చారు. ఇలా 225 ఎకరాల్లో దశాబ్దాలుగా రైతులే సాగు చేసుకుంటూ వచ్చారు. వారి పేర్లు రికార్డుల్లో (ప్రొటెక్ట్ టెనెంట్) పీటీదారులుగా నమోదై ఉన్నాయి. కాగా 1998 ప్రాంతంలో తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ ఎంపీ తులసీరాం తనతోపాటు తన కుటుంబ సభ్యుల పేరిట ఆ భూములను కొనుగోలు చేశానంటూ రైతులను అందులోకి రానీయకుండా అడ్డుకున్నారు. భూమిలోకి వచ్చిన రైతులపై కేసులు నమోదు చేసి తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. దీంతో 1998 నుంచి 2023 వరకు ఆ భూమి సాగులేక పూర్తిగా చెట్లు, పొదలతో నిండిపోయింది. జాగీర్దారీ భూములపై తమకు హక్కు కల్పించాలంటూ పీటీదారులుగా ఉన్న రైతులు రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వానికి అనేకసార్లు మొరపెట్టుకున్నారు. అయినా న్యాయం జరగలేదు. 2004లో అప్పుడే అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాజీవ్ పల్లెబాట పేరుతో చేవెళ్ల నుంచి పాదయాత్రగా శంషాబాద్‌కు వస్తుండగా మార్గమధ్యంలో ఉన్న సుల్తాన్‌పల్లి గ్రామస్తులు, రైతులు తమకు భూమిపై హక్కు కల్పించాలని వైఎస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ క్రమంలో వారికి న్యాయం జరుగుతుందని అందరూ ఆశించినా చివరికి నిరాశే ఎదురైంది.

ఆ భూములపై కన్నేసి..

నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో చేవెళ్ల నియోజకవర్గం నుంచి విడిపోయిన కొన్ని ప్రాంతాలు రాజేంద్రనగర్ నియోజకవర్గంలో భాగమయ్యాయి. తెలుగుదేశం పార్టీ నుంచి పోటీ చేసిన టీ ప్రకాశ్‌గౌడ్ రాజేంద్రనగర్ ఎమ్మెల్యేగా గెలిచారు. అప్పటి నుంచి సుల్తాన్‌పల్లి గ్రామస్తులు, రైతులు 225 ఎకరాల భూమిపై మాకు హక్కు కల్పించాలని పలుమార్లు ఆయనకు వినతిపత్రాలు ఇచ్చారు. రైతుల సమస్యల్ని పరిష్కరించాల్సిన ఆయన ఆ భూములపై కన్నేసినట్టు విమర్శలున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి దగ్గరి బంధువైన పురుషోత్తంనాయుడు, వ్యాపారవేత్త ధర్మేంద్ర శర్మతోపాటు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలకపాత్ర పోషిస్తున్న కొందరు (గతంలో టీడీపీ) కూడా ఇందులో పెట్టుబడులు పెట్టడం ప్రారంభించారు. అమాయకులైన రైతుల్లో భయాందోళనలను సృష్టించి అగ్గువ ధరకే భూములను కొనుగోలు చేశారు. వీరంతా విజన్ రిసార్ట్స్ పేరిట రైతులకు చెక్కులను ఇచ్చి, ఒప్పందాలు కుదుర్చుకున్నారు. మూడెకరాలకు రూ.27 లక్షల చొప్పున చెల్లించి పలువురు రైతుల నుంచి భూమిని తీసుకున్నారు. మరోవైపు తులసీరాం కూడా టీడీపీకి చెందిన నాయకుడే కావడంతో వీరంతా ఒక ఒప్పందానికి వచ్చారు. అంతర్గతంగా చర్చల సారాంశమేమిటోగానీ.. తులసీరాం ఈ భూముల వ్యవహారం నుంచి తప్పుకున్నారు. ఈ క్రమంలో తులసీరాం, అతని కుటుంబ సభ్యుల నుంచి విజన్ రిసార్ట్స్ అనే సంస్థకు చెందిన ధర్మేంద్ర శర్మ, పురుషోత్తం నాయుడు (ఏపీ సీఎం చంద్రబాబు బంధువు)తోపాటు కొంతమంది ఈ భూములను కొనుగోలు చేసినట్టు రికార్డులు (డాక్యుమెంట్ నంబర్ 3948/ 2006) సృష్టించారు. ఈ విషయం తెలియని కొందరు రైతులు సమస్యను పరిష్కరించాలంటూ ఎమ్మెల్యే చుట్టే తిరగడం ఇక్కడ అత్యంత గమనించాల్సిన అంశం.

ఎక్కే గడప.. దిగే గడప..

రైతుల శ్రేయస్సు కోసం ప్రజాప్రతినిధి ఎక్కే గడప.. దిగే గడప. అన్నట్టుగా శ్రమిస్తే మంచి పేరొస్తుంది. పది కాలాలపాటు రైతులూ గుర్తుంచుకుంటారు. కానీ రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ఈ భూముల కోసం ఏ పార్టీ అధికారంలో ఉంటే అందులోకి జంప్ కావడం తంతుగా పెట్టుకున్నారనే విమర్శలు ఉన్నాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014లో టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న ప్రకాశ్‌గౌడ్ టీఆర్ఎస్‌లోకి వచ్చారు. వాస్తవానికి ఈ భూముల కోసమే ఆయన వచ్చినప్పటికీ.. కేసీఆర్ ప్రభుత్వం ప్రకాశ్‌గౌడ్ పాచికను పారనీయలేదు. జాగీర్దారీ భూములైనందున వాటిని నిజమైన అర్హులుగా ఉన్న పేద రైతులకు ఇవ్వాలని, అలాంటి భూములను ఎమ్మెల్యేగా ఉంటూ కొనుగోలు చేయడం సరికాదని నేరుగా ప్రకాశ్‌గౌడ్‌కే అప్పటి సీఎం కేసీఆర్ సూచించినట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. దీంతో ఆ భూముల వ్యవహారాలను పక్కన బెట్టిన ప్రకాశ్‌గౌడ్, నాలుగోసారి ఎమ్మెల్యే కాగానే.. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలో చేరి భూముల వ్యవహారాన్ని చివరి అంకానికి తెచ్చుకునేందుకు తండ్లాడుతున్నట్టు తెలిసింది.

న్యాయస్థానాల పరిధిలోకి..

సుల్తాన్‌పల్లి భూముల వ్యవహారం గతంలోనే క్రమంగా న్యాయస్థానాల పరిధిలోకి వెళ్లిపోయింది. ముఖ్యంగా రైతులు వర్సెస్ తులసీరాంగా కేసులు మొదలుకాగా ఇందులో తెలంగాణ ప్రభుత్వం తరపున రెవెన్యూశాఖ కూడా గతంలో అఫిడవిట్ దాఖలు చేసింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ఈ భూములు జాగీర్దారీ భూములైనందున.. ఉంటే రైతుల చేతుల్లో ఉండాలిగానీ ప్రైవేటు వ్యక్తుల కొనుగోలు చెల్లదని రెవెన్యూశాఖ తరపున వాదనలు కోర్టు ముందుకు పోయాయి. అయితే ఇవి జాగీర్దారీ భూములు కావనేది తులసీరాం తరపు న్యాయవాది వాదన. ఇలా ఏండ్ల తరబడి కోర్టుల్లో వివాదం కొనసాగుతూ వచ్చింది. ఈ వ్యవహారం ఒకవైపు హైకోర్టుతోపాటు రంగారెడ్డి జిల్లా కోర్టులోనూ ఉన్నది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సీను తారుమారైంది. కొంతకాలంగా విజన్ రిసార్ట్స్ వాళ్లు భూమిలోకి ప్రవేశించి చదును చేసి, చుట్టూ రేకుల ప్రహరీని ఏర్పాటు చేశారు. కోర్టులో కేసు నడుస్తుండగానే.. పరిష్కారమైనట్టుగా బోర్డులు ఏర్పాటు చేశారు. ఇది విజన్ రిసార్ట్స్‌కే చెందినదిగా ఆ బోర్డుల్లో పేర్కొన్నారు. అనంతరం నెమ్మదిగా హైకోర్టు.. ఆపై ఇటీవల రంగారెడ్డి కోర్టులో కేసు డిస్పోజ్ అయ్యింది. ముఖ్యంగా రైతులు రాజీ పడటంతో కేసు డిస్పోజ్ అయినట్టుగా కొందరు రైతులు తెలిపారు.

అధికారుల చేతులు కట్టేసిన రేవంత్ సర్కార్

వాస్తవానికి గత పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వ వైఖరి మేరకు ఈ భూముల పైనా తెలంగాణ ప్రభుత్వం న్యాయ పోరాటం చేయాలి. జాగీర్దారీ భూములైనందున.. అర్హులైన రైతుల ఆధీనంలోనైనా ఉండాలి, లేకపోతే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. అప్పటివరకు న్యాయ పోరాటం కొనసాగుతూనే ఉండాలి. గతంలోని అనేక కేసుల్లో కూడా కేసీఆర్ ప్రభుత్వం సమర్థవంతమైన న్యాయవాదులను పెట్టి భూములను కాపాడిన చరిత్ర ఉన్నది. రెవిన్యూ, హెచ్ఎండీఏ తదితర శాఖల అధికారులు కూడా ఇదే పట్టుతో ఉండేవారు. కానీ ఇప్పుడు గతంలో అఫిడవిట్ దాఖలు చేసిన రెవెన్యూశాఖ సైతం చేతులు ముడుచుకొని కూర్చుంది. ప్రభుత్వ పెద్దల మౌఖిక ఆదేశాలతో న్యాయపరంగా ప్రభుత్వం తరపున ఒక్క అడుగు కూడా వేయడం లేదు. ఎలాగూ రైతులు రాజీ పడటంతో కోర్టుల్లో కేసులు డిస్పోజ్ అయినందున దాని పేరిట విజన్ రీసార్ట్స్ రూ.3375 కోట్ల విలువైన 225 ఎకరాలను స్వాధీనం చేసుకున్నది. కాకపోతే ప్రస్తుతం రెవెన్యూ రికార్డుల్లో ఇప్పటికీ అంశం కోర్టు కేసుల్లో ఉన్నదని వస్తున్నది. రేవంత్ సర్కార్ మౌనాన్ని చూస్తుంటే.. రేపోమాపో ధరణిలో ఈ రికార్డులు విజన్ రిసార్ట్స్ పేరిట మారినా ఆశ్చర్యపోనక్కర్లేదు. నిబంధనల ప్రకారమైతే అవి జాగీర్దారీ భూములైనందున రైతులు సమ్మతించినా క్రయ, విక్రయాలు జరగకూడదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఆ మేరకు న్యాయపరంగా ముందుకుపోవాల్సిన ప్రభుత్వమే ఉద్దేశపూర్వకంగా మౌనం వహిస్తే ఇక ప్రభుత్వ భూములకు రక్షణ ఎవరని పలువురు ప్రశ్నిస్తున్నారు.



హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, చిత్రంలో బీఆర్ఎస్ నేతలు చిరుమళ్ల రాకేశ్‌కుమార్, మన్నె గోవర్ధన్‌రెడ్డి, తుంగ బాలు, మనోహర్‌రెడ్డి

ఆర్‌బీ అంటే.. రేవంత్ బుల్డోజర్

- శాడిస్టులా పేదల ఇండ్లపై పడ్డడు
- ఇండ్లు కూల్చే ప్రాంతాలకు సెక్యూరిటీ లేకుండా వెళ్తే రేవంత్ వీపు పుచ్చపండే
- నా నియోజకవర్గంలో ఒక్క ఇల్లు కూల్చినా.. హుజూరాబాద్ అగ్నిగుండం అవుతది
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఫైర్

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ) : ‘మూసీ నిర్వాసితుల ఇండ్లపై ఆర్‌బీ (రివర్ బెడ్) అని రాస్తున్నరు.. అది ఆర్‌బీ కాదు.. రేవంత్ బుల్డోజర్’ అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి విమర్శించారు. రేవంత్‌రెడ్డి సైకో సీఎంలా తయారయ్యాడని, శాడిస్టులా మారి పేదల ఇండ్ల మీద పడ్డాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల కుంభకోణం దాగి ఉన్నదని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో మూసీ సుందరీకరణను రూ.16 వేల కోట్లతో ప్రతిపాదించామని గుర్తుచేశారు. రూ.3,800 కోట్లతో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (ఎస్టీపీలు), బ్రిడ్జిలు కట్టామని పేర్కొన్నారు. ‘హరీశ్‌రావు, కేటీఆర్‌ల వీపు చింతపండు అవుతదంటున్నరు.. రేవంత్‌రెడ్డికి దమ్ముంటే ఇండ్లు కూలగొడుతున్న ప్రాంతాలకు సెక్యూరిటీ లేకుండా రావాలి. ఎవరి వీపు చింతపండు అవుతదో చూద్దాం. రేవంత్‌రెడ్డి వీపు చింతపండు కాదు పుచ్చపండు అవుతుంది’ అని ఎద్దేవా చేశారు. శుక్రవారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ హైడ్రా, మూసీ రివర్ ఫ్రంట్ మీద, బీఆర్ఎస్ నేతలపై సీఎం రేవంత్‌రెడ్డి నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రేవంత్ బెదిరింపులకు భయపడే వారు ఎవ్వరూ ఇక్కడ లేరని స్పష్టంచేశారు. బుల్‌జోర్ రాజ్ చెల్లదని ఓ వైపు రాహుల్‌గాంధీ అంటుంటే, మరోవైపు రేవంత్‌రెడ్డి అదే బుల్డోజర్లతో పేదల ఇండ్లు కూల్చుతున్నాడని ధ్వజమెత్తారు. ఇక్కడి కూల్చివేతలపై రాహుల్‌గాంధీ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. పేదల కండ్లలో రక్తం చూస్తున్న రేవంత్‌రెడ్డికి పేదల ఉసురు తగులుతుందని మండిపడ్డారు. పేదలను కాపాడుకొనే బాధ్యత బీఆర్ఎస్ తీసుకుంటుందని స్పష్టం చేశారు.

ఒక్కరూ హుజూరాబాద్ దాటరు..

హుజూరాబాద్ నియోజకవర్గంలోని కొన్ని చెరువుల పరిధిలో కూడా సర్వే పేరిట పేదల ఇండ్లకు రెడ్ మార్క్ చేస్తున్నారని కౌశిక్‌రెడ్డి తెలిపారు. తన నియోజకవర్గంలో ఒక్క ఇల్లు కూల్చినా హుజూరాబాద్ అగ్నిగుండం అవుతుందని హెచ్చరించారు. అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించొద్దని, మళ్లీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమేనని, తప్పుచేసే అధికారులను విడిచిపెట్టబోమని చెప్పారు. ఇండ్లు కూల్చివేయవద్దని హైకోర్టు ఆదేశాలున్నా అందుకు విరుద్ధంగా చెరువుల ఆక్రమణల పేరిట కూల్చివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సైకో సీఎంను కుర్చీనుంచి దింపుతామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ నేతలు చిరుమళ్ల రాకేశ్‌కుమార్, మన్నె గోవర్ధన్‌రెడ్డి, తుంగ బాలు, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

సురేఖ మానసిక స్థితిపై అనుమానాలు

- స్థాయిలేని వారికి పదవితో అడ్డగోలు వ్యాఖ్యలు
- మూసీ కాదు.. మీ బుర్రలు ప్రక్షాళన చేసుకోండి
- కాంగ్రెస్ నేతలపై మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఫైర్



సూర్యాపేట, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ) :మంత్రి కొండా సురేఖ మాటలు ఆమె మానసిక స్థితిపై అనుమానాలు వచ్చేలా ఉన్నాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. స్థాయి లేని వారికి మంత్రి పదవి రావడంతో అడ్డగోలుగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. సురేఖ మాటలు సొంత పార్టీ నాయకులు సైతం సిగ్గుపడేలా ఉన్నాయని అన్నారు. శుక్రవారం ఆయన సూర్యాపేటలో మీడియాతో మాట్లాడారు. ‘మూసీ నదిని ఏదో ప్రక్షాళన చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ పార్టీ నేతలు పదేపదే ప్రగల్భాలు పలుకుతున్నారని, కానీ ముందు మురుగుతో కూడుకుపోయిన వారి బుర్రలను ప్రక్షాళన చేసుకోవాలని సూచించారు. నేటి మూసీ దుస్థితికి కాంగ్రెస్ కారణం కాదా? అని ప్రశ్నించారు. ఫ్లోరోసిస్ భూతాన్ని తరిమింది కేసీఆరో లేక కాంగ్రెస్ పార్టీనో ప్రజలను అడిగితే చెప్తారన్నారు. మూసీ ప్రక్షాళన కాదు.. సీఎం, మంత్రుల బుర్రలు ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉన్నదని సూచించారు. మూసీ మురికి కన్నా ఎక్కువ కలుషితమైన కాంగ్రెస్ ఆలోచనల సుందరీకరణ జరగాలని అన్నారు. మూసీ ప్రక్షాళనను అడ్డుకుంటే ఉద్యమం చేస్తామని మంత్రి కోమటిరెడ్డి అనడం పట్ల ఆయన మానసికస్థితి సరిగ్గా లేదని స్పష్టమవుతున్నదని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ హయాంలో మూసీ స్థితిపై చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. హామీల అమలులో విఫలమై కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని మండిపడ్డారు. మొదట హైడ్రా.. అది విఫలం కావడంతో సినీ తారలపై ఆరోపణల అంశం తెరపైకి తెచ్చారని దుయ్యబట్టారు. రేవంత్ డైవర్షన్ రాజకీయాలతో ఎన్నో కుటుంబాలు నాశనమయ్యే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మొత్తంగా రాష్ట్రంలో రేవంత్ పాలన అగమ్యగోచరంగా మారిందని, 2014కు ముందు, తరువాత జరిగిన అభివృద్ధి ప్రతి ఒక్కరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అరాచకాలు తప్ప అభివృద్ధి శూన్యమని స్పష్టం చేశారు.



హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, చిత్రంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు

పన్నులు కట్టించుకొని కబ్జాదారులంటరా?

- ముందే సమావేశం పెడితే బుచ్చమ్మ బతికిఉండేది!
- అవగాహన లేకుండా రేవంత్‌రెడ్డి మాటలు
- కబ్జాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించండి
- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): హైడ్రా కూల్చివేతలపై అఖిలపక్షాన్ని ముందే పిలిచి సమావేశం పెట్టి ఉంటే బుచ్చమ్మ బతికి ఉండేదని, మూడు నెలల నుంచి హైదరాబాద్ ప్రజలను హైడ్రా పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని బీఆర్ఎస్ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. మూసీ సుందరీకరణ, హైడ్రాపై అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. అఖిలపక్ష సమావేశం పెట్టాలని తాము ముందునుంచే చెప్తున్నామని, 60-70 ఏండ్లుగా ఉంటున్న వారి నుంచి దశాబ్దాలుగా పన్నులు వసూలు చేస్తూ ఇప్పుడు వారిని కబ్జాదారులు అనడం సరికాదని హితవుపలికారు. చెరువులు ఎవరు కబ్జా చేశారో సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని కోరారు. జీహెచ్ఎంసీ కార్పొరేటర్లతో కలిసి తెలంగాణభవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో ఎన్ని చెరువులు ఉండేవి? ఇప్పుడెన్ని ఉన్నాయో ప్రభుత్వం బయటపెట్టాలని డిమాండ్ చేశారు. సీఎంను అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారని, ఆయన పూర్తి అవగాహనతో మాట్లాడాలని చెప్పారు. ‘కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ నేతలు చెరువులు ఆక్రమిస్తే.. అధికారం మీ చేతుల్లోనే ఉన్నది కాదా? విచారణ చేసుకోండి’ అని సూచించారు. నియోజకవర్గంలో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్టీపీ)లను బీఆర్ఎస్ హయాంలోనే నిర్మించామని గుర్తుచేశారు. కాజాకుంటలో ఇద్దరు జడ్జిలకు ఏ పార్టీ నేతలు భూములు అమ్మారో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. మూసీ తీర ప్రాంత ప్రజలను ఒప్పించి వారి ఇండ్లను ఖాళీ చేయించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కట్టించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టంచేశారు.

ఎమ్మెల్యే చెప్పిండని.. తిరుమలగిరి ఎస్సై కొట్టిండు!

- మెడకు ఉరితాడుతో యువకుడి సెల్ఫీ వీడియో
- ఆత్మహత్యాయత్నంతో పరిస్థితి విషమం
- శాలిగౌరారం మండలం ఆకారంలో ఘటన

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ)/శాలిగౌరారం/ తిరుమలగిరి/ తుంగుతుర్తి : తనకు సంబంధం లేకపోయినా డీజిల్ దొంగతనం పేరుతో ఎస్సై తీవ్రంగా కొట్టాడన్న ఆవేదనతో నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఆకారంలో ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శనిగ నాగరాజు సూర్యాపేట జిల్లా తొండ గ్రామంలోని గొలుసుల వెంకన్న నిర్వహణలో ఉన్న బాలాజీ స్టోన్ క్రషర్ మిల్లులో టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. యజమాని వద్దనడంతో పని మానేశాడు. రెండు నెలల జీతం రావాల్సి ఉందని నాగరాజు కొద్దిరోజుల కిందట యజమానికి ఫోన్ చేశాడు. యజమాని జీతం ఇవ్వకపోగా డీజిల్ దొంగతనం జరిగిందంటూ నాగరాజుతోపాటు మరికొందరిపై తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వెంకన్న స్థానిక ఎమ్మెల్యేను సైతం ఆశ్రయించి ఎస్సైకి ఫోన్ చేయించాడు. దీంతో తిరుమలగిరి ఎస్సై



చికిత్స పొందుతున్న నాగరాజు

వంటెపాక సురేశ్, నాగరాజుకు ఫోన్ చేస్తూ స్టేషన్‌కు రమ్మంటున్నాడు. తనకు సంబంధం లేదని నాగరాజు వెళ్లకపోయే సరికి బుధవారం ఎస్సై ఫోన్ చేసి మందలించాడు. గురువారం నాగరాజు తన బావమరిది, తమ్ముడిని వెంట పెట్టుకుని పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. విచారణ పేరుతో ఎస్సై నాగరాజు, అతడి తమ్ముడిని తీవ్రంగా చితకబాది మళ్లీ ఎప్పుడు పిలిస్తే అప్పుడు రావాలని ఆదేశించి వదిలిపెట్టాడు. మనస్తాపానికి గురైన నాగరాజు శుక్రవారం ఉదయం ఆకారంలోని వ్యవసాయ భూమిలో ఓ చెట్టుకు తాడు వేసి మెడకు బిగించుకుని సెల్ఫీ వీడియాలో మాట్లాడాడు. 'నాకు ఏ పాపమూ తెల్వదు. ఎన్నడన్న స్టేషన్‌కు పోయినోడిని కాదు. ఎవ్వని జోలికి కూడా పోయినోడిని కాదు. నన్ను ఇరికించారు' అంటూ కన్నీటి పర్యంతమయ్యాడు. అనంతరం ఉరి వేసుకున్నాడు. గమనించిన కొందరు నాగరాజును కిందకు దించి దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి నల్లగొండలోని ఓ ప్రైవేట్ దవాఖానకు.. పరిస్థితి విషమంగా ఉండటంతో శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. కాగా టిప్పర్ డ్రైవర్ నాగరాజు ఆత్మహత్యాయత్నానికి, తనకు సంబంధం లేదని ఎమ్మెల్యే మందుల సామేల్ పేర్కొన్నారు. మిల్లు యజమాని గొలుసు వెంకన్న ఫిర్యాదు మేరకు నాగరాజును స్టేషన్‌కు పిలిపించి అడగ్గా.. దొంగతం చేసింది వాస్తమని అంగీకరించినట్టు ఎస్సై సురేశ్ తెలిపారు. నాగరాజును తాను కొట్టలేదని, ఎమ్మెల్యే తమకేమీ చెప్పలేదని పేర్కొన్నారు.

- వర్గీకరణ చేశాకే ఉద్యోగాలను భర్తీ చేయాలి



ఎస్సీ రిజర్వేషన్లను ఉప వర్గీకరణ చేసి ఎస్సీలకు కేటాయించిన ఉద్యోగాలను భర్తీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ఎదుట సాష్టాంగ నమస్కారం చేస్తున్న తెలంగాణ మాదిగ దండోరా నాయకులు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ అధికార ప్రతినిధి, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి దేవని సతీశ్ మాదిగ, శ్యాంసుందర, మోజెస్ తదితరులు



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే. చిత్రంలో జస్టిస్ సుజయ్‌పాల్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

హైకోర్టులో ఉచిత వైద్యశిబిరం

హైదరాబాద్, అక్టోబర్ 4, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లోని హైకోర్టు ఆవరణలో శుక్రవారం ఉచిత వైద్య, రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ, ఉస్మానియా దవాఖాన, నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ప్రారంభించారు. న్యాయవాదులు, హైకోర్టు సిబ్బందికి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించే లక్ష్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటుచేసినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సుజయ్‌పాల్, హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ, పలువురు న్యాయమూర్తులు, న్యాయసేవాధికార సంస్థ సభ్యకార్యదర్శి పంచాక్షరి, బార్ కౌన్సిల్ చైర్మన్ ఏ నరసింహారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ రవీందర్‌రెడ్డి, ఉస్మానియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ కుమార్, నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ సీఈవో మయూర్ పట్నాల పాల్గొన్నారు.

నల్లగొండ బీఆర్‌ఎస్ కార్యాలయ నిర్మాణంపై స్టేటస్‌కో

- యథాతథ స్థితిని కొనసాగించాలన్న హైకోర్టు

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): నల్లగొండ జిల్లాలో భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) కార్యాలయ నిర్మాణానికి సంబంధించి హైకోర్టు స్టేటస్‌కో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ భవన నిర్మాణంపై తాజాగా దాఖలైన పిటిషన్‌ను బీఆర్‌ఎస్ దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌తో కలిపి ఈ నెల 21న విచారణ జరుపుతామని, అప్పటివరకు అక్కడ యథాతథ స్థితిని కొనసాగించాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం శుక్రవారం స్పష్టం చేసింది.

● మున్నేరు బాధితులను ఆదుకోవాలని నిరసన



ఖమ్మం మున్నేరు వరద బాధితులను ఆదుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం హామీ ఇచ్చినట్టుగా ముంపునకు గురైన బాధిత కుటుంబాలకు రూ.16,500 సాయాన్ని తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు.

బతుకమ్మపై సర్కారు నిర్లక్ష్యం

- సమీక్ష కూడా జరపని సీఎం రేవంత్‌రెడ్డి
- పండుగకు చిల్లిగవ్వ ఇవ్వని ప్రభుత్వం
- పలుచోట్ల మహిళల ఆటపాటలకు ఆటంకాలు
- కేసీఆర్ హయాంలో వారంనుంచే సంబురం



హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక అయిన బతుకమ్మ పండుగ కళతప్పింది. ఊరూరా కొండంత అన్నంతగా జరుపుకునే ఈ పండుగ నిర్వహణ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నది. ఉద్దేశపూర్వకంగానే సర్కారు పెద్దలు పట్టించుకోవడం లేదనే విమర్శలు వచ్చాయి. పండుగ ఏర్పాట్లకు కనీస ఏర్పాట్లు చేయకపోగా, ఆడబిడ్డలకు ప్రభుత్వం ఇచ్చే చీర కానుకను సర్కారు ఎగ్గొట్టింది. సద్దుల బతుమ్మకు కోసమైనా ప్రభుత్వం ఏర్పాట్లను ఘనంగా చేస్తుందని భావించినా అదీ ఎండమావే అయింది. సీఎం రేవంత్‌రెడ్డి, సంబంధిత మంత్రి పండుగ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించిన దాఖలాలు కూడా లేవు. సీఎస్ సమీక్ష నిర్వహించారని చెప్తున్నా దానికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడనేలేదు. బతుకమ్మ ఏర్పాట్లకోసం ఉన్నతాధికారుల నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు జారీకాలేదని క్షేత్రస్థాయి అధికారులు చెప్పుండటమే ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నది. రాష్ట్ర సాంస్కృతిక శాఖ సహా భాగస్వామ్య శాఖలు సకల ఏర్పాట్లు చేయాలని గతంలో వారం రోజుల ముందే ఏటా సీఎం ఆదేశాలు జారీ చేసేవారు. పండుగ నిర్వహణకు అవసరమైన నిధులను విడుదల చేసే సంప్రదాయం ఉండేది. పండుగ మొదలై సద్దుల బతుకమ్మ దగ్గర పడుతున్నా ఇప్పటివరకు చిల్లిగవ్వ కూడా విడుదల చేయలేదు. జీహెచ్‌ఎంసీ పరిధిలో గణేశ్ నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన 'బేబీ పాండ్స్' (చిన్న నీటివనరులు)ను నేటికీ తొలగించకుండా నిర్లక్ష్యం చూపుతున్నారు.

అడుగడుగునా ఆటంకాలే..

ఒకవైపు ప్రభుత్వం ఏర్పాట్లు చేయక పోగా, మరోవైపు ఆడిపాడే మహిళలకు రాష్ట్రంలోని పలుచోట్ల ఆటంకాలే ఎదురవుతున్నాయి. అయినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గంలో బతుకమ్మ ఆడేందుకు వెళ్లిన ఆడబిడ్డలను అవమానపరిచారు. మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు నియోజకవర్గం వెంకటాపూర్ మండలం పెద్దంపల్లి గ్రామంలో, భూపాలపల్లి జిల్లాలోని పలుచోట్ల విద్యుత్తు సౌకర్యం కల్పించని ఘటనలు వెలుగు చూశాయి. ఈ కారణంగా సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

నార్త్ కరోలినాలో అధికారికంగా బతుకమ్మ

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): అమెరికాలోని నార్త్ కరోలినా రాష్ట్రంలో ఏటా అక్టోబర్ మొదటివారంలో బతుకమ్మ పండుగను అధికారికంగా జరుపుకోనున్నారు. ఈ విషయాన్ని శుక్రవారం ఆ రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్ మార్క్ కే రాబిన్సన్ కార్యాలయం ప్రకటించింది. 'తెలంగాణలో ప్రధానంగా జరుపుకొనే ఈ పండుగ అక్కడి ప్రజల సాంస్కృతిక వారసత్వం, ఐక్యతా స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ నుంచి నార్త్ కరోలినాకు వచ్చిన ప్రజలు ఈ పండగను ఉమ్మడి జరుపుకోవచ్చని గవర్నర్ తెలిపారు.

బ్రహ్మచారిణి దేవీగా జోగులాంబ



దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో రెండోరోజైన శుక్రవారం అలంపూర్‌లోని జోగులాంబ దేవిని బ్రహ్మచారిణిగా అలంకరించారు. ఒక చేతిలో కమండలం, మరో చేతిలో దండం ధరించి భక్తులకు దర్శనమిచ్చారు.

- అలంపూర్

వేములవాడలో బ్రహ్మచారిణిగా..



వేములవాడ రాజన్న ఆలయంలో కొలువుదీరిన అమ్మవారు శుక్రవారం బ్రహ్మచారిణి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి అమ్మవారిని నెమలి వాహనంపై ఊరేగించారు.

- వేములవాడ టౌన్

విద్యుత్తు ఉద్యోగుల బదిలీలకు వెబ్ కౌన్సెలింగ్

- ఒకసారి ఫోకల్ పోస్టులో పనిచేస్తే మళ్లీ అవకాశం లేనట్టే
- ఉద్యోగుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన కొత్త విధానం

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): విద్యుత్ శాఖలో ఉద్యోగుల బదిలీ ప్రక్రియ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎంసెట్ కౌన్సెలింగ్ తరహాలో ఉద్యోగుల బదిలీలు చేపట్టడం, ఒకే తరహా పోస్టుల్లో మళ్లీ పనిచేసేందుకు అవకాశం లేకుండా వెబ్ అప్లికేషన్‌ను రూపొందించడం చాలా మందికి మింగుడు పడటం లేదు. దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)లో ఒకే చోట 2 ఏండ్లు పైబడి పనిచేసిన వారికే బదిలీ ఆప్షన్స్ ఇచ్చారు. డిస్కంలోని మొత్తం ఉద్యోగుల్లో 50% మందినే బదిలీ చేయాలని నిర్ణయించి, అందులో దాదాపు 850 ఉద్యోగులకు వెబ్ కౌన్సెలింగ్‌లో పాల్గొనే అవకాశం కల్పించారు. విద్యుత్తు శాఖలో బదిలీలకు సంబంధించిన మార్గదర్శకాల ప్రకారం ఈ నెల 7 వరకు గడువు ఇచ్చారు. ప్రస్తుతం డీఈ (డివిజినల్ ఇంజినీర్), ఏడీఈ, ఏఈ నుంచి కింది స్థాయి ఉద్యోగులు బదిలీల ప్రక్రియలో పాల్గొంటున్నారు.

చర్చంతా ఫోకల్ పోస్టులపైనే

ప్రస్తుతం బదిలీల కోసం జరుగుతున్న వెబ్ కౌన్సెలింగ్‌లో చర్చంతా ఫోకల్ పోస్టుల చుట్టూనే నడుస్తున్నది. ఇప్పటివరకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్నతాధికారులైనా, తర్వాతి స్థాయి ఉద్యోగులైనా ఫోకల్ పోస్టుల్లో పనిచేసి ఉంటే.. వారికి బదిలీల సమయంతో వేరే నాన్-ఫోకల్ పోస్టులకు సంబంధించిన ప్రాంతాలే కనిపిస్తున్నాయి. దీంతో ఎంతో కీలకమైన ఫోకల్ పోస్టును తాజా బదిలీల్లో మళ్లీ సాధించే అవకాశం లేకుండా పోతున్నదని కొందరు మదనపడుతుండగా.. మరికొందరు మాత్రం ఇది మంచి విధానమని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా జీహెచ్‌ఎంసీ పరిధిలోని 10 సర్కిళ్లలో పోస్టింగ్ కోసం చూసున్నవారికి ఈ విధానం అవకాశం ఇవ్వడం లేదని, గ్రామీణ ప్రాంతాలు, ప్రాధాన్యత లేని పోస్టుల్లో పనిచేసినవారికి ఇది మంచి అవకాశమని పేర్కొంటున్నారు. విద్యుత్తు శాఖలో బదిలీ ప్రక్రియ 7 తర్వాత ముగుస్తుందని ఓ ఉన్నతాధికారి తెలిపారు.

డీఎస్సీ-2008 లిస్టులో 8 పేర్లు గల్లంతు

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ-2008 జాబితాలో అర్హులైన కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు చెందిన ఎనిమిది మంది పేర్లు గల్లంతయ్యాయి. 2010 జూన్‌లో విద్యాశాఖ విడుదల చేసిన కామన్ మెరిట్ లిస్టులో పేరు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ శనివారంతో ముగియనుండటంతో తమకు చోటు కల్పించాలని అభ్యర్థులు వేడుకున్నారు. 2008-డీఎస్సీ బాధితులకు కాంట్రాక్టు ఉద్యోగాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు విద్యాశాఖ వెబ్‌సైట్‌లో జిల్లాలవారీగా జాబితాను పొందుపరిచింది. అయితే కొన్ని జిల్లాల్లో బాధితుల పేర్లు కనిపించకపోవడంతో 2010 జూన్‌లో విద్యాశాఖ విడుదల చేసిన కామన్ మెరిట్ లిస్ట్ ప్రకారం సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కానీ కరీంనగర్‌లో మాత్రం అధికారులు కామన్ మెరిట్ లిస్టు పట్టించుకోవడంలేదని అభ్యర్థులంటున్నారు. అడిగితే ఇదే ఫైనల్ జాబితా అని సమాధానం ఇస్తున్నట్టు చెపున్నారు. 14 ఏళ్లుగా కోర్టుల చుట్టూ తిరిగి అలిసిపోయామని, ప్రభుత్వం న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తుంటే అధికారులు అడ్డుకోవడం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏసీబీ అధికారులమంటూ ఫేక్ కాల్స్

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ) : 'నేను ఏసీబీ అధికారిని. హైదరాబాద్ హెడ్ ఆఫీసు నుంచి మాట్లాడుతున్నా. మీకు లంచం తీసుకుంటున్నట్టు మా దృష్టికి వచ్చింది. కొంత డబ్బులిస్తే మీపై కేసు కాకుండా చూస్తాం. ఏసీబీ రైడ్ ఎప్పుడు జరుగుతుందో మీకు చెబుతాం. జాగ్రత్తపడండి' అంటూ ప్రభుత్వ ఉద్యోగులకు కొందరు అక్రమార్కులు కాల్స్ చేస్తున్నారు. ఇటీవల ఈ కాల్స్‌కు భయపడి జనగామకు చెందిన ఇద్దరు మహిళా అధికారులు విడతల వారీగా రూ.70 వేలు సమర్పించుకున్నారు. ఖమ్మంలోనూ ఈ తరహా ఘటనలు నమోదైనట్టు ఏసీబీ అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో ఏసీబీ ఏడీజీ విజయ్‌కుమార్ స్పందించారు. ఈ తరహా కాల్స్‌కు అధికారులు, ప్రజలు డబ్బులు సమర్పించొద్దని, ఏసీబీ అధికారులు అటువంటి కాల్స్ చేయరని స్పష్టం చేశారు.

మంత్రులతో ముఖాముఖి వాయిదా

- నిరాశతో వెనుదిరిగిన కార్యకర్తలు

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): గాంధీభవన్‌లో శుక్రవారం నిర్వహించాల్సిన మంత్రులతో ముఖాముఖి కార్యక్రమం వాయిదా పడింది. ముందస్తు సమాచారం లేకుండా కార్యక్రమాన్ని వాయిదా వేయడంతో కార్యకర్తలు అసంతృప్తికి లోనయ్యారు. గంటల తరబడి పడిగాపులు కాసి నిరాశతో వెనుదిరిగారు. ప్రజాభవన్‌లో శుక్రవారం ప్రజావాణి నిర్వహిస్తున్న నేపథ్యంలో ముఖాముఖి కార్యక్రమాన్ని సోమవారానికి వాయిదా వేసినట్టు గాంధీభవన్ వర్గాలు ఒక ప్రకటన విడుదల చేశాయి.

సింగరేణిల జీవితాల్లో కాకాది చెరగని ముద్ర

- సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): పేదల హృదయాల్లో దీపమై వెలిగిన మహనీయుడు కాకా(జి.వెంకటస్వామి) అని సీఎం ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం జీ వెంకటస్వామి జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకున్నారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, కేంద్ర మంత్రిగా, సేవలందించారని, సింగరేణి కార్మికుల జీవితాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని గుర్తుచేశారు. తెలంగాణ తొలి దశ, మలిదశ ఉద్యమాల్లో కాకా అలుపెరుగని పోరాటం చేశారని, 1969లో తెలంగాణ కోసం జైలు కెళ్లాడని సీఎం అన్నారు.

ప్రజావాణికి 338 దరఖాస్తులు

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 338 దరఖాస్తులు అందాయి. గృహ నిర్మాణ శాఖకు 79, రెవెన్యూ సమస్యలపై 52, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 35, విద్యుత్తు సమస్యలపై 35, ఎస్సీ సంక్షేమ శాఖకు 29, ప్రవాసీ ప్రజావాణి ద్వారా 4, ఇతర శాఖలకు సంబంధించి 104 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య దరఖాస్తులను స్వీకరించారు.

అన్నారం బరాజ్‌లో తొలగిన ఇసుక



అన్నారం బరాజ్‌లో తొలగిన ఇసుక

కాళేశ్వరం, అక్టోబర్ 4: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన అన్నారం బరాజ్‌లో ఉన్న 20 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తొలగించారు. గోదావరి నది, మానేరు వాగు వరదలతో బరాజ్ గేట్ల ప్రాంతంలో ఇసుక భారీగా వచ్చి చేరడంతో గేట్లు వేసే పరిస్థితే లేదు. ఇసుకను అలాగే ఉంచితే బరాజ్ కింది భాగంలోని బెడ్‌తోపాటు కాంక్రీట్ నిర్మాణాలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్న విషయాన్ని గమనించిన ఇంజినీర్లు ఇసుకను తొలగించాని నిర్ణయించారు. ప్రభుత్వంపై ఆర్థిక భారం అంతగా పడకుండా, బరాజ్ దెబ్బతినకుండా ఉండేందుకు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎంచుకున్నారు. ఇంతలో మళ్లీ వర్షాలు పడటంతో గేట్లు అన్నింటిని మూసి వేసి ఒక్కో దాన్ని తెరిచి ఫ్లషింగ్ టెక్నిక్ విధానం ద్వారా వరద నీటిని అటుగా మళ్లించి గేట్ల కింద పేరుకుపోయిన ఇసుకను దిగువకు పంపించడంలో సఫలమయ్యారు. ఇదే విధానాన్ని అన్ని గేట్ల విషయంలోనూ అమలు చేయడంతో అన్నారం బరాజ్‌లో పేరుకుపోయిన 20 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక మొత్తాన్ని కూడా దిగువకు పంపించగలిగారు.

గందరగోళంగా సెర్చ్ కమిటీ సమావేశాలు

- కొనసాగుతున్న వాయిదాల పర్వం
- మొత్తంగా 6 వర్సిటీలకు ముగిసిన సమావేశాలు

హైదరాబాద్, అక్టోబర్ 4(నమస్తే తెలంగాణ): యూనివర్సిటీలకు కొత్త వైస్‌చాన్స్‌లర్లను ఎంపికచేసే సెర్చ్ కమిటీ సమావేశాలు గందరగోళాన్ని తలపిస్తున్నాయి. వీసీల పేర్లను ఖరారుచేసే సెర్చ్ కమిటీ సమావేశాలు వరుసగా వాయిదాపడుతున్నాయి. శుక్రవారం జరగాల్సిన తెలంగాణ, కాకతీయ వర్సిటీల సెర్చ్ కమిటీ సమావేశాలు రెండు వాయిదాపడ్డాయి. సెర్చ్ కమిటీ సభ్యులు అందుబాటులో లేకపోవడం, ఆయా సభ్యులతో సమన్వయం చేసుకోవడంలో ప్రభుత్వం విఫలంకావడంతో ఈ సమావేశాలు వరుసగా వాయిదాపడుతున్నాయి. పది వర్సిటీ సెర్చ్ కమిటీ సమావేశాలకు ప్రభుత్వం షెడ్యూల్ ఖరారుచేయగా, ఇప్పటి వరకు ఆరు వర్సిటీల సమావేశాలు పూర్తయ్యాయి. జేఎన్‌ఎఫ్‌ఏయూ, బీఆర్ అంబేద్కర్ వర్సిటీ, తాజాగా తెలంగాణ, కాకతీయ వర్సిటీ సెర్చ్ కమిటీల సమావేశాలు వాయిదా పడుతూ వస్తున్నాయి. శుక్రవారం జేఎన్టీయూ, శాతవాహన వర్సిటీల సెర్చ్ కమిటీ సమావేశాలను మాత్రమే నిర్వహించారు. ఇప్పటికే మహాత్మాగాంధీ, పాలమూరు, ఉస్మానియా, తెలుగు వర్సిటీ సెర్చ్ కమిటీ సమావేశాలు ముగిశాయి. ప్రభుత్వం ఏకపక్షంగా సమావేశాల షెడ్యూల్‌ను ఖరారుచేయడాన్ని సెర్చ్ కమిటీ సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. సమావేశాలు జరిగిన ఆరు వర్సిటీల వీసీల నియామకంపై ముందుకెళ్లడమా? లేక.. మొత్తం ప్రక్రియ పూర్తయ్యేవరకు ఆగడమా? అన్న ప్రశ్నలు ప్రభుత్వాన్ని వేధిస్తున్నాయి.

4 కార్పొరేషన్లుగా జీహెచ్‌ఎంసీ

- వచ్చే ఎన్నికల నాటికి ఏర్పాటు చేస్తాం
- హైదరాబాద్ దశ-దిశను మారుస్తాం
- హైకోర్టు భవనంలో పార్కింగ్‌పై ఆలోచన
- అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమ్మిట్‌లో మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను (జీహెచ్‌ఎంసీ) 4 కార్పొరేషన్లుగా ఏర్పాటు చేస్తామని, వచ్చే ఎన్నికల నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. అసోచాం ఆధ్వర్యంలో శుక్రవారం హెచ్ఐసీసీ నోవాటెల్‌లో నిర్వహించిన 'అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమ్మిట్-2024' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. మూసీ పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తుంటే విపక్షాలు ఎందుకు అడ్డుకుంటున్నాయో అర్థం కావడం లేదని చెప్పారు. సబర్మతి, నమామి గంగే ప్రాజెక్టుల మాదిరిగా ప్రజల సంక్షేమం కోసం మూసీ ప్రక్షాళనకు సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టినట్టు చెప్పారు.

రాష్ట్రంలో పట్టణీకరణ జరగాలి

రాష్ట్రంలో పట్టణీకరణ జరగాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ దశ-దిశను మార్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని చెప్పారు. హైకోర్టు భవనంలో పీపీపీ విధానంలో పార్కింగ్ వసతిని ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర సుస్థిరాభివృద్ధి, స్థిరమైన మౌలిక వసతుల నిర్మాణం కోసం ప్రగతిశీలక నిర్ణయాలు తీసుకుంటున్నట్టు తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి బలమైన పునాదులు వేయడంతోపాటు రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చేందుకు అనేక మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని, అందులో భాగంగా పలు రోడ్లు, ఆర్‌వోబీలు, ఆర్‌యూబీలు నిర్మిస్తున్నామని చెప్పారు.

పట్టణాల్లో మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ

పట్టణాల్లో ఘన వ్యర్థాల నిర్వహణ కోసం ఎస్టీపీలు నిర్మించి, మెరుగైన మురుగునీటి వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నమని చెప్పారు. హైదరాబాద్‌లో పట్టణ విస్తరణ, మౌలిక వసతుల కల్పనలో భాగంగా మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి, కొత్త విమానాశ్రయాల నిర్మాణం, శాటిలైట్ టౌన్ షిప్‌ల ఏర్పాటు, మెట్రో విస్తరణ, జీహెచ్‌ఎంసీ పునర్వ్యవస్థీకరణ, ఎలివేటెడ్ కారిడార్లు, రీజినల్ రింగ్ రోడ్ (ఆర్‌ఆర్‌ఆర్), హైకోర్టు భవన నిర్మాణం, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్, ఉస్మానియా నూతన భవన నిర్మాణం పనులను వేగవంతం చేస్తున్నట్టు మంత్రి వివరించారు. కార్యక్రమంలో అమెరికన్ కాన్సుల్ జనరల్ (చీఫ్ పొలిటికల్ అండ్ ఎకనమిక్ సెక్షన్), ఫీనిక్స్ గ్రూప్ చైర్మన్ సురేశ్ చుక్కపల్లి, అలార్డ్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ పూనమ్ కశ్యప్, అసోచాం రాష్ట్ర ప్రతినిధి దినేశ్ పాల్గొన్నారు.

మీ ఊళ్లోనే చూయించుకో..పో!

- గర్భిణికి వైద్యం నిరాకరణ
- జనగామ జిల్లాలోని ఎంసీహెచ్‌లో ఘటన
- గట్టిగా నిలదీయడంతో వైద్య పరీక్షలు చేసిన సిబ్బంది

జనగామ రూరల్, అక్టోబర్4: 'మీ ఊరెక్కడ.. ఇక్కడి దవాఖానకు ఎందుకొచ్చావ్..అక్కడికే పోయి చూయించుకో పో' అంటూ ఓ గర్భిణికి వైద్యం నిరాకరించిన ఘటన జనగామ జిల్లా జనగామ మండలంలోని పసరమడ్ల గ్రామశివారు చంపక్ హిల్స్‌లోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకున్నది. జనగామకు చెందిన శృతికి యాదగిరిగుట్టకు చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. గర్భిణి కావడంతో తల్లిగారి ఊరైన జనగామకు వచ్చిన శృతి గతంలో ఇదే ఎంసీహెచ్‌లో వైద్యం చేయించుకున్నది. శుక్రవారం వైద్యం కోసం దవాఖానకు వచ్చి ఓపీ రాయిస్తుండగా ఆధార్‌లో యాదగిరిగుట్టగా ఉండడంతో ఆమెను మీ జిల్లాకు పోయి వైద్యం చేయించుకోవాలని వైద్య సిబ్బంది చెప్పారు. తాను పుట్టింది ఇక్కడే అని, ఈ దవాఖానకు ఇతర జిల్లాల వారు రావడం లేదా? నిలదీసింది. దీంతో కోపంతో నీ జిల్లాకు పోయి చూపించుకో అంటూ దురుసుగా మాట్లాడారని బాధితురాలు తెలిపారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి పంపించారు.

● చెరువందం.. పక్షి ప్రతిబింబం



సిద్దిపేట జిల్లా ఎర్రవెల్లి పరిసర ప్రాంతంలో పాండురంగ చెరువు వద్ద మాజీ ఎంపీ సంతోష్‌రావు తీసిన ఫోటో

● శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



తిరుమల వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం సాయంత్రం మీనలగ్నంలో ధ్వజారోహణంతో వాహనసేవలు మొదలయ్యాయి. మధ్యాహ్నం బంగారు తిరుచ్చి ఉత్సవం, సాయంత్రం ధ్వజారోహణంతో శ్రీనివాసుడి బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ గరుడ పటాన్ని అర్చకులు ఎగురవేశారు.

ఊపిరాడక బాలుడి మృతి

- షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం
- పండుగ పూట ఈదులగట్టెపల్లిలో విషాదం



సాయికుమార్ (ఫైల్)

మానకొండూర్ రూరల్, అక్టోబర్ 4: ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం కాగా, ఇంట్లో నిద్రిస్తున్న చిన్నారి సజీవదహనమైన ఘటన కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఈదులగట్టెపల్లిలో చోటుచేసుకున్నది. ఈదుటగట్టెపల్లి గ్రామానికి చెందిన అంగిడి అనిత-రాజు దంపతులకు కూతురు రితిక, కుమారుడు సాయికుమార్ (7) ఉన్నారు. శుక్రవారం సాయంత్రం సాయికుమార్ ఇంట్లో నిద్రిస్తుండగా.. తల్లీకూతురు బయట ఉన్నారు. షార్ట్‌సర్క్యూట్‌తో ఆరుబయట ఉన్న తాటికమ్మలకు మంటలు అంటుకోగా సాయికుమార్ నిద్రలేచే సరికి ఏం జరుగుతుందో అర్థం కాలేదు. స్థానికులు కాపాడేందుకు ప్రయత్నించినా.. మంటల వ్యాప్తికి ఏం చేయలేకపోయారు. సాయికుమార్ మరో రూమ్‌లోకి వెళ్లి డోర్ పెట్టుకున్నాడు. అప్పటికే మంటల వ్యాప్తి, పొగతో ఊపిరాడక మూలన పడిపోయాడు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సజీవదహనమైన బాలుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. పండుగపూట సాయికుమార్ మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొన్నది. ఘటనా స్థలాన్ని మానకొండూర్ ఇన్‌చార్జి సీఐ స్వామి పరిశీలించి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

నూకల నరేశ్‌రెడ్డి కన్నుమూత

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ సంతాపం



నరేశ్‌రెడ్డి (ఫైల్)

మహబూబాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి వరంగల్ జిల్లా సీనియర్ నాయకుడు నూకల నరేశ్‌రెడ్డి కన్నుమూశారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ శుక్రవారం మరణించారు. నరేశ్‌రెడ్డి స్వస్థలం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం. 1989లో కాంగ్రెస్ పార్టీ నుంచి డోర్నకల్ స్థానాన్ని ఆశించినా టికెట్ దక్కలేదు. 1994లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా, 1999లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. 2012 ఉద్యమ సమయంలో టీఆర్‌ఎస్‌లో చేరి 2024 వరకు బీఆర్‌ఎస్ కోసం సుదీర్ఘ కాలం పనిచేశారు. 2024 ఫిబ్రవరిలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కేటీఆర్ దిగ్భ్రాంతి

సీనియర్ నేత నూకల నరేశ్‌రెడ్డి మృతి పట్ల బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిగ్భ్రాంతి చెందారు. దవాఖానలో చేరిన నరేశ్‌రెడ్డిని నాలుగైదు రోజుల క్రితమే కేటీఆర్ పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన మరణవార్త వినాల్సి వస్తుందని అనుకోలేదని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు కేటీఆర్ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

హరీశ్ తదితరుల నివాళులు..

నూకల నరేశ్‌రెడ్డి మరణవార్త విషయం తెలియగానే మాజీ మంత్రి హరీశ్‌రావు శాసన మండలిలో విపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, అధికార ప్రతినిధి కేతిరెడ్డి వాసుదేవరెడ్డి తదితరులు దవాఖానకు వెళ్లి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో నూకల నరేశ్‌రెడ్డి రాజకీయంగా అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

దొడ్డు వడ్లకూ బోనస్ ఇవ్వాల్సిందే

- సన్నాలకే ఇస్తామనడం మోసం
- అందరికీ రుణమాఫీ చేయాల్సిందే
- రైతుభరోసా ఇస్తరా? ఇవ్వరా?
- హామీలు తీర్చకపోతే పోరాటమే
- సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ లేఖ



హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): రైతులకు ఇచ్చిన హామీల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు మండిపడ్డారు. రైతులు పండించే ప్రతి క్వింటా ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తామంటూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. గురువారం జరిగిన సమీక్షా సమావేశంలో దొడ్డువడ్లకు బోనస్, వానకాలం రైతుభరోసాపై ఎటూ తేల్చకుండా ప్రభుత్వం కప్పదాటుగా వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. వానకాలం సీజన్ పూర్తయినా రైతుభరోసాపై నిర్ణయం తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఈ మేరకు కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శుక్రవారం లేఖ రాశారు. రైతులు పండించే ప్రతి క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో స్పష్టంగా ప్రకటించారని కేటీఆర్ గుర్తుచేశారు. బోనస్ చెల్లించకుండా గత సీజన్‌లో ప్రభుత్వం మోసం చేసిందని, ఈ సీజన్‌లో కూడా ఇప్పటివరకు దొడ్డు వడ్లకు బోనస్ విషయంలో ఎలాంటి స్పష్టతలేకపోవడంతో రైతులు అయోమయంలో పడ్డారని తెలిపారు. సన్నవడ్లకు మాత్రమే బోనస్ అని ముఖ్యమంత్రి పేర్కొనడం రైతులను మోసం చేయడమేనని దుయ్యబట్టారు. రాష్ట్రంలో 80 శాతానికిపైగా రైతులు పండించేవి దొడ్డు వడ్లన్న సంగతి కాంగ్రెస్ పార్టీకి తెలుసని పేర్కొన్నారు. సన్నవడ్లు, దొడ్డువడ్లు అనే తేడా లేకుండా మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలుపుకోవాలని, గత సీజన్ బకాయిలను కూడా తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు అన్ని రకాలకు బోనస్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు సన్నాలకే అంటూ సన్నాయినొక్కులు నొక్కడం రైతులను నిలువునా మోసం చేయడమేనని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోతే రైతులపక్షాన బీఆర్‌ఎస్ పోరుబాటు పడుతుందని హెచ్చరించారు.

రైతు భరోసా ఊసేదీ?

వానకాలం సీజన్ పూర్తయినా రైతుభరోసా సంగతి తేల్చడం లేదని కేటీఆర్ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుభరోసా పేరిట ఎకరాకు రూ.7,500 ఇస్తామని నాడు పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. గత సీజన్‌లో రైతులకు రైతుబంధు పైసలు మాత్రమే వేశారని, ఈ సీజన్‌లో ఇప్పటివరకు అసలు రైతుభరోసా సంగతే తేల్చడం లేదని దుయ్యబట్టారు. నాట్లు వేసే సమయంలో అందించాల్సిన పెట్టుబడి సాయాన్ని పంట చేతికొచ్చే వరకు కూడా ఇవ్వకపోవడమంటే రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతున్నదని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళన కోసం రూ.లక్షన్నర కోట్లు ఖర్చు పెట్టేందుకు తహతహలాడుతున్న ముఖ్యమంత్రికి రైతులకు రైతుభరోసా వేసేందుకు పైసలు లేవా? అని ప్రశ్నించారు. మూసీ పేరుతో చేసే అవినీతి ఆలోచనలను మాని రైతులకు ఇచ్చిన హామీలపై దృష్టి సారించాలని హితవు పలికారు. రైతును రాజును చేయాలన్న దృఢ సంకల్పంతో కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు వ్యవసాయం రంగంలో విప్లవాత్మక మార్పు తెచ్చిందని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ ఏటా రూ.10 వేలు ముష్టి వేస్తున్నారని, తాము అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచే రూ.15 వేలు ఇస్తామంటూ రేవంత్‌రెడ్డి చెప్పిన మాట విని రైతులు ఆశపడ్డారని తెలిపారు. రూ.15 వేల సంగతేమోగానీ ఆ రూ.10 వేలు కూడా ఇవ్వకుండా రైతును గోస పెడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతుభరోసా ఇస్తారో, ఇవ్వరో ప్రభుత్వం స్పష్టంచేయాలని డిమాండ్ చేశారు. గత సీజన్ సాయంతోపాటు ఈసీజన్‌వి కూడా జతచేసి రైతుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు.

రుణమాఫీ పేరుతో వంచన.. వ్యవసాయ మంత్రి ప్రకటనే సాక్ష్యం

వందశాతం రుణమాఫీ అయిందని చెప్పిన ముఖ్యమంత్రి బండారం వ్యవసాయ శాఖ మంత్రి ప్రకటనతో బట్టబయలైందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఇంకా 20 లక్షల మంది రైతులకు రుణమాఫీ కాలేదని వ్యవసాయశాఖ మంత్రి ప్రకటించడంతో ముఖ్యమంత్రి మాటల్లో నిజం లేదని తేలిపోయిందని పేర్కొన్నారు. అధికారిక లెక్కల ప్రకారమే 20 లక్షల మంది రైతులకు రుణమాఫీ కాలేదంటే అనధికార లెక్కల ప్రకారం ఇంకా ఎంతమంది రైతులు ఉంటారో అర్థం చేసుకోవచ్చని ఉదహరించారు. రుణమాఫీని పక్కనపెట్టి మూసీ పేరుతో వేలకోట్లు దోపిడి చేయాలనుకుంటున్న రాబందుల ప్రభుత్వం ఉండి రైతులకు ఏం లాభమని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి చేతకానితనం అన్నదాతలకు కోలుకోలేని శాపంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో రైతులందరికీ రుణమాఫీ చేయకపోతే ఊరుకునేదిలేదని హెచ్చరించారు.

సోయాకు సీలింగ్ ఎందుకు?

- మొత్తం పంటను ప్రభుత్వమే కొనాలి
- సోయా రైతులకు 500 బోనస్ ఇవ్వాలి
- రివ్యూ మీటింగ్‌కు గంటల ముందు సమాచారమా?
- కాంగ్రెస్ సర్కారు తీరుపై ఎమ్మెల్యే ప్రశాంత్ ఆగ్రహం



నిజామాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణప్రతినిధి): సోయా కొనుగోళ్లపై సీలింగ్ విధించడాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. సోయా దిగుబడి ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్లు వస్తుంటే ప్రభుత్వం 6 క్వింటాళ్లు మాత్రమే తీసుకుంటామనడం విడ్డూరమని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మిగతా పంటను అమ్ముకోవాలంటే రైతులు మళ్లీ ప్రైవేటు వ్యాపారుల చుట్టూ తిరగాల్నా? రూ.4,300లకే అమ్ముకోవాల్నా? అని ప్రశ్నించారు. ప్రభుత్వమే మొత్తం పంటను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, అలాగే క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోయా మద్దతు ధర రూ.4,892 కాగా, బోనస్ కలిపి రూ.5,392 చొప్పున రైతుకు ఇవ్వాలని సూచించారు. ఎన్నికల ముందు ప్రతి పంటకు బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్.. రైతుల పొట్ట కొట్టొద్దని హితవు పలికారు.

మీటింగ్‌కు రావొద్దనే..

నిజామాబాద్ జిల్లా పర్యటనకు వస్తున్న మంత్రులు.. ప్రభుత్వ యంత్రాంగంతో నిర్వహించే సమీక్షకు సంబంధించిన సమాచారాన్ని సరిగా ఇవ్వలేదని వేముల తప్పుబట్టారు. సమాచారాన్ని ఆలస్యంగా ఇచ్చిన కారణంగా సమీక్షకు హాజరుకాలేని పరిస్థితిలో వేముల వీడియో సందేశాన్ని మీడియాకు విడుదల చేశారు. శుక్రవారం మంత్రుల టూర్ ఉంటే, అదే రోజు కేవలం గంటల ముందే సమాచారం ఇవ్వడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా తాను మీటింగ్‌కు రావొద్దనే ఉద్దేశంతో ఇదంతా చేశారని మండిపడ్డారు. తన నియోజకవర్గ సమస్యలపై, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై ప్రశ్నిస్తాననే భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పేదలకో న్యాయం.. పెద్దలకో న్యాయమా?

- సీఎం సోదరుడికి నోటీసులిచ్చినా చర్యలు శూన్యం
- హైడ్రా కూల్చివేతలపై హైకోర్టులో కేఏ పాల్ పిల్
- రాష్ట్ర ప్రభుత్వానికి ధర్మాసనం నోటీసులు

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): పేదవాడికో న్యాయం, పెద్దలకో న్యాయం అన్నట్టుగా హైడ్రా చర్యలు ఉన్నాయని ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ ఆరోపించారు. పేదల ఇండ్ల కూల్చివేతల విషయంలో నోటీసులు కూడా ఇవ్వడం లేదని, అదే సీఎం సోదరుడికి నోటీసు ఇచ్చారేగానీ చర్యలు తీసుకోలేదని చెప్పారు. హైడ్రా కూల్చివేతలను సవాలుచేస్తూ కేఏ పాల్ చేసిన పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. కేఏ పాల్ వాదనలు వినిపిస్తూ, చెరువుల రక్షణకు చేపట్టిన చర్యలను నిబంధనల ప్రకారం అమలు చేయడంలేదని చెప్పారు. పేదల నిర్మాణాలను కూల్చివేస్తున్న హైడ్రా సంపన్నుల విషయంలో ఉదాసీనంగా ఉన్నదని తెలిపారు. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడి ఇల్లే నిదర్శనమని చెప్పారు. హైడ్రా వివక్షతో వ్యవహరిస్తున్నదని అంటూ సీఎం సోదరుడి ఇంటి విషయంలో హైడ్రా 32 రోజుల క్రితం నోటీసులు ఇచ్చినా చర్యలు చేపట్టకపోవడం అందుకు ప్రధాన ఉదాహరణ అని తెలిపారు. తన పిల్‌పై విచారణ ముగిసే వరకు ఏవిధమైన కూల్చివేత చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ప్రభుత్వ వాదనలు వినకుండా స్టే ఆదేశాలు జారీ చేయబోమని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తున్నామని, ప్రభుత్వ స్పందన చూశాక తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని పేర్కొంది. ప్రతివాదులైన మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి, హైడ్రాలకు నోటీసులు జారీ చేస్తూ విచారణను వాయిదా వేసింది.

టౌన్ ప్లానింగ్ అధికారికి ముందస్తు బెయిల్

హైదరాబాద్, అక్టోబర్ 4, (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా నిజాంపేట ప్రగతినగర్‌లోని ఎర్రకుంట చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణాలకు అనుమతించారన్న కారణంగా హైడ్రా నమోదు చేసిన కేసులో హెచ్‌ఎండీఏ అసిస్టెంట్ టౌన్‌ప్లానింగ్ అధికారి సుధీర్‌కుమార్‌కు హైకోర్టులో శుక్రవారం ఊరట లభించింది. హైడ్రా ఫిర్యాదు మేరకు నమోదు చేసిన కేసులో సుధీర్‌కుమార్‌కు షరతులతో ముందస్తు బెయిలు మంజూరు చేసింది. హైడ్రా ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో నిందితుడిగా ఉన్న జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ ఎన్ సుదాంశ్ దాఖలు చేసిన మరో పిటిషన్‌పై విచారణను ఈ నెల 22కి వాయిదా వేశారు.

బీఆర్‌ఎస్ నాయకుడి ఇంటి నిర్మాణం కూల్చివేత

బాధితుడు లక్ష్మణ్ నాయక్ ఆవేదన

నందికొండ, అక్టోబర్ 4 : నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ పైలాన్‌కాలనీలో పట్టణ బీఆర్‌ఎస్ మాజీ కార్యదర్శి ముడావత్ లక్ష్మణ్ నాయక్ నిర్మిస్తున్న ఇంటిని మున్సిపల్ కమిషనర్ శ్రీను, సూపర్‌వైజర్ శివ తమ సిబ్బందితో కలిసి శుక్రవారం కూల్చివేశారు. తాము ఇంటి నిర్మాణం చేపడుతున్న స్థలంలో 50 ఏండ్లకుపైగా నివాసం ఉంటున్నామని ఇంటి యజమాని ముడావత్ లక్ష్మణ్ నాయక్ తెలిపారు. ఇంటి పక్కన దారి విషయమై స్థానికులు అభ్యంతరం చెప్పడంతో గత నెల 27న పెద్దల సమక్షంలో మాట్లాడి ఇంటి నిర్మాణ పనులను కొనసాగిస్తున్నట్టు పేర్కొన్నారు. కానీ అధికారులకు తమకు సమాచారం ఇవ్వకుండానే నిర్మాణ గోడలను కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితోనే కూల్చివేతలు చేపట్టారని లక్ష్మణ్ ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట బాధితుడు లక్ష్మణ్‌నాయక్ కుటుంబ సభ్యులు నిరసన తెలిపారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

చెన్నూరుకు ఉప ఎన్నిక ఖాయం!

- సూట్‌కేస్ కంపెనీలకు డబ్బులు పంపిన కేసులో ఎమ్మెల్యే వివేక్ జైలుకు పోకతప్పదు
- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్



తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న బాల్క సుమన్, చిత్రంలో బీఆర్‌ఎస్ పార్టీ లీగల్ టీమ్ సభ్యులు

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): చెన్నూరు నియోజకవర్గానికి ఉప ఎన్నికలు రావడం ఖాయమని, సూట్‌కేస్ కంపెనీలకు డబ్బులు పంపిన వ్యవహారంలో ఎమ్మెల్యే వివేక్ జైలుకు పోక తప్పదని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చెప్పారు. ఎమ్మెల్యే వివేక్‌ను సీఎం కాపాడే ప్రయత్నం చేస్తున్నారని, రేవంత్‌రెడ్డే కాదు.. దేవుడు కూడా వివేక్‌ను కాపాడలేరని పేర్కొన్నారు. తెలంగాణలో కొందరు పోలీస్ అధికారులకు స్వామిభక్తి ఎక్కువైందని, రేవంత్‌రెడ్డి అడుగులకు మడుగులొత్తుతున్నారని విమర్శించారు. ఈకేసును ఈడీ దర్యాప్తు చేస్తుంటే, మరోవైపు మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్ కింద పోలీసులు కేసును ముగించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కేసులో హైకోర్టు, అవసరమైతే సుప్రీంకు వెళ్తామని పేర్కొన్నారు. శుక్రవారం తెలంగాణభవన్‌లో బీఆర్‌ఎస్ లీగల్ సెల్ ప్రతినిధులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వివేక్ తన విశాఖ కంపెనీ నుంచి విజిలెన్స్ సెక్యూరిటీ అనే సూట్‌కేస్ కంపెనీకి రూ.8 కోట్లు అక్రమంగా బదిలీ చేసి చెన్నూరు ఎమ్మెల్యేగా గెలిచినట్టు తాను ఆనాడే ఈసీకి ఫిర్యాదు చేశానని చెప్పారు. ఫిర్యాదుపై స్పందించిన ఈసీ, ఐటీ, ఈడీతోపాటు రాష్ట్ర పోలీసులకు సైతం విచారణ జరపాలని ఆదేశాలు జారీచేసిందని తెలిపారు. వివేక్ సూట్‌కేసు కంపెనీకి అక్రమంగా నగదు బదిలీ చేశారని, ఫెమా ఉల్లంఘనలు ఉన్నాయని 2023 నవంబర్ 23న ఈడీ ప్రెస్‌నోట్‌లో నిర్ధారించినట్టు పేర్కొన్నారు. ఆ ప్రెస్‌నోట్‌ను సుమన్ మీడియాకు చూపించారు. జనవరి 24న వివేక్‌ను ఈడీ విచారించిందని వెల్లడించారు. ఈడీ విచారణ కొనసాగుతుంటే పోలీసులు మాత్రం ఆగస్టులో ఈ కేసును మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్ కింద మూసి వేస్తున్నట్టు కోర్టుకు పిటిషన్ ద్వారా తెలిపారని మండిపడ్డారు. ఈ పిటిషన్‌ను సవాల్ చేస్తూ నాంపల్లి కోర్టులో శుక్రవారం ప్రొటెస్ట్ పిటిషన్ వేశామని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి దగ్గర హోంశాఖ ఉంది కనుక వివేక్‌ను కాపాడే యత్నం చేస్తున్నారని ఆరోపించారు.

రేవంత్ విషకౌగిలిలో బందీ కావద్దు

రాష్ట్రంలో కొందరు పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని, రేవంత్‌రెడ్డి విషకౌగిలిలో పోలీసుల బందీ కావొద్దని బాల్క సుమన్ సూచించారు. ప్రభుత్వం అనేది నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి ఏది చెబితే పోలీసులు అది చేస్తారా? అని ప్రశ్నించారు. ఇన్‌కం ట్యాక్స్, ఈడీ లోతైన విచారణ చేస్తుంటే రాష్ట్ర పోలీసులు వివేక్ కేసును ఎలా మూసేస్తారు? అని నిలదీశారు. ఏపీలో ఏం జరుగుతున్నదో ఇక్కడి పోలీసు అధికారులు చూడటం లేదా? అని ప్రశ్నించారు. జర్నలిస్టులపై దాడులు పెరిగిపోయాయని, అయినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. అత్యుత్సాహం ప్రదర్శిస్తున్న పోలీసులకు భవిష్యత్తులో నష్టం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు గట్టు రాంచందర్‌రావు, మన్నె గోవర్ధన్‌రెడ్డి, పార్టీ లీగల్ టీమ్ సభ్యులు జక్కుల లక్ష్మణ్‌యదవ్, కల్యాణ్, లలితారెడ్డి, గోపగాని రఘురామ్ పాల్గొన్నారు.

టీజీపీఎస్సీపై నిరసన

- 150 ప్రశ్నలు తయారు చేయలేని కమిషన్ సిగ్గు సిగ్గు
- రాజధానిలో గ్రూప్-1పై పోస్టర్ల కలకలం

హిమాయత్‌నగర్/సుల్తాన్‌బజార్, అక్టోబర్ 4: హైదరాబాద్‌లోని నాంపల్లి టీజీపీఎస్సీ కార్యాలయం, హిమాయత్‌నగర్‌లోని తెలుగు అకాడమీ వద్ద శుక్రవారం వెలిసిన గ్రూప్ 1 పోస్టర్లు కలకలం సృష్టించాయి. ఆయా చోట్ల గేట్లు, గోడలకు ఎవరో గుర్తుతెలియని ఆగంతకులు వాటిని అంటించారు. తెలుగు అకాడమీ పుస్తకాలు పోటీ పరీక్షలకు ప్రామాణికం కాదని ప్రభుత్వం కోర్టుకు చెప్పిన నేపథ్యంలో వాటిని ఎవరూ కొనవద్దంటూ పోస్టర్లలో కోరారు. 'టీజీపీఎస్సీ అను నేను ఒక నియంతను.. తప్పు జరిగితే ఒప్పుకోను, గ్రూప్ 1లో 150 ప్రశ్నలు తయారు చేయలేని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఎందుకు సిగ్గు సిగ్గు, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తప్పులతో నిరుద్యోగులకు ఎన్ని తిప్పలో' అంటూ పోస్టర్లలో రాసి ఉన్నది. ఈ వ్యవహారం ఆయా చోట్ల చర్చనీయాంశంగా మారింది. తెలుగు అకాడమీ వద్ద వెలిసిన పోస్టర్లను నారాయణగూడ పోలీసులు తొలగించి, వాటిని అంటించిన వారి గురించి ఆరా తీస్తున్నారు.

గ్రూప్-1 వివాదంపై హైకోర్టు తీర్పు వాయిదా

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 పరీక్షల నిర్వహణకు సంబంధించిన వివాదంపై హైకోర్టు తన తీర్పును వాయిదా వేసింది. ఈ వ్యవహారంలో ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పును తర్వాత వెలువరిస్తామని ప్రకటించింది. గ్రూప్-1 పోస్టుల భర్తీ కోసం 2022లో జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయకుండా ప్రభుత్వం మరో నోటిఫికేషన్‌ను జారీ చేయడం చెల్లదని పేర్కొంటూ పలువురు అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ పుల్లా కార్తీక్ శుక్రవారం విచారణ జరిపారు. తొలుత ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది రాహుల్‌రెడ్డి వాదన వినిపిస్తూ.. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవతకవకలు జరగలేదని తెలిపారు. కీపై అభ్యర్థులు లేవనెత్తిన అభ్యంతరాలను నిపుణుల కమిటీకి సిఫారసు చేశామని, ఆ కమిటీ సిఫారసుల మేరకు రెండు ప్రశ్నలను తొలగించారని వివరించారు. పిటిషనర్లు చెప్తున్నట్టుగా 7 ప్రశ్నలకు జవాబులు తప్పుగా రాలేదని చెప్పారు. ఇప్పటికే పరీక్షల నిర్వహణలో జాప్యం జరగడం వల్ల అభ్యర్థులు నష్టపోయారని, ఈ దశలో పిటిషనర్ల వ్యాజ్యాలపై పిటిషన్లపై ఉత్తర్వులు జారీచేస్తే నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పిటిషనర్ల వ్యాజ్యాలను కొట్టివేయాలని కోరారు. దీనిపై పిటిషనర్ల తరపు న్యాయవాదులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రూప్-1 పరీక్షలో దాదాపు 7 ప్రశ్నలకు సమాధానాలు తప్పుగా ఉన్నాయని తెలిపారు. ఆ సమాధానాలకు దేన్ని ప్రామాణికం గా తీసుకోవాలన్న దానిపై టీజీపీఎస్సీకి స్పష్టత లేదని, కొన్నింటికి తెలుగు అకాడమీని, మరికొన్నింటికి వికీపీడియాను ప్రామాణికంగా తీసుకుని ప్రాథమిక కీని విడుదల చేశారని వివరించారు. గతంలో కూడా ఇదే హైకోర్టు గ్రూప్-1 పరీక్షను రద్దు చేసినప్పటికీ పొరపాట్లను సరిదిద్దుకోలేదని, నిరుద్యోగుల జీవితాలతో పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆటలాడుకుంటున్నదని పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలు పూర్తికావడంతో తీర్పును తర్వాత ప్రకటిస్తానని జస్టిస్ పుల్లా కార్తీక్ తెలిపారు.

సింగరేణిలో నికర లాభాల వాటా సాధిస్తాం

మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పిలుపు

గోదావరిఖని, అక్టోబర్ 4: సింగరేణి నికర లాభాల్లో కార్మికులకు 33శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6న పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ, టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టనున్నట్టు రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. సింగరేణి కార్మికులు, సకలజనులంతా ఈ దీక్షలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. సింగరేణి లాభాలపై రేవంత్ సర్కార్ కార్మికులను నట్టేట ముంచి 50 శాతం కోత విధించి మోసం చేసిందని మండిపడ్డారు. భారీ మొత్తంలో లాభాల వాటా (33 శాతం) పంచుతున్నట్టు ప్రచారం చేసుకుంటున్న కాంగ్రెస్.. కార్మికులకు అందించింది మాత్రం కొంతేనని పేర్కొన్నారు. కార్మికుల కష్టానికి గుర్తింపుగా నికర లాభాల నుంచి కార్మికులకు వాటాను అందించింది తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రం ఏర్పడిన తొలి ఏడాది 2014-15లోనే 21శాతం, 2022-23లో 32శాతం లాభాల వాటా ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు.

సరిహద్దుల్లో వేగంగా చైనా నిర్మాణాలు

ఐఏఎఫ్ చీఫ్ ఏపీ సింగ్

న్యూఢిల్లీ: వాస్తవాధీన రేఖ(ఎల్ఏసీ) వెంబడి, ముఖ్యంగా లడక్ సెక్టార్‌లో చైనా శరవేగంగా మౌలిక సదుపాయాలను నిర్మిస్తున్నదని భారత వైమానిక దళ అధిపతి ఏపీ సింగ్ శుక్రవారం తెలిపారు. భారత్ సైతం అదే స్థాయిలో మౌలిక సదుపాయాల నిర్మాణానికి ప్రయత్నిస్తున్నదని వెల్లడించారు. విదేశీ గడ్డపై మన శత్రువులను నిర్మూలించే సామర్థ్యం మనకుందని బాలాకోట్ వైమానిక దాడుల్లో చూపించామన్నారు. భారత సైన్యాధిపతి ఉపేంద్ర ద్వివేది ఇటీవల మాట్లాడుతూ ఎల్ఏసీ వద్ద పరిస్థితి స్థిరంగానే ఉన్నా సాధారణంగా లేదని తెలిపారు. ఈ విషయమై ఇరు దేశాల మధ్య కమాండర్ల స్థాయిలో జరుగుతున్న చర్చలు సానుకూల సంకేతాలు ఇస్తున్నాయని ఆయన తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పు సమీక్షకు సుప్రీంకోర్టు నో

న్యూఢిల్లీ: షెడ్యూల్డు కులాలకు కల్పించిన రిజర్వేషన్లను వాటిలోని ఉప కులాలను వర్గీకరించి కేటాయించే అధికారం రాజ్యాంగబద్ధంగా రాష్ట్రాలకు ఉందని గతంలో ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ తీర్పులో పొరపాటు లేదని చెప్పింది. ఈ తీర్పును ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చింది. దీనిని పునః సమీక్షించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను అదే ధర్మాసనం పరిశీలించి, డిస్మిస్ చేసింది. వీటిని ఓపెన్ కోర్టులో లిస్ట్ చేయాలన్న విజ్ఞప్తిని కూడా తిరస్కరించింది. ఈ కేసులో మెజారిటీ తీర్పుతో ఏకీభవించకుండా ప్రత్యేక అభిప్రాయాన్ని తెలిపిన జస్టిస్ బేలా ఎం త్రివేది కూడా ఈ పిటిషన్లను పరిశీలించి, డిస్మిస్ చేశారు.



కార్యకర్తల చేతులపై నడిచిన బీజేపీ నేత

కురుక్షేత్ర: కొందరు కార్యకర్తలు తమ అర చేతులను నేలపై ఉంచగా వారిని ఆశీర్వదిస్తూ బీజేపీ నేత ఒకరు వారి చేతులపై నడుచుకుంటూ వెళ్లడం వివాదంగా మారింది. ఈ నెల 5న జరిగే హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో పెహోవా నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జై భగవాన్ శర్మ ఇటీవల ఆ నియోజకవర్గంలో పర్యటించారు. వీర విధేయులైన కొందరు బీజేపీ కార్యకర్తలు భగవాన్ శర్మ పట్ల తమ విధేయతను చాటుకోవడానికి నేలపై మోకాళ్లపై కూర్చుని తమ రెండు చేతులను నేలపై ఉంచి, దానిపై నడిచి తమను ఆశీర్వదించాలని ఆయనను కోరారు. దీనికి భగవాన్ అభ్యంతరం చెప్పకుండా దర్జాగా వారి చేతులను తొక్కుకుంటూ నడిచారు. దీనిపై పలువురు నెటిజన్లు తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

అమేథీలో దళిత కుటుంబం కాల్చివేత

- పిల్లలనూ వదలని దుండగులు

అమేథి: బీజేపీ పాలిత యూపీలో దళిత ఉపాధ్యాయుని కుటుంబంలోని నలుగురిని దుండగులు దారుణంగా కాల్చి చంపారు. మృతుల్లో టీచర్ సునీల్ (35), అతని భార్య పూనమ్, ఐదేండ్లు, 18 నెలల ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటన అమేథి జిల్లా అహూర్వ భర్వానిలో గురువారం సాయంత్రం జరిగింది. ఉపాధ్యాయుడు సునీల్ నివసిస్తున్న అద్దె ఇంట్లోకి నిందితుడు చందన్ వర్మ, కొందరు దుండగులు చొరబడి విచక్షణా రహితంగా కాల్పులు జరిపారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. చందన్ వర్మ అనే వ్యక్తి తమపై వేధింపులకు పాల్పడుతున్నాడని టీచర్ భార్య పూనమ్ భారతి ఆగస్టు 18న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

36 మంది నక్సల్స్ మృతి

- ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో భీకర ఎన్‌కౌంటర్
- మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం
- మృతులు పీఎల్‌జీఏ 5, 6 కంపెనీ సభ్యులు?
- ఈ ఏడాది ఎదురు కాల్పుల్లో ఇప్పటి వరకు185 మంది మావోయిస్టుల మృతి



కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 4: పచ్చటి ప్రకృతిలో తుపాకులు గర్జించాయి. నట్టడివిలో నెత్తుటేర్లు ప్రవహించాయి. ఆయువుపట్టు లాంటి దండకారణ్యంలో మావోయిస్టులకు కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య శుక్రవారం భీకర పోరాటం జరిగింది. పోలీసుల తూటాలకు పెద్ద ఎత్తున సాయుధ నక్సలైట్లు ప్రాణాలు విడిచారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్ జిల్లా ఓర్చా పోలీస్ స్టేషన్ పరిధిలోని నెందూర్ – తులతులీ గ్రామాల మధ్య గల అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సమావేశమయ్యారన్న పక్కా సమాచారంతో దంతేవాడ, నారాయణపూర్ జిల్లాల పోలీసులు, డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్, కోబ్రా బలగాలు గురువారం సంయుక్తంగా సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో భద్రతా బలగాలు – మావోయిస్టులకు మధ్య కాల్పులు జరిగాయి. ఇరువైపులా సుమారు ఏడు సార్లు కాల్పులు జరిగినట్లు సమాచారం. మూడు గంటల భీకర పోరు తరువాత జవాన్ల తాకిడిని తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే దట్టమైన అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయారు. కాల్పులు ముగిసిన అనంతరం ఘటనా స్థలాన్ని భద్రతా బలగాలు తమ ఆధీనంలోకి తీసుకుని గాలింపు చేపట్టగా, 36 మంది మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. మావోయిస్టులకు చెందిన అధునాతన ఆయుధాలు, ఇతర సామగ్రిని సైతం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఘటన జరిగిన దంతేవాడ – నారాయణపూర్ జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

మావోలకు భారీ ఎదురుదెబ్బ

ఈ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టులు పీఎల్‌జీఏ 5, 6 కంపెనీలకు చెందిన సభ్యులుగా పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. 150 మందికి పైగానే సాయుధ మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్నట్టు తెలుస్తున్నది. 36 మంది మృతదేహాలు లభ్యమైనట్లు అధికారులు చెబుతున్నప్పటికీ 40 మంది మావోయిస్టులు మృతి చెందినట్టు సమాచారం. అయితే, ఈ ఎన్‌కౌంటర్‌లో మరణించిన వారిలో మావోయిస్టు అగ్రనేతలు ఎవరైనా ఉన్నారా అనేది తెలియాల్సి ఉంది. వరుస ఎన్‌కౌంటర్లతో నష్టపోతున్న మావోయిస్టులకు తాజా ఘటన పెద్ద ఎదురుదెబ్బ. ఈ కాల్పుల్లో ఒక కంపెనీ మొత్తాన్ని భద్రతా దళాలు తుడిచిపెట్టినట్టు ప్రచారం జరుగుతున్నది. ఒకవేళ అదే జరిగితే మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. మరి కొందరు మావోయిస్టులు బుల్లెట్ గాయాలతో తప్పించుకున్నారని, పలువురు మావోయిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలుస్తున్నది. ఈ ఘటన నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్, తెలంగాణ ప్రభుత్వాలు సరిహద్దుల్లో రెడ్ అలర్ట్ ప్రకటించాయి.

ఈ ఏడాదిలోనే 185 మంది మావోల మృతి

మావోయిస్టుల నిర్మూలనే లక్ష్యంగా కేంద్రం, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు చేపట్టిన ఆపరేషన్ 'కగార్' వేగంగా కొనసాగుతున్నది. ఈ క్రమంలో ఇటీవల వరుసగా జరుగుతున్న ఎన్‌కౌంటర్లలో భద్రతా దళాలు ఏకపక్షంగా పైచేయి సాధిస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు జరిగిన ఎన్‌కౌంటర్‌లలో 185 మందికి పైగానే మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో మహిళా మావోయిస్టుల సంఖ్య కూడా 40కి పైనే ఉంది. తాజా ఎన్‌కౌంటర్‌లో ఎంత మంది మహిళా మావోయిస్టులు ఉన్నారనేది తెలియాల్సి ఉంది.

తుది శ్వాసతో నక్సలిజం: సీఎం విష్ణుదేవ్

ఈ ఎన్‌కౌంటర్ భారీ ఆపరేషన్ అని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ పేర్కొన్నారు. నక్సలిజం తుదిశ్వాస తీసుకుంటున్నదని, రాష్ట్రం నుంచి నక్సలిజాన్ని పారదోలతామని పేర్కొన్నారు. ఇందుకోసమే కేంద్ర హోంమంత్రి అమిత్ షా గత తొమ్మిది నెలల్లో రెండుసార్లు రాష్ట్రంలో పర్యటించారని, 2026 మార్చి నాటికి నక్సలిజాన్ని అంతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆయన తెలిపారు.

సీఎం కుర్చీ కోసం పైరవీలు

- కర్ణాటక కాంగ్రెస్‌లో జోరుగా నేతల ప్రయత్నాలు
- ముడా స్కామ్‌లో కూరుకు పోయిన సిద్ధరామయ్య
- పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్లు



పరమేశ్వర



సతీశ్

బెంగళూరు: ముడా కుంభకోణంలో పీకల్లోతు కూరుకుపోయి విచారణను ఎదుర్కొంటున్న సీఎం సిద్ధరామయ్య ఏ క్షణంలోనైనా పదవిని కోల్పోతారన్న ఊహాగానాలు ఊపందుకున్నాయి. అదే సమయంలో ఆ పీఠాన్ని చేజిక్కించుకోవడానికి కొందరు నేతలు జోరుగా ప్రయత్నాలు ప్రారంభించారు. ఇప్పటికే ముడా కేసులో ఈడీ, లోకాయుక్త పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశాయి.

జోరుగా నేతల మంతనాలు

ఎస్సీ వర్గానికి చెందిన సీనియర్ మంత్రులు పరమేశ్వర, మహదేవప్ప, ఎస్టీ వర్గానికి చెందిన సతీశ్ జార్ఖిహోళి ఇటీవల కలుసుకోవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అంతకు ముందు డిప్యూటీ సీఎం శివకుమార్ కూడా పరమేశ్వర, జార్ఖిహోళితో విడివిడిగా సమావేశమై మంతనాలు జరిపారు. ఒక వేళ కాంగ్రెస్ అధిష్ఠానం కనుక సిద్ధరామయ్యను మార్చాలనుకుంటే పరమేశ్వర, శివకుమార్ ఆ పదవికి పోటీపడేవారిలో ముందువరుసలో ఉంటారని ఒక సీనియర్ నేత తెలిపారు. కాగా, ఇప్పటికే పార్టీలోని ఆర్‌వీ దేశ్‌పాండే, ఎంబీ పాటిల్ లాంటి నేతలు సిద్ధరామయ్యపై బాహాటంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తూ తాము ఆ పదవికి పోటీలో ఉన్నామంటూ ప్రకటించారు. ప్రతి ఒక్కరూ సీఎం పదవిని కోరుకుంటారని, అందులో తప్పు లేదని, అధిష్ఠానం సిద్ధరామయ్యను ముఖ్యమంత్రిని చేసింది కాబట్టి ఆయన ఆ పదవిలో ఉన్నారని పార్టీ సీనియర్ నేత, మాజీ సీఎం వీరప్ప మొయిలీ శుక్రవారం పేర్కొన్నారు. ఆయన ఐదేండ్లు సీఎంగా కొనసాగుతారా అన్నది అధిష్ఠానం ఇష్టమని, సిద్ధరామయ్య దిగిపోవాలంటూ పార్టీ నుంచి ఎలాంటి ఒత్తిడి లేదని ఆయన అన్నారు. కాగా, 2028 అసెంబ్లీ ఎన్నికల్లోనే తాను సీఎం పదవికి పోటీ పడతానని జార్ఖిహోళి గతంలో ప్రకటించారు.

సిద్ధూకి అధిష్ఠానం అండదండలు

ముడా కుంభకోణంలో సిద్ధరామయ్య పీకల్లోతు కూరుకుపోయినా ఆయనకు అధిష్ఠానం అండగా ఉన్నదన్న ప్రచారం జరుగుతున్నది. తమను అధికారంలోంచి దించేయడానికే కేంద్రంలోని బీజేపీ కేంద్ర దర్యాప్తు సంస్థలను, గవర్నర్ వ్యవస్థలను పావుగా వినియోగించుకుంటున్నదని, బీజేపీ ఎత్తులకు బ్రేక్ వేయాలంటే సిద్ధూనే సీఎంగా కొనసాగించాలని అధిష్ఠానం భావిస్తున్నట్టు ఆ వర్గాలు తెలిపాయి.

పార్టీ పరువు పోతున్నా కొనసాగిస్తారా?

ముడా కుంభకోణంలో పూర్తి ఆధారాలతో సిద్ధరామయ్యపై ఆరోపణలు ఉన్నాయని, ఆయన అందులోంచి బయటపడటం దాదాపు అసాధ్యమని పార్టీలోని కొందరు నేతలు పేర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సిద్ధూనే సీఎంగా కొనసాగితే పార్టీ పరువు బజారున పడటం ఖాయమని, ఆయనను మార్చడం తప్ప పార్టీకి మరో ప్రత్యామ్నాయం లేదని వారు అంటున్నారు.

జర్నలిస్టులపై క్రిమినల్ కేసులొద్దు

- **ప్రభుత్వాన్ని విమర్శించినంత మాత్రాన కేసులు పెట్టరాదు**
- పాత్రికేయుల భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడాలి
- **యూపీ జర్నలిస్టు పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఆదేశాలు**



న్యూఢిల్లీ: ప్రభుత్వాన్ని విమర్శించే వార్తలు రాశారనే కారణంతో జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు నమోదు చేయొద్దని సుప్రీంకోర్టు పేర్కొన్నది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(a) కింద జర్నలిస్టులకు ఉన్న భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడాలని స్పష్టం చేసింది. యూపీ ప్రభుత్వ అధికారుల్లో కుల సమీకరణాలను ఉద్దేశించి జర్నలిస్టు అభిషేక్ ఉపాధ్యాయ్ 'యాదవ్ రాజ్ వర్సెస్ ఠాకూర్ రాజ్' శీర్షికన ఒక కథనం రాశారు. దీనిపై లక్నోలోని హజ్రత్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో సెప్టెంబర్ 20న ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదయ్యింది. నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాల్సిందిగా ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టీ విచారించారు.

యూపీ ప్రభుత్వానికి నోటీసులు

పిటిషన్ విచారణ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. 'కేవలం జర్నలిస్టు రాసినవి ప్రభుత్వాన్ని విమర్శించేలా ఉన్నాయనే కారణంతో క్రిమినల్ కేసులు పెట్టొద్దు' అని కోర్టు స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌పై స్పందన తెలియజేయాల్సిందిగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. కేసును నాలుగు వారాల పాటు వాయిదా వేసింది. ఈ లోగా పిటిషనర్‌దారుపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. కాగా, యూపీ పోలీసులు అధికారిక 'ఎక్స్' అకౌంట్ ద్వారా చట్టపరమైన చర్యలు ఉంటాయని పిటిషనర్‌ను హెచ్చరించారని, అతడిపై రాష్ట్రంలో ఎన్ని ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయో కూడా తెలియని పరిస్థితుల్లో కోర్టును ఆశ్రయించినట్టు పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

'టాయ్‌లెట్ ట్యాక్స్'పై వెనక్కు

విమర్శలతో ఉత్తర్వులు రద్దు చేసిన హిమాచల్ కాంగ్రెస్ సర్కారు

సిమ్లా, అక్టోబర్ 4: 'టాయ్‌లెట్ ట్యాక్స్'పై హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కు తగ్గింది. పట్టణ ప్రాంతాల్లో మరుగుదొడ్లపై రూ.25 చొప్పున పన్ను వసూలు చేయాలని ఇచ్చిన నోటిఫికేషన్‌ను శుక్రవారం ఉపసంహరించుకుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పట్టించుకోకుండా అలవికాని హామీలు ఇచ్చి హిమాచల్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు రాష్ట్రాన్ని ఆర్థిక కష్టాల్లోకి నెట్టేసింది. ఉద్యోగులకు సమయానికి వేతనాలు సైతం ఇవ్వలేకపోతున్నది. ఈ నేపథ్యంలో ప్రజలపైనే భారం వేసి ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తున్నది. ఇందులో భాగంగానే విధించిన టాయ్‌లెట్ ట్యాక్స్‌పై రాష్ట్రంలోని ప్రతిపక్ష బీజేపీతో పాటు ప్రజల నుంచి కూడా పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. దీంతో సుఖ్వీందర్ సింగ్ సుఖు సర్కారు ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాల్సి వచ్చింది.



సచివాలయం నుంచి దూకేసిన డిప్యూటీ స్పీకర్, నేతలు

ముంబై, అక్టోబర్ 4: మహారాష్ట్ర డిప్యూటీ స్పీకర్ నరహరి జిర్వాల్ తన అనూహ్య చర్యతో అందరినీ షాక్‌కు గురి చేశారు. మహారాష్ట్ర సచివాలయమైన మంత్రాలయ భవనం మూడో అంతస్తు నుంచి కిందకు దూకారు. అయితే ఆయన రెండో అంతస్తులో ఏర్పాటు చేసిన నెట్‌పైనే దూకడంతో ఎలాంటి గాయాలు కాలేదు. ధన్గర్ కులస్తులను ఎస్టీలో చేర్చడాన్ని నిరసిస్తూ జిర్వాల్, ఎన్సీపీ ఎమ్మెల్యే కిరణ్ లహమటే, బీజేపీ గిరిజన ఎంపీ హేమంత్ సవర శుక్రవారం భవనం పై నుంచి కిందకు దూకేశారు. అయితే ఆత్మహత్యల నివారణ కోసం రెండో అంతస్తులో ఏర్పాటు చేసిన వలలో వారు పడటంతో ఎలాంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడ్డారు. దీనిపై బీజేపీ ఎమ్మెల్సీ గోపీచంద్ పడల్కర్ మాట్లాడుతూ రాజ్యాంగ పదవిలో ఉన్న జిర్వాల్ లాంటి వ్యక్తి ఇలాంటి దుందుడుకు నిరసనకు దిగాల్సిన అవసరం లేదని అన్నారు.

కోర్టును ధిక్కరించి కూల్చేస్తే.. పునరుద్ధరించాల్సిందే

బుల్డోజర్ కూల్చివేతలపై గుజరాత్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు హెచ్చరిక

న్యూఢిల్లీ: బుల్డోజర్ జస్టిస్‌కు వ్యతిరేకంగా ఇటీవల ఇచ్చిన ఆదేశాలను ధిక్కరించి ఏమైనా నిర్మాణాలను కూల్చేస్తే, వాటిని పునరుద్ధరించాలని ఆదేశిస్తామని గుజరాత్ ప్రభుత్వ అధికారులను సుప్రీంకోర్టు శుక్రవారం హెచ్చరించింది. కోర్టు ధిక్కరణకు పాల్పడిన అధికారులను జైలుకు కూడా పంపిస్తామని చెప్పింది. సుప్రీంకోర్టు గత నెల 17న ఇచ్చిన ఆదేశాల్లో, దేశవ్యాప్తంగా ఎటువంటి నిర్మాణాల కూల్చివేతలు జరగరాదని పేర్కొంది. కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్నవారి ఆస్తులను సైతం ధ్వంసం చేయరాదని స్పష్టం చేసింది. ఏమైనా నిర్మాణాలను కూల్చివేయాలంటే ముందుగా తన అనుమతి పొందాలని తెలిపింది. అయితే, రోడ్లు, జలాశయాలు, నదీపరీవాహక ప్రాంతాలు, ఫుట్‌పాత్‌లు వంటి బహిరంగ ప్రదేశాల్లో అక్రమ నిర్మాణాలను కూల్చేయడానికి ఈ ఆదేశాలు వర్తించబోవని తెలిపింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ, గత నెలలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించలేదని చెప్పారు.

లడ్డూ వివాదంపై స్వతంత్ర సిట్

- ఐదుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందం
- భక్తుల విశ్వాసాన్ని దృష్టిలో పెట్టుకొనే ఏర్పాటు చేశాం
- సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో సమగ్ర విచారణ జరగాలి
- సుప్రీంకోర్టు ద్వి సభ్య ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ రద్దు

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ)/(స్పెషల్ టాస్క్ బ్యూరో): తిరుమల లడ్డూ వివాదంపై ఐదుగురు సభ్యులతో స్వతంత్ర ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటుకు సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ సిట్‌లో ఇద్దరు సీబీఐ, ఇద్దరు ఏపీ పోలీసు అధికారులు, ఫుడ్‌సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఎస్ఏఐ) నుంచి ఒకరు ఉండాలని సూచించింది. ఈ సిట్ పర్యవేక్షణ బాధ్యతలను సీబీఐ డైరెక్టర్‌కు అప్పగించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ రద్దు అవుతుందని స్పష్టం చేసింది. తిరుమల లడ్డూ కల్తీ ఆరోపణలపై కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరగాలని ఐదుగురు పిటిషన్లు దాఖలు చేశారు. ఇందులో సీనియర్ బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి, చరిత్రకారుడు డాక్టర్ విక్రమ్‌సంపత్, ప్రవచన కర్త దుష్యంత్, సుదర్శన్ న్యూస్ టీవీ సంపాదకుడు సురేష్ ఖండేరావు, చౌహాన్‌కే, హిందూసేన అధ్యక్షుడు సూర్జిత్‌సింగ్ యాదవ్ ఉన్నారు. ఈ పిటిషన్లపై శుక్రవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. లడ్డూ వివాదం రాజకీయ డ్రామాగా మారకూడదని స్పష్టంచేసింది. ఇది ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ప్రజల మనోభావాలకు సంబంధించిన అంశమని గుర్తు చేసింది.

స్వతంత్ర దర్యాప్తు చేయాల్సిందే

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాదనలపై పిటిషనర్ల తరఫు సీనియర్ అడ్వొకేట్ కపిల్ సిబల్ అభ్యంతరం తెలిపారు. లడ్డూ వివాదానికి సంబంధించి గురువారం కూడా ఏపీ సీఎం చంద్రబాబు మరో ప్రకటన చేశారని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఈ వాదనలపై ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ జోక్యం చేసుకొని ఈ కేసుకు సంబంధించిన నివేదిక జూలైలో వచ్చిందని, రెండింటికీ సంబంధం లేదని అన్నారు.



రాష్ట్ర సిట్‌పై ఎలాంటి సందేహం లేదు: ఎస్జీ

తొలుత కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్(ఎస్జీ) తుషార్ మెహతా వాదనలు వినిపించారు. 'రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సిట్ సభ్యులపై ఎలాంటి సందేహాలు లేవు. కావాలంటే కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి ఒకరిని సిట్‌లో చేర్చవచ్చు' అని కోర్టుకు నివేదించారు. దీనిపై రోహత్గీ జోక్యం చేసుకొని..'తాము సిట్‌తో విచారణ చేయించాలనుకుంటున్నాం. అందులో మీకు నచ్చిన అధికారిని చేర్చవచ్చు' అని తెలిపారు.

బాధ్యత మీదంటే మీదని వాదన

నెయ్యి ట్యాంకర్లు అసలు సరఫరాదారు నుండి సరఫరా కాలేదని టీటీడీ తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. పందికొవ్వు ఉపయోగించినట్టు కచ్చితమైన రుజువు ఉందని రోహత్గీ కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ వ్యాఖ్యలను కపిల్ సిబల్ ఖండించారు. ఈ ఆరోపణలను ఏ రిపోర్ట్ చెప్పిందని ప్రశ్నించారు. అందుకు రోహత్గీ నివేదిక చూపించగా.. దానికి కపిల్ సిబల్ జోక్యం చేసుకుని 'ఇది కూరగాయల కొవ్వు. జంతువుల కొవ్వు కాదు. అందుకే స్వతంత్ర విచారణకు ఆదేశించాలి' అని డిమాండ్ చేశారు. లూథ్రా స్పందిస్తూ.. జూలై 4 వరకు వచ్చినవి పరీక్షించలేదని, కానీ జూలై 6, 12 తేదీల్లో చేరినవి కల్తీ అయ్యాయని అన్నారు. అయితే, కొండపైకి వెళ్లేందుకు ఎందుకు అనుమతించారని, మీరే బాధ్యత వహించాలని కపిల్ సిబల్ అన్నారు. టెండర్ ఇచ్చింది మీరే(గత ప్రభుత్వం)అని లూథ్రా ఆరోపించారు.

కోర్టులను రాజకీయ యుద్ధ భూములుగా మారనివ్వం: ధర్మాసనం

''సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో సీబీఐ నుంచి ఇద్దరు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇద్దరు, ఎఫ్ఎస్ఎస్ఏఐ నుంచి ఒకరితో కూడిన స్వతంత్ర సిట్ దర్యాప్తు జరుగుతుంది' అని కోర్టు స్పష్టం చేసింది. కోర్టును రాజకీయ యుద్ధభూమిగా ఉపయోగించుకోవడానికి అనుమతించబోమని పేర్కొన్నది. కోట్లాది మంది ప్రజల అనుమానాలను నివృత్తి చేయడానికి స్వతంత్ర సిట్ దర్యాప్తు జరుగుతుందని స్పష్టం చేసింది.

నేడు హర్యానా అసెంబ్లీ ఎన్నికలు

హ్యాట్రిక్‌పై బీజేపీ కన్ను

బ్రేక్ వేయాలని కాంగ్రెస్ యత్నం

చండీగఢ్, అక్టోబర్ 4: 90 శాసన సభ స్థానాలున్న హర్యానా అసెంబ్లీకి శనివారం ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 1,031 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. చాలా స్థానాల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్య ముఖాముఖి పోరు నెలకొంది. హ్యాట్రిక్ విజయంపై బీజేపీ కన్నేయగా, దశాబ్దం తర్వాత అధికారాన్ని చేజిక్కించుకోవాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నది. ఆప్, ఐఎన్ఎల్‌డీ–బీఎస్పీ, జేజేపీ–అజాద్ సమాజ్ పార్టీ తమ సత్తా చాటాలని చూస్తున్నాయి. కాంగ్రెస్, బీజేపీకిరెబెల్స్ బెడద కూడా ఉంది. సీఎం నాయబ్ సింగ్ సైనీ, శాసనసభలో విపక్ష నేత భూపిందర్ సింగ్ హూడా, అభయ్ సింగ్ చౌతాలా, మాజీ రెజ్లర్, కాంగ్రెస్ అభ్యర్థి వినేశ్ ఫొగాట్, తదితర ప్రముఖులు ఎన్నికల బరిలో ఉన్నారు. ఓట్ల లెక్కింపు ఈ నెల 8న జరగనుంది.

'వయసును తగ్గించే టైమ్ మెషీన్' అంటూ టోకరా

35 కోట్లకు వృద్ధులను మోసగించిన దంపతులు

కాన్పూరు: అరవయ్యేళ్ల వృద్ధులను పాతికేళ్ల యువకులుగా మార్చుతామంటూ ఇద్దరు దంపతులు భారీ మోసానికి పాల్పడ్డారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రాజీవ్ కుమార్ దూబే, ఆయన భార్య రష్మి కలిసి రివైవల్ వరల్డ్ అనే థెరపీ సెంటర్‌ను ప్రారంభించారు. తాము ఇజ్రాయెల్‌లో తయారైన ఓ టైమ్ మెషీన్‌ను తీసుకొచ్చామని, దాని ద్వారా వృద్ధులను తిరిగి యువకులుగా మార్చుతామని ప్రచారం చేశారు. దీని కోసం ఆక్సిజన్ థెరపీకి 10 సెషన్లకు రూ.6,000; మూడేళ్ల పాటు చికిత్సకు రూ.90,000 చెల్లించాలని చెప్పారు. వీరి మోసానికి గురైన బాధితురాలు రేణు సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన వద్ద రూ.10.75 లక్షలు తీసుకున్నారని, తనను మోసం చేశారని ఆరోపించారు. చాలా మందిని ఇలా మోసం చేసి, సుమారు రూ.35 కోట్లు దండుకున్నారని తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించడంతో ఈ దంపతులిద్దరూ విదేశాలకు పారిపోయినట్లు అనుమానిస్తున్నారు.

శక్తి కోసం ఐవీఎన్ థెరపీ

అలసట తగ్గేందుకు సెలైన్లను ఆశ్రయిస్తున్న ద.కొరియా, చైనా ఉద్యోగులు

సియోల్, అక్టోబర్ 4: దక్షిణ కొరియా, చైనాలో ఉద్యోగులు తమ అలసటను తగ్గించుకునేందుకు, కొత్త శక్తిని పొందేందుకు విరివిగా ఇంట్రావీనస్ డ్రిప్స్‌ను (సెలైన్లను) ఉపయోగిస్తున్నట్టు 'ఎంవై న్యూస్' వెల్లడించింది. ఇంట్రావీనస్ న్యూట్రియెంట్ థెరపీ (ఐవీఎన్‌టీ)గా పిలిచే ఈ ప్రక్రియలో ద్రవ విటమిన్లను, సెలైన్‌ను నేరుగా దేహంలోకి పంపిస్తారు. గతంలో క్యాన్సర్ చికిత్సకు, కీళ్ల ఆరోగ్యానికి, ఎదుగుదలకు సంబంధించిన లోపాల చికిత్సకు ఉపయోగించిన ఐవీఎన్‌టీ ఇప్పుడు సౌందర్య వైద్యంలోకి ప్రవేశించినట్టు దక్షిణ కొరియాకు చెందిన 'మెడికల్ ఈస్థటిక్స్ న్యూస్' ఓ నివేదికలో పేర్కొన్నది. దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లోని ఓ క్లినిక్‌లో ఈ న్యూట్రియెంట్ డ్రిప్స్ ధర ఒక్కో సెషన్‌కు 25 వేల నుంచి 60 వేల వాన్‌ల (దాదాపు రూ.1,500 నుంచి రూ.3,600) వరకు ఉంటుంది.ఆల్ఫా లిపోయిక్ యాసిడ్ లాంటి యాంటీ ఆక్సిడెంట్లతోపాటు సీ విటమిన్ సమృద్ధిగా ఉండే సిండ్రెల్లా డ్రిప్ ఒత్తిడిని తగ్గించేందుకు, వృద్ధాప్యాన్ని నెమ్మదింపజేసేందుకు దోహదపడుతుందని తెలిపింది. బీ1 విటమిన్‌తో కూడిన గార్లిక్ డ్రిప్ అలసటను తగ్గిస్తుందని ఆ క్లినిక్ పేర్కొన్నది.

హెజ్బొల్లా కమ్యూనికేషన్ కమాండర్ హతం

- మరిన్ని సర్‌ప్రైజ్‌లు ఉంటాయి: ఇజ్రాయెల్
- లెబనాన్‌పై జరిపిన దాడుల్లో 37 మంది మృతి

బీరుట్, అక్టోబర్ 4: హెజ్బొల్లా అధినేత నస్రల్లాను హతమార్చిన ఇజ్రాయెల్ ఇప్పుడు నస్రల్లా వారసుడిని లక్ష్యంగా చేసుకున్నది. శుక్రవారం ఉదయం లెబనాన్ రాజధాని బీరుట్ నగరంలోని అంతర్జాతీయ విమానాశ్రయం బయట ఇజ్రాయెల్ దాడికి పాల్పడింది. హెజ్బొల్లా సీనియర్ నేత హషేమ్ సఫీద్దీన్ లక్ష్యంగా ఈ దాడి చేసినట్టు తెలుస్తున్నది. నస్రల్లా మరణం తర్వాత హెజ్బొల్లాకు సఫీద్దీన్ నాయకత్వం వహించనున్నట్టు భావిస్తున్నారు. కాగా, హెజ్బొల్లా కమ్యూనికేషన్ విభాగం కమాండర్ మహమ్మద్ రషీద్ సకాఫిని హతమార్చినట్టు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) శుక్రవారం ప్రకటించింది. లెబనాన్‌పై తాము జరిపిన దాడుల్లో 37 మంది మృతి చెందారని చెప్పింది.

మరిన్ని సర్‌ప్రైజ్‌లు ఉంటాయి: ఇజ్రాయెల్

హెజ్బొల్లాకు మరిన్ని ఊహించని ఘటనలు ఎదురవుతాయని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యోవ్ గలాంట్ పేర్కొన్నారు. 'హెజ్బొల్లాకు ఒకదాని తర్వాత ఒకటి తీవ్రమైన ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. మేము నస్రల్లాను హతమార్చాం. మా ఆయుధాగారంలో మరిన్ని సర్‌ప్రైజ్‌లు ఉన్నాయి. హెజ్బొల్లాకు మరిన్ని ఊహించని ఘటనలు జరగనున్నాయి. కొన్ని ఇప్పటికే చేపట్టాం, ఇంకొన్ని చేపట్టాల్సి ఉంది' అని గలాంట్ అన్నారు.

హౌతీలపై అమెరికా, బ్రిటన్ దాడి

ఇరాన్ మద్దతున్న హౌతీలపై అమెరికా, బ్రిటన్ శుక్రవారం దాడులు చేశాయి. యెమెన్‌లో ఆయుధ వ్యవస్థలు, స్థావరాలు, ఆయుధ పరికరాలు నిల్వ చేసిన ప్రదేశాలు లక్ష్యంగా వైమానిక, నౌకా దాడులు జరిపినట్టు ఒక అధికారి ధ్రువీకరించారు. కాగా, తమ ప్రధాన పోర్టు సిటీ హొడియాడ ఎయిర్‌పోర్టు, ప్రధాన మిలటరీ బేస్ ఉన్న కతియాబ్ లక్ష్యంగా ఏడు దాడులు జరిగినట్టు హౌతీ తెలిపింది.

టాయ్‌లెట్‌లో నిఘా పరికరం

ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూపై బ్రిటన్ మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్ సంచలన ఆరోపణలు చేశారు. తన బాత్‌రూమ్‌లో నెతన్యాహూ ఒక నిఘా పరికరాన్ని వదిలిపెట్టి వెళ్లారని ఓ పుస్తకంలో ఆరోపించారు.

ఇజ్రాయెల్ ఎక్కువకాలం ఉండదు: ఖమేనీ

తాజాగా ఇరాన్ చేసిన క్షిపణుల దాడిని ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ సమర్థించుకున్నారు. ఈ దాడులు న్యాయమైనవని పేర్కొన్నారు. మధ్య ప్రాచ్యంలో ఇజ్రాయెల్‌పై పోరాటం కొనసాగుతుందని, హమాస్, హెజ్బొల్లాకు ఇజ్రాయెల్ తీవ్రమైన హాని తలపెట్టలేదని, యూదుల దేశం(ఇజ్రాయెల్) ఎక్కువ కాలం ఉండదని పేర్కొన్నారు.

నేటి నుంచే టికెట్ల విక్రయం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: భారత్, బంగ్లాదేశ్ మధ్య ఈనెల 12న హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో జరగాల్సిన మూడో టీ20 మ్యాచ్‌కు శనివారం నుంచి ఆన్‌లైన్‌లో టికెట్లు విక్రయించనున్నట్టు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్ మోహన్‌రావు తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12:30 గంటల నుంచి పేటీఎం ఇన్‌సైడర్ వెబ్‌సైట్/ఆప్‌లో టికెట్లను విక్రయించనున్నట్టు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన టికెట్లను ఈనెల 8 నంచి 12 దాకా జింఖానా మైదానంలో రిడంప్షన్ చేసుకోవాలని సూచించారు. ఆఫ్‌లైన్‌లో టికెట్లను విక్రయించడం లేదని ఆయన స్పష్టం చేశారు.

రెండో రౌండ్‌కు బోపన్న ద్వయం



షాంఘై (చైనా): భారత టెన్నిస్ డబుల్స్ ఆటగాడు రోహన్ బోపన్న, తన సహచర ఆటగాడు ఇవాన్ డొడిగ్ (క్రొయేషియా) ఏటీపీ మాస్టర్స్ 1000 షాంఘై టోర్నీ రెండో రౌండ్‌కు ప్రవేశించారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న-డొడిగ్ జోడీ.. 6-4, 6-3తో వరుస సెట్లలో పాబ్లో కరెనొ-పెడ్రొ మార్టిన్ (స్పెయిన్)ను వరుస సెట్లలో ఓడించింది.

సబలెంకకు షాక్



బీజింగ్ (చైనా): ఈ ఏడాది ఆస్ట్రేలియా ఓపెన్‌తో పాటు ఇటీవలే ముగిసిన యూఎస్ ఓపెన్ గెలిచిన జోరుమీదు న్న ప్రపంచ రెండో ర్యాంకర్ అరీనా సబలెంక (బెలారస్)కు చైనా ఓపెన్‌లో అనూహ్య షాక్ తగిలిం ది. ఈ టోర్నీ మహిళల క్వార్టర్స్‌లో సబలెంక.. 6-7 (5/7), 6-2, 4-6తో కరోలినా ముచో వా (చెక్ రిపబ్లిక్) చేతిలో పరాభవం పాలైంది. దీంతో ఆమె 15 వరుస విజయాలకు బ్రేక్ పడ్డట్టైంది. సెమీస్‌లో ముచోవా.. చైనా అమ్మాయి కిన్వెన్ జంగ్‌తో తలపడనుంది. మరో సెమీస్ కోకో గాఫ్, పౌలా బడోసా మధ్య జరుగనుంది.

భారత్‌కు భంగపాటు

తొలి మ్యాచ్‌లో భారత్ ఘోర ఓటమి • కివీస్ సునాయస విజయం • బ్యాటింగ్ వైఫల్యంతో టీమ్ఇండియా కుదేలు • మహిళల టీ20 ప్రపంచకప్

మహిళల టీ20 ప్రపంచకప్ వేటను భారత్ ఓటమితో ప్రారంభించింది. టైటిల్ ఫేవరెట్లలో ఒకటిగా బరిలోకి దిగిన టీమ్ఇండియాకు బ్యాటింగ్ వైఫల్యంతో న్యూజిలాండ్ చేతిలో పరాభవం తప్పలేదు. కివీస్ నిర్దేశించిన 161 పరుగుల మోస్తరు లక్ష్య ఛేదనలో భారత టాపార్డర్ దారుణంగా విఫలమవడంతో ఓటమి అనివార్యమైంది. స్మృతి మంధాన, షఫాలీ వర్మ, హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ తీవ్రంగా నిరాశపరిచారు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న కివీస్.. టోర్నీని ఘనంగా మొదలుపెట్టింది.



హర్మన్ (15)



దుబాయ్: భారీ ఆశలతో మహిళల టీ20 ప్రపంచకప్ టోర్నీకి వెళ్లిన భారత క్రికెట్ జట్టుకు తొలి మ్యాచ్‌లోనే ఘోర పరాభవం ఎదురైంది. మొదటి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సేనకు న్యూజిలాండ్ షాకిచ్చింది. దుబాయ్ లోని ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో కివీస్ అమ్మాయిలు.. భారత్‌ను 58 పరుగుల తేడాతో ఓడించి టోర్నీలో ఘనంగా బోణీ కొట్టారు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్.. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 160 పరుగులు చేసింది. కెప్టెన్ సోఫీ డివైన్ (36 బంతుల్లో 57 నాటౌట్, 7 ఫోర్లు) ధనాధన్ ఆటతో విరుచుకుపడగా ఓపెనర్ ప్లిమ్మర్ (23 బంతుల్లో 34, 3 ఫోర్లు, 1 సిక్స్) వేగంగా ఆడింది. భారత బౌలర్లలో రేణుకా సింగ్ (2/27) రాణించింది. లక్ష్య ఛేదనలో భారత్ 19 ఓవర్లలో 102 పరుగులకే కుప్పకూలింది. భారత్ తరఫున ఒక్క బ్యాటర్ కూడా 20 పరుగుల మార్కును అందుకోలేకపోయారు. హర్మన్‌ప్రీత్ కౌర్ (15) టాప్ స్కోరర్. కివీస్ పేసర్ రోస్‌మెరీ మెయిర్ (4/19), లీ తహుహు (3/15), ఈడెన్ కార్సన్ (2/34) ఆ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. డివైన్‌కే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

రాణించిన డివైన్, ప్లిమ్మర్..

మొదట బ్యాటింగ్ చేసిన కివీస్ ఆది నుంచే దూకుడుగా ఆడింది. ఓపెనర్లు సూజి బేట్స్ (27), ప్లిమ్మర్ తొలి వికెట్‌కు 7.4 ఓవర్లలోనే 67 పరుగులు జతచేశారు. వీరి దూకుడుతో 6.4 ఓవర్లలోనే ఆ జట్టు అర్ధ సెంచరీ భాగస్వామ్యాన్ని పూర్తిచేసింది. తెలుగమ్మాయి అరుంధతి రెడ్డి ఇన్నింగ్స్ 8వ ఓవర్‌లో నాలుగో బంతికి బేట్స్‌ను ఔట్ చేసి ఈ జోడీని విడదీసింది. మరుసటి ఓవర్లోనే ప్లిమ్మర్.. ఆశా శోభన బౌలింగ్‌లో స్మృతి మంధానకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. ఆ తర్వాత కివీస్ ఇన్నింగ్స్ కాస్త నెమ్మదించింది. డివైన్ సింగిల్స్‌కే పరిమితమైంది. అమెలియా కెర్ (13)ను రేణుకా వెనక్కి పంపింది. కానీ దీప్తి శర్మ 18వ ఓవర్లో బ్రూక్ హాలిడే (16) రెండు ఫోర్లు కొట్టగా డివైన్ కూడా ఓ బౌండరీ బాది స్కోరు వేగాన్ని పెంచింది. ఆఖరి ఓవర్లో మూడో బంతిని బౌండరీకి తరలించిన డివైన్.. హాఫ్ సెంచరీని పూర్తిచేసుకుంది.

భారత్ టపటప..

మోస్తరు లక్ష్య ఛేదనలో భారత్ రెండో ఓవర్ నుంచే క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. స్టార్ బ్యాటర్ షఫాలీ వర్మ (2) రెండో ఓవర్ తొలి బంతికే ఈడెన్ కార్సన్‌కు రిటర్న్ క్యాచ్ ఇవ్వడంతో భారత వికెట్ల పతనం మొదలైంది. ఇన్నింగ్స్ తొలి బంతినే బౌండరీకి తరలించిన స్మృతి మంధాన (12) కూడా కార్సన్ 5వ ఓవర్లో గ్రీన్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరింది. మెయిర్ 6వ ఓవర్లో హర్మన్‌ప్రీత్ వికెట్ల ముందు దొరికిపోయింది. టీమ్ఇండియా అభిమానులు భారీ ఆశలు పెట్టుకున్న జెమీమా రోడ్రిగ్స్ (13), రిచా ఘోష్ (12) తీవ్రంగా నిరాశపరిచారు. సీనియర్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (13), బౌలింగ్ ఆల్‌రౌండర్ పూజా వస్త్రకార్ (8) సైతం విఫలమయ్యారు. ఈ టోర్నీలో భారత్.. ఆదివారం దాయాది పాకిస్థాన్‌తో ఆడాల్సి ఉంది.

సంక్షిప్త స్కోర్లు

న్యూజిలాండ్: 20 ఓవర్లలో 160/4 (డివైన్ 57 నాటౌట్, ప్లిమ్మర్ 34, రేణుకా 2/27, ఆశా 1/22)
భారత్ : 19 ఓవర్లలో 102 ఆలౌట్ (హర్మన్‌ప్రీత్ 15, జెమీమా 13, మెయిర్ 4/19, తహుహు 3/15)

సఫారీల శుభారంభం

• **వెస్టిండీస్‌పై ఘనవిజయం**

దుబాయ్: రెండేండ్ల క్రితం తమ సొంతగడ్డపై జరిగిన మహిళల టీ20 ప్రపంచకప్‌లో రన్నరప్‌గా నిలిచిన దక్షిణాఫ్రికా.. 2024 ఎడిషన్‌ను విజయంతో ఆరంభించింది. శుక్రవారం దుబాయ్‌లోని దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా గ్రూప్-బీలో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికా పది వికెట్ల తేడాతో విండీస్‌ను చిత్తుచిత్తుగా ఓడించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన విండీస్.. సఫారీ బౌలర్ల ధాటికి నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 118 పరుగులు మాత్రమే చేయగలిగింది. స్టఫానీ టేలర్ (41 బంతుల్లో 44 నాటౌట్, 2 ఫోర్లు, 1 సిక్సర్) ఆదుకోవడంతో కరీబియన్ జట్టు ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. సౌతాఫ్రికా బౌలర్లలో నొన్కులులెకో లబ (4/29) నాలుగు వికెట్లతో విండీస్‌ను కట్టడి చేయగా పేసర్ మరిజన్నె కాప్ (2/14) రాణించింది. ఛేదనను సౌతాఫ్రికా ఓపెనర్లు కెప్టెన్ లారా వోల్వార్డ్ట్ (55 బంతుల్లో 59 నాటౌట్, 7 ఫోర్లు), తజ్మిన్ బ్రిట్స్ (52 బంతుల్లో 57 నాటౌట్, 6 ఫోర్లు) 17.5 ఓవర్లలో పూర్తిచేశారు. విండీస్ బౌలర్లు ఒక్క వికెట్ కూడా తీయలేకపోయారు. లబకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.



లబ (4/29)

భారత షూటర్లకు మరో స్వర్ణం



లిమా (పెరూ): ఇంటర్నేషనల్ షూటింగ్ స్పోర్ట్స్ ఫెడరేషన్ (ఐఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో లిమా వేదికగా జరుగుతున్న జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత్ పతక జోరును కొనసాగిస్తోంది. పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టోల్ టీమ్ కాంపిటీషన్ ఫైనల్‌లో ముకేశ్ నెలవెల్లి, రాజ్‌వర్ధన్ పాటిల్, హర్సిమర్ సింగ్ కూడిన భారత త్రయం పసిడి సాధించింది. ఈ టోర్నీలో భారత్‌కు ఇది 11వ స్వర్ణం. ఇదే ఈవెంట్ వ్యక్తిగత ఈవెంట్‌లో రాజ్‌వర్ధన్, ముకేశ్ వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచారు. మొత్తంగా ఈ టోర్నీలో భారత్ 11 స్వర్ణాలు, 1 రజతం, 4 కాంస్యాలతో 16 పతకాలతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

అజారుద్దీన్‌కు మరోసారి నోటీసులు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) మాజీ అధ్యక్షుడు, తెలంగాణ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ అజారుద్దీన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శుక్రవారం మరోసారి నోటీసులు జారీ చేసింది. ఆయన హయాంలో హెచ్‌సీఏలో జరిగిన రూ. 20 కోట్ల అక్రమాలపై విచారణకు హాజరుకావాలని ఈడీ అజారుద్దీన్‌ను ఆదేశించిన విషయం తెలిసిందే. అజారుద్దీన్ గురువారమే విచారణకు హాజరుకావాల్సి ఉండగా వ్యక్తిగత కారణాల దృష్ట్యా తాను అందుబాటులో ఉండటం లేదని, వారం రోజులు గడువు కావాలని కోరుతూ ఆయన ఈడీ అధికారులకు లేఖ రాశారు. లేఖను పరిగణనలోకి తీసుకున్న ఈడీ.. మరో నోటీసు జారీ చేస్తూ ఈనెల 8న విచారణకు హాజరుకావాలని ఆయనకు సూచించింది.

ముంబైకి భారీ ఆధిక్యం

రసవత్తరంగా ఇరానీ కప్



లక్నో: ప్రతిష్టాత్మక ఇరానీ కప్‌లో రంజీ చాంపియన్ ముంబై భారీ ఆధిక్యంతో ఈ మ్యాచ్‌ను శాసించే స్థితికి చేరింది. లక్నోలోని ఏకనా స్టేడియం వేదికగా జరుగుతున్న మ్యాచ్ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 40 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది. పృథ్వీ షా (76) మెరుపు అర్ధ సెంచరీ సాధించాడు. 37 బంతుల్లోనే అతడి అర్ధ సెంచరీ పూర్తవడం విశేషం. సర్ఫరాజ్ (9 నాటౌట్), తనుష్ (20 నాటౌట్) క్రీజులో ఉన్నారు. పృథ్వీ దూకుడుతో ఆ జట్టు 274 పరుగుల భారీ ఆధిక్యంలో ఉంది. అంతకుముందు ఓవర్ నైట్ స్కోరు 289/4 వద్ద నాలుగో రోజు ఆట ఆరంభించిన రెస్టాఫ్ ఇండియా (ఆర్‌వోఐ) 410 పరుగులకు ఆలౌట్ అయింది. అభిమన్యు ఈశ్వరన్ (191) తృటిలో ద్విశతకాన్ని చేజార్చుకోగా ధ్రువ్ జురెల్ (93) సెంచరీ చేసే అవకాశాన్ని కోల్పోయాడు.

రాష్ట్రానికి గుర్తింపు తెచ్చేలా స్పోర్ట్స్ పాలసీ



హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణకు గుర్తింపు తెచ్చేలా కొత్త స్పోర్ట్స్ పాలసీని రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కొత్త స్పోర్ట్స్ పాలసీ ముసాయిదాపై శుక్రవారం సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో సీఎం పాల్గొన్నారు. అద్భుతమైన క్రీడాకారులను తీర్చిదిద్దడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు గుర్తింపు తెచ్చేలా కొత్త స్పోర్ట్స్ పాలసీని తయారుచేయాలని ఈ సందర్భంగా సీఎం అధికారులకు సూచించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వివిధ దేశాలు, ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నెలకొల్పనున్న స్పోర్ట్స్ యూనివర్సిటీని యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీగా తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, జితేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీని రద్దు చేయాలని సోనియాకు ఉత్తరాలు

రాహుల్ గాంధీకి కూడా రైతుల లేఖలు

యాచారం, అక్టోబర్ 4 : ఫార్మాసిటీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, సోనియా గాంధీకి ఉత్తరాలు రాస్తున్నారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న ఫార్మాసిటీని వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఫార్మా బాధిత రైతులు కాంగ్రెస్ అధిష్ఠానానికి శుక్రవారం కూడా లేఖలు రాశారు. ఒకే రోజు ఏకంగా 100 పోస్టుకార్డులు రాసి పోస్టు చేశారు. కాలుష్యాన్ని వెదజల్లే ఫార్మాసిటీని రద్దు చేసి పొలాలను తిరిగి రైతులకే ఇవ్వాలని ఆ లేఖలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు కండ్లు తెరిచేవరకు ఉత్తరాల ఉద్యమాన్ని కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు.



ఫార్మాసిటీని రద్దు చేయాలని పోస్టు బాక్స్‌లో ఉత్తరం వేస్తున్న యువకుడు

మన్నెగూడ రోడ్డుపై ఇంత నిర్లక్ష్యమా?

- **అక్కడి రోడ్డు ప్రమాదాలకు సర్కార్‌దే బాధ్యత**
- **లేదంటే ప్రభుత్వంపై కేసులు పెడతాం**
- **బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి హెచ్చరిక**

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 4 : రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నుంచి మన్నెగూడ రోడ్డులో ఇక నుంచి జరిగే ప్రతి రోడ్డు ప్రమాదానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, లేదంటే ప్రభుత్వంపై కేసులు పెడతామని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన చేవెళ్ల మండలం కౌకుంట్లలో మీడియాతో మాట్లాడారు. చేవెళ్ల నుంచి మన్నెగూడ రోడ్డు మరీ అధ్వానంగా తయారయిందని, నిత్యం ప్రమాదాలతో అనేక మంది మరణిస్తున్నారని తెలిపారు. కేసీఆర్ హయాంలోనే రోడ్డుకు అప్పట్లోనే టెండర్ పూర్తయిందని, స్థానిక ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతోనే పనులు ముందుకు సాగడం లేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి నియోజకవర్గానికి వెళ్లే రోడ్డు ఇంత దారుణంగా ఉంటుందా? అని ఆయన ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి తన నియోజకవర్గానికి హెలీక్యాప్టర్‌లో వెళ్తే ప్రజల కష్టాలు ఏం తెలుస్తాయని ప్రశ్నించారు. నవంబర్‌లోగా రోడ్డు పనులు ప్రారంభించని పక్షంలో ఉద్యమ కార్యాచరణ రూపొందించి పోరాటం సాగిస్తామని హెచ్చరించారు.

జర్నలిస్టు వేధింపులు భరించలేక..

పంచాయతీ కార్యదర్శి ఆత్మహత్యాయత్నం

కురవి, అక్టోబర్ 4: జర్నలిస్టు వేధింపులను తట్టుకోలేక మహబూబాబాద్ జిల్లా కురవి మండలం తట్టుపల్లి గ్రామ కార్యదర్శి శుక్రవారం ఆత్మహత్యకు యత్నించింది. కార్యదర్శి వంగూరి నాగలక్ష్మి రెండు పేజీల లేఖను రాసి పంచాయతీ కార్యాలయంలో దోమల మందు తాగింది. లేఖలో ప్రస్తావించిన వివరాల ప్రకారం.. 'గ్రామానికి చెందిన ఓ చానల్ రిపోర్టర్ దొంతు యాదగిరి కొద్దిరోజులుగా తనను టార్గెట్ చేశాడు. ఏ పనిచేసినా తప్పులు వెతికి పైఅధికారులకు ఫిర్యాదు చేస్తున్నాడు. ఓటరు జాబితాను గత నెల 27న ఇవ్వాల్సి ఉండగా, 28న అధికారులకు అందజేశాను. ఆలస్యమైందని అధికారులు షోకాజ్ నోటీసు ఇచ్చారు. ఆ నోటీసు నాకు అందకుండా వాట్సాప్ గ్రూపుల్లో ప్రత్యక్షమైంది. ఇలాంటి చర్యలతో నేను మానసికంగా ఇబ్బందులు పడుతున్నా. ఈ వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నా'నని లేఖ రాసి, దోమల పిచికారీ మందు తాగింది. ఆత్మహత్యకు యత్నించే ముందు ఎంపీవో గౌస్‌కు ఫోన్‌లో సమాచారం అందించింది. వెంటనే ఆయన తట్టుపల్లికి చేరుకొని నాగలక్ష్మిని దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో వీరబాబు దవాఖానకు వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. ఎంపీడీవోను వివరణ కోరగా ఓటరు జాబితా ఆలస్యం కావడంతో షోకాజ్ నోటీసు ఇచ్చిన మాట వాస్తవమేనని, కార్యదర్శిని ఏ అధికారి వేధించలేదని స్పష్టం చేశారు. కార్యదర్శికి న్యాయం చేయాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు రాములు అధికారులను కోరారు.

గిరిజనుల రక్షణ బాధ్యత అధికారులదే

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ) : అడవుల రక్షణతోపాటు అక్కడ నివసించే గిరిజనుల రక్షణ బాధ్యతా అటవీ అధికారులు తీసుకోవాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో అటవీశాఖ అధికారులతో సమావేశమయ్యారు. అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్‌నదీం, ముఖ్య రక్షణాధికారి ఆర్ఎం డోబ్రియల్ ఆధ్వర్యంలో డీఎఫ్‌వోలు, ఇతర ఉన్నతాధికారులతో ఎస్టీ కమిషన్ సభ్యులు సమావేశమయ్యారు. అంతకు ముందు అటవీశాఖ, గిరిజన అధికారులతో హుస్సేన్‌నాయక్ ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. అడవుల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హుస్సేన్‌నాయక్ మాట్లాడుతూ.. తాను కూడా అడవి నుంచి వచ్చిన గిరిజన బిడ్డనేనని, వారి బాధలు తనకు తెలుసని చెప్పారు. గిరిజనులకు పట్టాలు ఇచ్చిన అధికారులు ఆ భూముల్లో బోర్లు వేయకుండా, కరెంట్ కనెక్షన్ ఇవ్వకుండా అడ్డుపడుతున్నట్టు తెలిసిందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ అదనపు కార్యదర్శి ప్రశాంతి, పీసీసీఎఫ్(వైల్డ్ లైఫ్) ఎలిసింగ్ మేరు, పీసీసీఎఫ్(అడ్మిన్) సునీతాభగవత్, సీసీఎఫ్(ఐటీ) ప్రియాంక వర్గీస్ పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ కోటా 3% అమలుచేయాలి

రాష్ట్ర ప్రభుత్వానికి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కోటాను తమిళనాడు తరహాలో అమలు చేయాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన సెక్రటేరియట్ మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడారు. మోదీ సర్కారు పార్లమెంట్‌లో కర్కశంగా ఈడబ్ల్యూఎస్ కోటా 10 శాతం రిజర్వేషన్ కేటాయిస్తూ బిల్లును ఆమోదించిందని, దీనిని తమిళనాడు పూర్తిస్థాయిలో కాకుండా కేవలం 3 శాతం కోటానే ఇస్తున్నదని తెలిపారు. తెలంగాణలోనూ ఇదే పద్ధతిలో అమలు చేయాలని చెప్పారు. జనాభాలో ఐదు శాతం లేనివారికి 10 శాతం రిజర్వేషన్లు ఎందుకని, ఈ కోటాతో బీసీలకు తీరని అన్యాయం జరుగుతుందని తెలిపారు.

న్యూడ్ డిజిటల్ అరెస్టు?

- **దారుణ స్థితికి సైబర్ నేరగాళ్ల వికృత చేష్టలు**
- **దుస్తులు విప్పేసి రికార్డ్ చేయాలని బ్లాక్‌మెయిల్**
- **లొంగకపోతే వీడియోలు పోర్న్ సైట్‌లో పెడతామని బెదిరింపు**
- **కోట్లలో నష్టపోతున్న బాధితులు.. మహిళలే అధికం**

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): డిజిటల్ అరెస్టులో మరో వికృత రూపం బయటపడింది. సైబర్ నేరాలను అదుపు చేయడానికి కేంద్రం పటిష్ట చర్యలు చేపట్టకపోవటంతో సైబర్ దొంగలు రెచ్చిపోతున్నారు. ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకొని డబ్బులు కొల్లగొడుతున్నారు. కొడుకు/కూతురు సెక్స్ రాకెట్‌లో దొరికారని, డ్రగ్స్ కేసుల్లో పట్టుబడ్డారని, వారు చదువుతున్న కాలేజీ, ఇతర వివరాలన్నీ సరిగ్గా చెప్పి బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. ఆధార్, పాన్‌కార్డ్ తమ వద్ద ఉన్నదని నకిలీ జిరాక్స్‌లు చూపుతున్నారు. ఆ తర్వాత ఇంట్లో ఎవరెవరు ఉంటారు? ఎక్కడికి వెళ్లారు? ఎప్పుడు వస్తారు? అనే వివరాలు తెలుసుకొని వీడియో కాల్‌లోనే మహిళలను దుస్తులు విప్పాలని బెదిరిస్తున్న ఘటనలు ఇటీవల వెలుగులోకి వచ్చాయి. అలా చేస్తే కేసు మాఫీ చేస్తామని కొందరు, మభ్యపెట్టి న్యూడ్ కాల్స్ రికార్డు చేసి, ఆ తర్వాత డబ్బులు డిమాండ్ చేసే మరి కొన్ని ఘటనలు పోలీసుల దృష్టికి వచ్చాయి. ఇటీవల తెలంగాణలోనూ ఓ యువతిని ఇదే తరహా న్యూడ్ డిజిటల్ అరెస్టుకు ప్రయత్నించగా ఆమె.. సైబర్ నేరగాళ్ల ఎత్తుగడలను తిప్పికొట్టినట్టు తెలిసింది. వారి మాయమాటల నుంచి తేరుకొని తక్షణం ఆమె 1930కి కాల్ చేయగా.. ఆ నంబర్ నుంచి మాట్లాడిన సైబర్ నేరస్థుడి కోసం సీఎస్‌బీ పోలీసులు దృష్టి సారించినట్టు సమాచారం.

స్కామర్ కాల్‌తో ఆగిన టీచర్ గుండె

ఆగ్రాలో సైబర్ నేరగాళ్ల వేధింపులకు ఓ తల్లి గుండె ఆగిపోయింది. ఆగ్రాలో ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్న మాల్తీ వర్మకు పోలీస్ వేషధారణలో ఉన్న ఓ వ్యక్తి నుంచి వాట్సాప్ కాల్ వచ్చింది. తన కూతురు చదువుతున్న కాలేజ్, ఉంటున్న ఏరియా, ఆధార్ కార్డు నంబర్‌తో సహా అన్నీ వివరించాడు. అప్పటికే భయపడిపోతున్న మాల్తీ వర్మను డిజిటల్ అరెస్టు చేసే క్రమంలో.. తన కూతురు ఓ సెక్స్ రాకెట్‌లో దొరికిందని చెప్పాడు. తక్షణం తాను చెప్పిన ఖాతాకు రూ.లక్ష వేస్తే కేసు కాకుండా మాఫీ చేస్తానని చెప్పాడు. అతన్ని పోలీసు అధికారిగా భావించిన మాల్తీ వర్మ.. అతని మాటలకు మరింత భయపడిపోయింది. తన కూతురి గురించి అలాంటి వార్త వినాల్సి రావడంతో బోరున విలపిస్తూనే తీవ్ర ఆందోళన, ఒత్తిడికిలోనై గుండెపోటుతో చనిపోయింది. తాజాగా హైదరాబాద్‌కు చెందిన ఓ వృద్ధ జంటను ఇలాగే డిజిటల్ అరెస్టు చేసి, రూ.10 కోట్లకు పైగా కొల్లగొట్టారు.

సైబర్ దొంగలకు ఆ వివరాలెక్కడివి?

బాధితుల తల్లిదండ్రులకు సైబర్ నేరగాళ్లు కాల్స్ చేసి, వారి కొడుకు లేదా కూతురు పేరు సరిగ్గా చెప్పటం, వారు ఏం చదువుతున్నారో చెప్పటం, ఏ రాష్ట్రంలో, ఏ కాలేజ్‌లో చదువుతున్నారో క్లియర్‌గా చెప్పటం గమనార్హం. పోలీసు దుస్తుల్లో వీడియో కాల్ చేయడం, బ్యాగ్రౌండ్ సెటప్ మొత్తం పోలీస్‌స్టేషన్‌లా ఉంటుండటంతో బాధితులు నిజమేమోనని నమ్ముతున్నారు. బాధితులను వీడియో కాల్‌లోనే ఉంచి.. కస్టమ్స్, ఎన్‌డీపీఎస్, ఈడీ, ఎన్‌ఐఏ, ఆయా రాష్ట్రాల పోలీసుల లోగోలతో నకిలీ ఎఫ్ఐఆర్‌లు పంపడంతో మరింత కంగారు పడుతున్నారు. వీడియోలోనే దుస్తులు విప్పేయాలని డిమాండ్ చేయటం, వాటిని రికార్డు చేయడం, అడిగినంత డబ్బు ఇవ్వకపోతే ఆన్‌లైన్‌లో పెడతామని బెదిరించడం, పోలీసు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామని హింసిస్తున్న పలు సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి.

సైబర్ సెక్యూరిటీ బ్యూరో సూచనలివే..

- ఆన్‌లైన్‌లో పిల్లల చదువుల వివరాలు పోస్టు చేయొద్దు.
- ఎక్కడ చదువుతున్నారు? ఏ ప్రాంతంలో ఉంటున్నారు? అనే విషయాలు సోషల్ మీడియాలో పంచుకోవద్దు.
- తెలియని నంబర్లను లిఫ్ట్ చేయొద్దు.
- పోలీసుల డీపీలున్నా.. ఫొటోలతో వీడియో కాల్స్ చేసినా నమ్మొద్దు.
- మీ పిల్లలను, బంధువులనో, కుటుంబ సభ్యులనో అరెస్టు చేస్తారనే భయంతో మోసగాళ్లకు డబ్బులు వేయకండి. ఇతర డిమాండ్‌లకు లొంగవద్దు.
- మోసగాళ్ల కాల్స్‌ను రికార్డ్ చేయడం మర్చిపోకండి. స్క్రీన్ షాట్ తీయాలి.
- ఈ తరహా కాల్స్ వస్తే.. భయపడకుండా, ఆందోళన చెందకుండా సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించండి లేదా 1930కి కాల్ చేయండి. www.cybercrime.gov.inకు లాగిన్ చేసి వెంటనే ఫిర్యాదు చేయాలి.

ఎస్‌ఆర్డీపీ ప్రాజెక్టుకు హెచ్‌సిటీ కలర్

- **స్వల్ప మార్పులతో కేబీఆర్ చుట్టూ ట్రాఫిక్ ఫ్రీ**
- **రూ.826కోట్లతో ఆరు కూడళ్లలో అండర్‌పాస్‌లు**

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): ఎస్‌ఆర్డీపీ ప్రతిపాదనలకు స్వల్ప మార్పులు చేసి హెచ్‌సిటీ ప్రాజెక్టుల పేరుతో ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణాలకు ప్రభుత్వం సిద్ధమైంది. హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా కేసీఆర్ ప్రభుత్వం వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి ప్రాజెక్టు (ఎస్‌ఆర్డీపీ) కింద 5112.36 కోట్ల అంచనా వ్యయంతో 47 ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. ఇందులో 38 చోట్ల ప్రాజెక్టులను అందుబాటులోకి తెచ్చి ట్రాఫిక్ కష్టాలను శాశ్వతంగా దూరం చేసింది. పురోగతిలో ఉన్న 9 ప్రాజెక్టులు విడతల వారీగా అందుబాటులోకి రానున్నాయి. ఎస్‌ఆర్డీపీలో భాగంగా కేబీఆర్ పార్కు చుట్టూ ఉన్న ఆరు కూడళ్లలో ట్రాఫిక్‌కు శాశ్వత విముక్తి కల్పించాలని పనులు ప్రారంభించే లోపు కొందరు పర్యావరణవేత్తలు హరిత ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ఇంతలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎస్‌ఆర్డీపీని హెచ్‌సిటీగా పేరు మార్చింది. పార్కు చుట్టూ ఉన్న ఆరు కూడళ్లలో ట్రాఫిక్‌కు శాశ్వత పరిష్కారం చూపాలని నాటి ప్రణాళికలో స్వల్ప మార్పులు చేసి అండర్‌పాస్‌లను తెరపైకి తెచ్చింది. ఆరు జంక్షన్లను 826 కోట్లతో అభివృద్ధి చేసేందుకు సిద్ధమైంది. దీనికి సంబంధించి పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

సీజ్ చేసిన గంజాయి దహనం

హైదరాబాద్, అక్టోబర్ 4(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో భారీగా గంజాయి పట్టుబడుతున్నది. ఇటీవల ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, రంగారెడ్డి జిల్లాల్లో ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న గంజాయిని శుక్రవారం దహనం చేశారు. ఒక్క భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ, అశ్వారావుపేట, మణుగూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 22 కేసుల్లో రూ.4కోట్ల విలువచేసే వెయ్యి కిలోలకు పైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈడీ వీబీ కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి ఖమ్మం డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి నేతృత్వంలో అసిస్టెంట్ కమిషనర్ గణేశ్ గంజాయిని ద హనం చేయించారు. 1.87 కోట్ల మద్యాన్ని సైతం ధ్వంసం చేసినట్టు తెలిపారు.

ఎంబీఏలో ఎంసీఏలో సీట్లు ఖాళీ

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ) : ఈ ఏడాది ఎంబీఏలో 2,933, ఎంసీఏలో 1,088 సీట్లు ఖాళీగా ఉన్నాయి. మొత్తంగా 4,021 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఐసెట్‌లో స్పెషల్ ఫేజ్ సీట్లను శుక్రవారం కేటాయించారు. ఈ కౌన్సెలింగ్ ముగిసిన తర్వాత ఎంబీఏలో 28,623 సీట్లకు 25,690(89.8శాతం), ఎంసీఏలో 6,966 సీట్లకు 5,878(84.4శాతం) సీట్లు భర్తీ అయ్యినట్టు అధికారులు ప్రకటించారు. 7లోగా కాలేజీల్లో రిపోర్ట్ చేయాలని సూచించారు.

నేటితో ముగియనున్న డీఎస్సీ వెరిఫికేషన్

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ-2024 సర్టిఫికెట్ వెరిఫికేషన్ శనివారంతో ముగియనున్నది. 1:3 జాబితాలోని వారి సర్టిఫికెట్ వెరిఫికేషన్ శనివారంతో పూర్తికానుంది. అనంతరం 1:1 చొప్పున సెలెక్షన్ లిస్టును ప్రకటిస్తారు. జాబితాలో ఉన్న వారికి 9న ఎల్బీస్టేడియంలో నియామకపత్రాలు అందజేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది.

ఇంటర్‌లోనూ మిగులు అధ్యాపకుల సర్దుబాటు

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోని మిగులు అధ్యాపకులను ఇంటర్ విద్య కమిషనరేట్ సర్దుబాటు చేసింది. 20 మంది జూనియర్ లెక్చరర్లను మరో కాలేజీలో సర్దుబాటు చేశారు. పలు కాలేజీల్లో మిగులు అధ్యాపకులను అధ్యాపకులు లేని కాలేజీలకు కేటాయిస్తూ ఉత్తర్వులిచ్చారు.

జెన్‌కో ద్వారానే పవర్ ప్లాంట్ నిర్మించాలి

హైదరాబాద్, అక్టోబర్ 4(నమస్తే తెలంగాణ): రామగుండంలో 800 మెగావాట్ల పవర్ ప్లాంట్‌ను టీజీజెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ డిమాండ్ చేసింది. జేఏసీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా జెన్‌కో ఆఫీసుల ఎదుట శుక్రవారం ఆందోళన చేశారు. మింట్‌కాంపౌండ్ ఎస్పీడీసీఎల్ ఆఫీసు వద్ద ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ రత్నాకర్‌రావు, కో కన్వీనర్ బీసీ రెడ్డి, జనప్రియ, వేణు, గంగాధర్ పాల్గొన్నారు.

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

శనివారం SATURDAY 5.10.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 10+12+4 Pages: 10+12+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 121 ‖ వెల (Price) రూ.6.50 | తదియ

శనివారం, సూర్యోదయం: 6-07, సూర్యాస్తమయం: 6-01. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం శరత్ రుతువు ఆశ్వయుజ మాసం శుక్లపక్షం తిథి: తదియ పూర్తి. నక్షత్రం: స్వాతి రాత్రి 9-33 వరకు. వర్జ్యం: తెల్లవారుజామున 3-46 నుంచి తెల్లవారుజామున 5-33 వరకు. రాహుకాలం: ఉదయం 9-06 నుంచి ఉదయం 10-35 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 6-07 నుంచి ఉదయం 7-42 వరకు. అమృతకాలం: పగలు 11-40 నుంచి పగలు 1-28 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline



పసిడి మార్కెట్‌కు దసరా

చారిత్రక గరిష్ఠ స్థాయికి ధరలు

తులం 78,450గా నమోదు

› 7



రుణమాఫీ, రైతు భరోసా మోసంపై జగిత్యాల కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులు

ఢిల్లీలో తేల్చుకుంటం



తొర్రూరు రైతు ధర్నాలో మాట్లాడుతున్న హరీశ్‌రావు. చిత్రంలో బీఆర్‌ఎస్ నేతలు ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్, సిరికొండ, పోచంపల్లి, పల్లా, రావుల, కవిత తదితరులు

- దసరాలోగా అందరికీ మాఫీ చేయాల్సిందే
- వరంగల్ రైతు డిక్లరేషన్ అమలు ఏమైంది?
- మంత్రులు, ఎమ్మెల్యేలను నిలదీయాలి
- రేవంత్.. మొనగాడు కాదు మోసగాడు! 70% మంది రైతులకు రుణమాఫీ కాలేదు
- వరద బాధితులకు ఇచ్చిన హామీ ఏమైంది?
- బతుకమ్మ చీరలు బాగాలేవని అన్నవ్.. రూ.500 ఇస్తానన్నవ్.. ఏమాయె?
- తొర్రూరు రైతు మహాధర్నాలో హరీశ్‌రావు

రాహుల్ ఇంటిని ముట్టడిస్తాం

'రేవంత్‌రెడ్డికి రైతులు, ప్రజలంటే పట్టింపు లేదు. రుణమాఫీ మీద తొలి సంతకం అన్నడు. దేవుళ్ల మీద ఒట్టు పెట్టి మాట్లాడిండు. అంతా మోసమే. రైతుబంధు, రుణమాఫీ, పింఛన్లు, మహాలక్ష్మి అన్నీ చేస్తానన్నడు. ఇప్పుడు సప్పుడు లేదు. దసరాలోపు రైతులందరికీ 2 లక్షల వరకు షరతుల్లేకుండా రుణమాఫీ చేయకుంటే, ఢిల్లీలో రాహుల్‌గాంధీ ఇంటి ముందు ధర్నా చేస్తం. వరంగల్ రైతు డిక్లరేషన్ సంగతేందని నిలదీస్తం. › 2

- తొర్రూరు ధర్నాలో హరీశ్‌రావు

నమ్మించి.. వంచించారు.!

వరంగల్‌లో ఫార్మా విద్యార్థిపై గ్యాంగ్‌రేప్.. ముగ్గురి అరెస్ట్

ప్రేమను తిరస్కరించిందని పగబట్టి దారుణం

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో పెండ్లి పేరుతో యువతిపై అఘాయిత్యం

జనగామలో ఇద్దరు బాలికలపై లైంగికదాడి › 2



సింహంలా పోరాడతా

నా కుటుంబాన్ని రక్షించుకోవడం నా కర్తవ్యం

మద్దతిచ్చిన సినీ పరిశ్రమకు ధన్యవాదాలు

వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు.. ఇది వ్యక్తిగతం కాదు

మంత్రి హద్దులు దాటి అనుచితంగా మాట్లాడారు

సమంతకు క్షమాపణ చెప్తారు.. మా సంగతేంది?

సురేఖ క్షమాపణ చెప్పినా వదిలే ప్రసక్తే లేదు

ఇప్పటికే ఆమెపై కోర్టులో క్రిమినల్ కేసు పెట్టిన

రూ.100 కోట్లకు పరువు నష్టం దావా వేస్తా..

మీడియా ఇంటర్వ్యూలో అక్కినేని నాగార్జున

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ) : 'మంత్రి కొండా సురేఖ హద్దుదాటి మాట్లాడారు. ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు.. ఆమె వ్యాఖ్యలతో మా పరువు, ప్రతిష్ట దెబ్బతిన్నది. మేం చిత్రపరిశ్రమకు చెందినంత మాత్రాన మాపై ఎలాంటి వ్యాఖ్యలు చేసినా మెతకగా ఉంటామని అనుకోవద్దు. మాకు సురేఖ క్షమాపణ చెప్పినా కేసును ఉపసంహరించుకునే ప్రసక్తే లేదు.. అసలు అలాంటి అవకాశమే లేదు. మంత్రి సురేఖపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం ద్వారా ఇతర రాజకీయ నాయకులు మమ్మల్ని దూషించకుండా ఒక గట్టి హెచ్చరి కవుతుందని నేను ఆశిస్తున్నా' అని ప్రముఖ సినీనటుడు అక్కినేని నాగార్జున తేల్చిచెప్పారు. 'నేను › 4వ పేజీలో

రగులుతున్న అక్కినేని కుటుంబం

కొండా సురేఖ వ్యాఖ్యలపై తీవ్ర మనోవేదన › 4

రేవంత్ తీరుపై పెద్దలు సీరియస్

తెలంగాణలో ఏం జరుగుతున్నదని ఫైర్



తీవ్ర ఆగ్రహంతో రేవంత్‌కు హైకమాండ్ ఫోన్‌కాల్

రేపు ఢిల్లీలో సమావేశం.. కేకేతో సీఎం మంతనాలు

ఉత్తమ్‌కూ పెద్దల ఫోన్.. తాజా పరిణామాలపై చర్చ

తండ్రి కర్మకాండ ముగిశాక ఢిల్లీకి రావాలని సూచన

అమలకు ప్రియాంక ఫోన్.. అండగా ఉంటామని హామీ

నాగార్జునతో రాజీకి రాష్ట్ర కాంగ్రెస్ నేతల యత్నాలు

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో రేవంత్‌రెడ్డి సర్కారు వ్యవహారశైలిపై కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్ అయినట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. ముఖ్యంగా దక్షిణాదిలో సినీ ప్రముఖులుగా పేరొందిన అక్కినేని ఫ్యామిలీపై మంత్రి సురేఖ చేసిన వ్యాఖ్యల విషయంలో కాంగ్రెస్ పెద్దలు అగ్గిమీద గుగ్గిలమైనట్టు తెలుస్తున్నది. వారు నేరుగా ముఖ్యమంత్రికి ఫోన్ చేసి అక్షింతలు వేసినట్టు కాంగ్రెస్ వర్గాలు చెవులు కొరుక్కుంటున్నాయి. ఈ నెల 6న ఢిల్లీలో కేంద్ర హోంశాఖ నిర్వహించనున్న సమావేశానికి హాజరు › 4వ పేజీలో

ముఖ్యమంత్రితో కేవీపీ ఢీ అంటే ఢీ



నర్మగర్భ చురకలతో రేవంత్‌కు లేఖ

నా నిబద్ధత గురించి ఒక కాంగ్రెస్ సీఎంకు నేనే చెప్పుకోవాల్సి రావడం బాధాకరం › 4

మూసీ ప్రాజెక్టు వైఎస్ ఆలోచనే.. పేదలకు నష్టం కలుగకూడదనే విరమించుకున్నం

రాష్ట్రాన్ని అప్పులపాలు చేయొద్దనే చేపట్టలేదు

నా ఇల్లు బఫర్‌జోన్‌లో ఉంటే నేనే కూల్చేస్తా

మార్కింగ్ పారదర్శకంగా జరగాలి: కేవీపీ





తొర్రూరులో నిర్వహించిన మహాధర్నాలో పాల్గొన్న రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు, మాట్లాడుతున్న హరీశ్‌రావు, ఎడ్ల బండిపై ర్యాలీగా వస్తున్న హరీశ్‌రావు, చిత్రంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు

రాహుల్ ఇంటిని ముట్టడిస్తాం

దసరాలోగా అందరికీ రుణమాఫీ చేయాల్సిందే • వరంగల్ రైతు డిక్లరేషన్ అమలు ఏమైంది?: హరీశ్

- ఎమ్మెల్యేలు, మంత్రులను రైతులు నిలదీయాలి
- రేవంత్.. మొనగాడు కాదు మోసగాడు..
- 70% రైతులకు రుణమాఫీ కాలేదు..
- వరద బాధితులకు ఇచ్చిన హామీ ఏమైంది?
- బతుకమ్మ చీరలు బాగాలేవు అన్నావు.. రూ..500 ఇస్తా అన్నావు.. ఏమైంది?
- తొర్రూరు మహాధర్నాలో హరీశ్‌రావు

మహబూబాబాద్, అక్టోబర్4(నమస్తే తెలంగాణ): దసరాలోపు రైతులందరికీ రూ.2 లక్షల వరకు షరతులు లేకుండా రుణమాఫీ చేయకుంటే, ఢిల్లీలో రాహుల్‌గాంధీ ఇంటి ముందు ధర్నా చేస్తామని, వరంగల్ రైతు డిక్లరేషన్‌పై నిలదీస్తామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 30% మంది రైతులకే రుణమాఫీ అయిందని, మిగిలిన 70% మందికి మాఫీ చేసే దాకా వదిలిపెట్టబోమని స్పష్టంచేశారు. పండుగ తరువాత కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలో షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలంటూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హరీశ్‌రావు మాట్లాడుతూ.. రుణమాఫీకి 31 సాకులు పెట్టి లక్షలాది రైతులకు ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పాలకుర్తి మండలంలోనే 4,314 మందికి రుణమాఫీ కాలేదని చెప్పారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్తున్నట్టుగా 22 లక్షల మందికి కూడా మాఫీ కాలేదని దుయ్యబట్టారు. 'రుణమాఫీ కాలేదు అంటే, పెండ్లి కాలేదు అంటున్నరట, కొందరికి ఆధార్‌కార్డు లేక ఆపుతున్నరు. ఇదేమి రాజ్యం?' అని హరీశ్‌రావు మండిపడ్డారు. రేవంత్ మోసగాడని రైతులు, ప్రజలు అంటున్నారని చెప్పారు. కర్ణాటకలో ఐదు, తెలంగాణలో ఆరు, ఇప్పుడు హర్యానాలో 7 గ్యారెంటీలు అంటున్నారని ఎద్దేవా చేశారు. రాహుల్‌గాంధీ ప్రకటించిన వరంగల్ రైతు డిక్లరేషన్ అమలుకావడం లేదని దుయ్యబట్టారు. 'రైతులతోపాటు కౌలురైతులకు ఏడాదికి ఎకరాకు రూ.15 వేలు ఇస్తా అన్నడు. కాలేదు.. భూమి లేని ఉపాధి హామీ రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు అన్నడు.. కాలేదు.. రైతు కూలీలు, భూమి లేని రైతులకు పంట బీమా పథకం అన్నడు. కాలేదు.. పోడు, అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు ఇస్తా అన్నడు. కాలేదు.. అన్ని రకాల పంటలకు రూ.500 బోనస్ అని చెప్పి, ఇప్పుడు సన్నాలకు మాత్రమే అని సన్నాయి నొక్కులు నొక్కుతున్నడు' అని హరీశ్‌రావు విమర్శించారు. రేవంత్‌రెడ్డి దయ వల్ల రాహుల్‌గాంధీ మీద తెలంగాణ ప్రజలకు, రైతులకు నమ్మకం లేకుండా పోతున్నదని ఎద్దేవా చేశారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌ను ఎందుకు అమలు చేయలేదని నిలదీశారు.

దసరాలోగా రైతుబంధు ఇవ్వాలి

వానకాలం సీజన్ ముగుస్తున్నా రైతుబంధు ఇవ్వలేదని, ఇంకెప్పుడు ఇస్తరని హరీశ్‌రావు

> రైతుల కన్నీళ్లు చూస్తే రాతి గుండెలు కూడా కరుగుతాయి. కానీ, రేవంత్‌రెడ్డి గుండె మాత్రం కరగడం లేదు. రేవంత్‌ది రాతి గుండె కాబట్టే రైతుబంధు ఇవ్వడం లేదు. రుణమాఫీ చేయడం లేదు. రైతుల ఆత్మహత్యలు కనిపించడం లేదా?
>
> -హరీశ్‌రావు

ప్రశ్నించారు. దసరా లోపు రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు ఆపి, రైతులకు రైతుబంధు కేసీఆర్ ఇచ్చారని చెప్పారు. కేసీఆర్‌ది రైతు గుండె కాబట్టి ఇచ్చారని, రేవంత్‌ది రాతిగుండె కాబట్టే ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఎన్నికల ముందు అన్ని పంటలకు బోనస్ అని చెప్పి ఇప్పుడు సన్నాలకు మాత్రమే ఇస్తామంటున్నారని మండిపడ్డారు. అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ కాలేదన్న మనోవ్యథతో మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలో తరావత్ రవి అనే రైతు, సిద్దిపేట జిల్లాలో సురేందర్‌రెడ్డి ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతులెవరూ అధైర్య పడొద్దని, ఆత్మహత్యలు చేసుకోవద్దని ధైర్యం చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, రేవంత్‌రెడ్డి మెడలు వంచి రుణమాఫీ అమలు చేయిస్తామని చెప్పారు. వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు వచ్చే ఎమ్మెల్యేలు, మంత్రులను నిలదీయాలని రైతులకు పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో రౌడీయిజం

రాష్ట్రంలో రౌడీయిజం నడుస్తున్నదని హరీశ్‌రావు విమర్శించారు. హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో అరాచకం చేస్తున్నారని మండిపడ్డారు. మూసీని ఆనుకొని ఉన్న పేదల ఇండ్లు కూలగొడితే ఊరుకోబోమని హెచ్చరించారు. ఎక్కువ కాలం గుండాగిరి నిలబడదని హితవు చెప్పారు. 'అది కొడతా, ఇది కొడతా అంటున్నవ్. అన్యాయంగా ఉన్న ప్రతి ఒక్కరిదీ కూలగొట్టు.. దగ్గర ఉండి సహకారం అందిస్తాం. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా మాది ప్రజలపక్షం' అని హరీశ్‌రావు స్పష్టంచేశారు. కేసీఆర్ ఇచ్చిన బతుకమ్మ చీరలు బాగాలేవని విమర్శించిన రేవంత్‌రెడ్డి బతుకమ్మ చీరలు లేదా వాటి బదులు ఇస్తానన్న రూ.500 మహిళలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరదల వల్ల పంట నష్టపోయిన రైతులకు ఇస్తామన్న రూ.పదివేల ఏమయ్యాయని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో తన మీద 300 కేసులు పెట్టారని, ఇప్పటికే 30 పెట్టారని చెప్పారు. ఎన్ని కేసులు పెట్టినా హామీల అమలుపై ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో ఎందుకు చేరారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఉప ఎన్నికలు వస్తాయని స్టేషన్‌ఘన్‌పూర్‌లో రాజయ్యను గెలిపించుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



బ్రోకర్ మాటలు చెప్పి కుర్చీల కూర్చున్నవ్

సీఎం సీటు రాగనే పెద్దోడిని అవుతున్నా అనుకుంటున్నవు.. ప్రజలను మోసం చేస్తున్న నిన్ను ఆరు నెలల్లో గద్దె దింపుడు ఖాయం. సోనియగాంధీ పుట్టిన రోజున రుణమాఫీ చేస్తామని బ్రోకర్ మాటలు చెప్పి కుర్చీల కూర్చున్నవ్. రైతులను మోసం చేసిన నువ్వు జాగ్రత్తగ ఉండాలె.. తమాషా అనుకుంటున్నవా? రైతుబంధు పోయింది. రుణమాఫీ పోయింది. రైతుబంధు 15 వేలు అన్నవు. మోసం చేసినవు. మూడు కేజీలు ఉన్న రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేసిండు. ఇది రాక్షస పాలన. ఎవరైనా ఏమైనా అంటే జైల్లో పెడుతుండ్రు. ఇటువంటి పాలన నా 70 ఏండ్లలో చూడలేదు. కేసీఆర్ కిట్టు మాయమైంది. తులం బంగారం ఇవ్వకపోతివి. కేసీఆర్ పాలనలో రైతులందరూ సంతోషంగా ఉన్నారు. కేసీఆర్ సార్‌ను ఓడించి మేము చేసుకున్న తప్పిదం. మల్ల కేసీఆర్ రావాలి. కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో పడేయాలి.

- గుగులోత్ జింతు, రైతు, రాంధన్ తండా

పెండ్లి కాలేదంటే.. భార్య ఆధార్ కావాలంటున్నరు!

- రుణమాఫీకి చిత్రవిచిత్ర నిబంధనలు
- రైతుల ఇబ్బందులను చెప్పిన హరీశ్

మహబూబాబాద్, అక్టోబర్4(నమస్తే తెలంగాణ): రుణమాఫీ కాని రైతులకు అధికారుల నుంచి చిత్రవిచిత్రమైన అనుభవాలు ఎదురవుతున్నాయి. అధికారులు అడుగుతున్న డాక్యుమెంట్ల వివరాలు చూస్తుంటే నవ్వాలో, ఏడవాలో అర్థం కాని పరిస్థితి! అసలు నాకు పెండ్లే కాలేదో మహాప్రభో అంటే.. అయితే, భార్య పేరిట ఆధార్‌కార్డు తీసుకురండి అని చెప్తున్నారు. ఎప్పుడో ఆధార్ అనేది పుట్టకముందే చనిపోయినవారి విషయంలోనూ ఆధార్ నంబర్ తెచ్చి ఇవ్వాలని కోరడం మరో తమాషా. ఇలాంటి ఉదంతాలను మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో శుక్రవారం నిర్వహించిన రైతుల మహాధర్నాలో మాజీ మంత్రి హరీశ్‌రావు వివరించారు. 'సిద్దిపేట జిల్లా ఇబ్రహీంపూర్‌కు చెందిన ఎల్లారెడ్డికి రుణమాఫీ కాలేదు. ఆయన అధికారుల వద్దకు వెళ్లి అడగితే భార్య ఆధార్ కార్డు తెమ్మన్నారట.. ఆయన అసలు పెండ్లే చేసుకోలేదు. ఇప్పుడు భార్య పేరిట ఆధార్‌కార్డు ఎక్కడినుంచి తేవాలి. రుణమాఫీ కోసం ఈ వయసులో పెండ్లి చేసుకోవాల్నా? అని ఆ రైతు అంటుంటే ఎంతో బాధపడ్డాను' అని వివరించారు. 'మరో రైతు భార్య 2010లో చనిపోతే ఆధార్‌కార్డు తేవాలని అన్నారట. ఇలా మొత్తం 31 కొర్రీలతో రుణమాఫీ ఎగ్గొట్టారని దుయ్యబట్టారు.



జగిత్యాల కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న రైతులు

నమ్మించి.. వంచించారు.!

- వేర్వేరు చోట్ల యువతులపై లైంగికదాడులు
- పెండ్లి పేరుతో ఒకరిని.. స్నేహం ముసుగులో మరొకరిపై అఘాయిత్యం
- మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్ జిల్లాల్లో ఘటనలు
- జనగామలో ఇద్దరు బాలికలపై లైంగికదాడి

> రాష్ట్రంలో యువతులు, బాలికలపై వరుసగా జరుగుతున్న లైంగికదాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రేమిస్తున్నానని, పెండ్లి చేసుకుంటానని, స్నేహితులమని చెబుతూ నమ్మించి వంచిస్తున్నారు కామాంధులు. ఆశ్రయం కోసం ఎదురు చూస్తున్న అభంశుభం తెలియని బాలికలను లొంగదీసుకొని అఘాయిత్యానికి పాల్పడ్డారు.

మన్సూరాబాద్, అక్టోబర్ 4 : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అల్వాల్‌కు చెందిన ఎం సాయికుమార్ నాగోల్‌లోని ఓ హోటల్‌లో బౌన్సర్‌గా పనిచేస్తున్నాడు. అక్కడే సీనియర్ కెప్టెన్‌గా పనిచేసే ఓ యువతితో సాయికుమార్‌కు పరిచయం ఏర్పడింది. ప్రేమిస్తున్నానంటూ, పెండ్లి చేసుకుంటానని ప్రాధేయపడటంతో అతని మాటలు నమ్మింది. ఈ క్రమంలో ఎల్బీనగర్‌లోని ఓ హోటల్‌కు తీసుకెళ్లి ఆమెపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. పెండ్లి చేసుకోవాలని ఆమె బలవంతం చేయడంతో తల్లిదండ్రులతో మాట్లాడి ఏప్రిల్‌లో ఎంగేజ్‌మెంట్ చేసుకున్నాడు. నెలలు గడుస్తుండడంతో పెండ్లి చేసుకోవాలని ఒత్తిడి తీసుకురాగా యువతిపై దాడి చేసి భయపెట్టాడు. దీంతో మోసపోయినట్టు గ్రహించిన యువతి సాయికుమార్‌పై చర్యలు తీసుకోవాలని ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆశ్రయం కల్పిస్తామని ఇద్దరు బాలికలపై..

జనగామ చౌరస్తా, అక్టోబర్ 4: జనగామ జిల్లా దేవరుప్పల మండలానికి చెందిన ఓ బాలిక(14) తోపాటు మల్కాజిగిరి చెందిన మరో బాలిక (15) ఐఎస్ సదన్ డివిజన్‌లో ఉన్న పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్నారు. సెప్టెంబర్ 24న అక్కడి నుంచి బాలికలిద్దరూ పారిపోయి జనగామకు వచ్చారు. రాత్రి కావడంతో బస్టాండ్ సమీపంలో ఉన్న పాన్‌షాప్ నిర్వాహకుడి దగ్గర ఫోన్ తీసుకొని పరిచయం ఉన్న మరో యువకుడికి ఫోన్ చేశారు. బస్టాండ్‌కు చేరుకున్న ఆ యువకుడు జిల్లాకు చెందిన బాలికను వెంట తీసుకెళ్లి లైంగిక దాడి చేయగా, బస్టాండ్ దగ్గర ఉన్న మరో బాలికకు ఆశ్రయం కల్పిస్తానని నమ్మబలికిన పాన్‌షాప్ నిర్వాహకుడితోపాటు అతడి ముగ్గురు స్నేహితులు లైంగిక దాడికి పాల్పడినట్టు సమాచారం. మరుసటి రోజు రాత్రి బస్టాండ్ దగ్గర ఒంటరిగా తిరుగుతున్న బాలికల్ని గుర్తించిన జనగామ అర్బన్ పోలీసులు వారిని చేరదీసి విషయం తెలుసుకున్నారు. ఐదుగురు యువకులు కలిసి బాలికలపై లైంగిక దాడికి పాల్పడ్డారన్న విషయం తెలుసుకొని నిందితులపై పోక్సో కేసు నమోదు చేశారు.

లవ్ రిజెక్ట్ చేసిందని.. స్నేహం ముసుగులో..

భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన తాటి శివరాజ్‌కుమార్ అలియాస్ జెట్టి వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నెపల్లిలోని బిట్స్ కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. శివరాజ్‌కుమార్‌కు భూపాలపల్లిలో తన స్నేహితుడు పుట్టపాక శరత్ ద్వారా మూడేండ్ల క్రితం ఖిలా వరంగల్ మండలం బొల్లికుంటలోని ఓ కళాశాలలో చదువుతున్న యువతి పరిచయమైంది. కొన్ని రోజుల తర్వాత ప్రేమిస్తున్నానని చెప్పగా ఆమె నిరాకరించి ఫ్రెండ్స్‌గా ఉందామని చెప్పింది. శివరాజ్‌కుమార్, తన స్నేహితులు వివేక్, మణిదీప్‌లతో కలిసి కారులో ఆమె చదువుకుంటున్న కళాశాలకు చేరుకున్నారు. మాయమాటలు చెప్పి ఆమెను బయటికి రప్పించి.. బలవంతంగా కారులో తీసుకెళ్లారు. వరంగల్ బస్టాండ్ సమీపంలో ఉన్న క్రిస్టల్ ఓయో లాడ్జికి తీసుకెళ్లి ముగ్గురు కలిసి లైంగిక దాడి చేశారు. కళాశాలలో తెలిస్తే పరీక్షలు రాయనీయరని భయపడి ఎవరికీ చెప్పలేదు. పరీక్షల అనంతరం తల్లికి చెప్పడంతో ఇంతెజార్‌గంజ్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. గురువారం సాయంత్రం ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

జగిత్యాలలో కర్షకుల కదనభేరి

- రుణమాఫీ సహా హామీల అమలు కోసం కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున నిరసన
- ఐదుగంటలు ఆందోళన.. సొమ్మసిల్లిన రైతు
- కలెక్టర్ హామీతో ఆందోళన విరమణ

జగిత్యాల టౌన్, అక్టోబర్ 4: జగిత్యాల జిల్లా రైతులు కదం తొక్కారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ చెప్పినట్టుగా షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ, ఎకరానికి రూ.15 వేల రైతు భరోసా, అన్ని రకాల వడ్లకు మద్దతు ధరపై క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో భారీ నిరసన చేపట్టారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 2వేలకు మందికిపైగా తరలిరాగా, పాత మార్కెట్ బీటు నుంచి పాదయాత్రగా జగిత్యాల కలెక్టరేట్‌కు చేరుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు ఐక్య వేదిక రాష్ట్ర నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతుందన్న నమ్మకంతో రైతులు కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలిచి గద్దెనెక్కించారని, కానీ గెలిచిన తర్వాత మోసం చేశారని విమర్శించారు. వాగ్దానాలు అమలు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించి రైతుల్లో గందరగోళం సృష్టించారని మండిపడ్డారు. 40 శాతం మందికి మాత్రమే రుణమాఫీ చేసి మిగతా 60 శాతం మందిని గాలికొదిలేశారని ఆరోపించారు. రుణమాఫీ అమలులో లేనిపోని ఆంక్షలు విధిస్తూ రైతులను రోడ్డుపాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు రుణమాఫీలో రేషన్‌కార్డు అంటూ ఆంక్షలు విధించడం దారుణమని, బ్యాంకులు ఇచ్చిన రుణాల ఆధారంగా చేసుకొని రుణమాఫీ హామీని వంద శాతం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. జిల్లా రైతు ఐక్యవేదిక అధ్యక్షుడు నల్ల రమేశ్‌రెడ్డి, నాయకులు వేముల కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేదంటే రాష్ట్రం నలుమూలల నుంచి రైతులు తరలివెళ్లి ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. రైతులు దాదాపు 5 గంటలపాటు నిరసన వ్యక్తం చేసినా, కలెక్టర్ రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్ గేటు వద్దకు చేరుకొని బారికేడ్లను తోస్తూ నినాదాలు చేయడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. అదే సమయంలో కథలాపూర్ మండలం భూషణరావుపేట గ్రామానికి చెందిన రైతు బద్దం మహేందర్‌రెడ్డి సొమ్మసిల్లిపోగా, పోలీసులు దవాఖానకు తరలించారు. నిరసన విషయం తెలుసుకున్న కలెక్టర్ అక్కడికి రాగా, రైతులు తమ డిమాండ్లను విన్నవించారు. డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.




నిరసనలో సొమ్మసిల్లిపోయిన రైతు బద్దం మహేందర్‌రెడ్డి

బాలికలు, మహిళలకు భద్రత లేదు

- బాధ్యతారాహిత్యంగా రేవంత్ సర్కార్
- 9 నెలల్లోనే 2వేలకు పైగా లైంగికదాడులు
- ఇద్దరు బాలికలపై అఘాయిత్యం కలిచివేసింది : మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో బాలికలు, మహిళలకు భద్రత కరువైందని, భద్రత కల్పించాల్సిన ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఇటీవల ఇద్దరు బాలికలపై జరిగిన లైంగికదాడి తనను తీవ్రంగా కలిచివేసిందని పేర్కొన్నారు. మహిళలకు భద్రత లేదని అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని హెచ్చరించినా నిర్లక్ష్యం వీడలేదని, అందుకే నిత్యం రాష్ట్రంలో ఎక్కడో ఒకచోట లైంగికదాడి ఘటనలు జరుగుతూనేఉన్నాయని శుక్రవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. తొమ్మిది నెలల కాంగ్రెస్ పాలనలో 2000కు పైగా లైంగికదాడి ఘటనలు జరిగాయంటే పరిస్థితి ఏ విధంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. హోంశాఖను కూడా తానే నిర్వహిస్తున్నప్పటికీ రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షణలో సీఎం రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చిందని, షీ టీమ్స్, సఖీ, భరోసా కేంద్రాలు ఏర్పాటుచేసి రక్షణ కల్పించిందని గుర్తుచేశారు. ఇందిరమ్మ రాజ్యమని ఊదరగొట్టడమే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యంలో మహిళా భద్రత లేదని తేటతెల్లమైందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి శాంతిభద్రతల పర్యవేక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. బాలికలపై లైంగికదాడిన పాల్పడిన దుర్మార్గులకు కఠిన శిక్షలు పడేలా చేయాలని డిమాండ్ చేశారు.

లోకం పోకడ



వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	39.7°c	21.7°c
మెదక్	36.2°c	21.9°c
ఖమ్మం	36.0°c	26.0°c
నల్లగొండ	36.0°c	25.0°c
రంగారెడ్డి	35.8°c	21.0°c
కరీంనగర్	35.0°c	26.0°c
నిజామాబాద్	34.1°c	24.3°c
వరంగల్	34.0°c	25.0°c
హైదరాబాద్	32.8°c	23.3°c
మహబూబ్‌నగర్	31.0°c	23.5°c

మరో మూడు రోజులు వానలు

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మరో మూడు రోజులు వానలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. గడిచిన 24 గంటల్లో హైదరాబాద్ సహా వివిధ ప్రాంతాల్లో వర్షం కురిసిందని అధికారులు తెలిపారు. ఖమ్మం జిల్లా కొండమల్లేపల్లిలో అత్యధికంగా 6.84 సెం.మీ. వర్షపాతం నమోదైంది. నల్లగొండ జిల్లా చందంపేటలో 5.91 సెం.మీ, నిడమనూరులో 4.45 సెం.మీ, గుండ్లపల్లిలో 4.98 సెం.మీ, పెద్దఅడిశర్లపల్లిలో 3.87 సెం.మీ, నాగర్‌కర్నూల్ జిల్లా పద్రలో 4.19 సెం.మీ, ఉప్పునూతలలో 4.16 సెం.మీ, వంగూర్‌లో 3.88 సెం.మీ, రంగారెడ్డి జిల్లా మాడ్గులలో 4.05 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో ఈ నెల నుంచి డిసెంబర్ వరకు రాష్ట్రంలో సాధారణం కంటే అధిక వర్షాలు నమోదయ్యే అవకాశాలున్నాయని కేంద్రం అంచనా వేసింది.

సీఎంఆర్ఎఫ్‌కు విరాళాలు

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి శుక్రవారం పలువురు విరాళాలు అందించారు. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అసోసియేషన్ ప్రతినిధులు వీ సురేందర్, ఎస్ఎన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి రూ.1,01,75,000 చెక్కును అందజేశారు. అలాగే రూ.51 లక్షల చెక్కును విన్స్ బయో ప్రొడక్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ ఎస్ఎన్ డాగ, సీఈవో సిద్ధార్థ డాగ, రూ.10 లక్షల చెక్కును ది సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఎండీ కేవీ సుబ్బయ్య, డైరెక్టర్ సోమలింగంగౌడ్, రూ.25 లక్షల చెక్కును బొండాడ గ్రూప్ సీఎండీ బొండాడ రాఘవేంద్రరావు, 25 లక్షల చెక్కును భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ ఎండీ కే రామ్మోహన్‌రావు సీఎంకు అందజేశారు.

టీఎం హెచ్‌జీవో అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాసులు

హైదరాబాద్, అక్టోబర్4 (నమస్తే తెలంగాణ): తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కే శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన ఎన్నికల అధికారి శ్యామ్, ఉప ఎన్నికల అధికారి డాక్టర్ రామారావు నేతృత్వంలో మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్‌కు శుక్రవారం ఎన్నికలు నిర్వహించారు. అసోసియేషన్ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా కే శ్రీనివాసులు, అసోసియేట్ అధ్యక్షుడిగా రామాంజనేయులు, జనరల్ సెక్రటరీగా సునీల్‌రాజ్, కోశాధికారిగా నామాల శ్రీనివాస్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.



ప్రజాభవన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కిడ్నీ రోగులు

ప్రజాభవన్ ఎదుట కిడ్నీ రోగుల నిరసన

హైదరాబాద్, అక్టోబర్ 4(నమస్తే తెలంగాణ): కిడ్నీ రోగులను కాంగ్రెస్ సర్కారు చిన్నచూపు చూస్తున్నదని బాధితులు ఆగ్రహం వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లోని జ్యోతిరావు పూలే ప్రజాభవన్ ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ సర్కారు జిల్లా దవాఖానలు, సీహెచ్‌సీల్లో డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందించిందని గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు దాటినా మెరుగైన చికిత్స అందించడంలో నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడ్డారు. గత జనవరి ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా, మంత్రులు, అధికారులను కలిసి విన్నవించినా పట్టించుకోలేదని వాపోయారు. కిడ్నీ రోగులకు ప్రతినెలా రూ.10వేల పింఛన్ ఇవ్వాలని, డయాలసిస్ సేవలను విస్తరించాలని డిమాండ్ చేశారు.

సింహంలా పోరాడతా

మొదటిపేజీ తరువాయి...

బలమైన వ్యక్తిని అని అనుకుంటున్నా.. నా కుటుంబాన్ని రక్షించే విషయంలో నేను సింహాన్ని' అని స్పష్టంచేశారు. 'అదృష్టవశాత్తు తెలుగు చలనచిత్ర పరిశ్రమ అంతా మాకు అండగా నిలిచింది, ఇందుకు చిత్రపరిశ్రమకు ధన్యవాదాలు.. ఇది మా నాన్నగారి ఆశీర్వాదాలుగా భావిస్తున్నా' అని పేర్కొన్నారు. తన కుమారుడు నాగచైతన్య, ఆయన మాజీ భార్య సమంత విడాకులపై మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యల నేపథ్యంలో నాగార్జున క్రిమినల్ కేసు నమోదుచేసిన విషయం తెలిసిందే. తాజా పరిణామాల నేపథ్యంలో శుక్రవారం నాగార్జున ప్రముఖ ఇంగ్లిష్ మీడియా సంస్థ టైమ్స్ నౌకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా కొండా సురేఖ తీరుపై ఆయన ఫైర్ అయ్యారు.



ప్రశ్న : మంత్రి సురేఖపై కేసుపెట్టారు కదా.. ఆమె నుంచి మీరేం ఆశిస్తున్నారు?

నాగార్జున : మంత్రి సురేఖపై గురువారం క్రిమినల్ కేసు పెట్టడంతో పాటు పరువునష్టం దావా వేశాం. ఆమెపై మరో వంద కోట్ల పరువునష్టం దావా వేయబోతున్నాం. కొండా సురేఖ హద్దుదాటి మాట్లాడారు. ఆమె మాటలు అస్సలు ఆమోదయోగ్యంకాదు. ఇప్పుడు కొండా సురేఖ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నట్టు చెప్పారు. సమంతకు క్షమాపణలు చెప్పారు. కానీ నా పరిస్థితి.. నా కుటుంబం పరిస్థితేంటి? నా కుటుంబానికి క్షమాపణలు చెబుతున్నట్టు ఆమె ఒక్క మాటైనా అనలేదే?

ప్రశ్న : ఒకవేళ మంత్రి మీకు, మీ కుటుంబానికి క్షమాపణలు చెబితే పరువు నష్టం దావాను ఉపసంహరించుకుంటారా?

నాగార్జున : కుదరదు. నా కుటుంబానికి క్షమాపణ చెప్పినా కేసును ఉపసంహరించుకునే ప్రసక్తేలేదు. ఆ అవకాశమే లేదు. ఇది వ్యక్తిగత విషయం కాదు. నన్ను, నా కుటుంబాన్ని దాటిపోయింది. తెలుగు చిత్ర పరిశ్రమలోని చిన్నా పెద్దా అంతా మాకు మద్దతుగా నిలిచారు. మన వ్యవస్థకు సోకిన తెగులును అరికట్టే ప్రక్రియలో మేమున్నామని నేను భావిస్తున్నా. మీ రాజకీయ ప్రయోజనాల కోసం మా పేర్లను వాడుకోవడం సరికాదు. మేం చిత్ర పరిశ్రమకు చెందినంత మాత్రాన మాపై ఎలాంటి వ్యాఖ్యలు చేసినా మెతకగా ఉండబోము. ఈ విషయంలో మంత్రి సురేఖపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం ద్వారా ఇతర రాజకీయ నాయకులు మమ్మల్ని దూషించేందుకు ఒక గట్టి హెచ్చరిక అవుతుందని నేను ఆశిస్తున్నా.

ప్రశ్న : మన దేశంలో చట్టపరమైన అంశాలు తెలుసుగా? ప్రత్యేకించి పరువు నష్టం దావా కేసులు ఏండ్ల తరబడి సాగుతాయి?

నాగార్జున : అవును. నాకు తెలుసు. పూర్తి అవగాహన ఉన్నది. ఈ కేసులో పోరాటానికి నేను సిద్ధంగా ఉన్నా. అందుకే మేము క్రిమినల్ డిఫమేషన్ కేసు పెట్టాం. మేము వేగంగా తీర్పు ఆశిస్తున్నాం. ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గబోం. చట్టపరంగా చివరి వరకు పోరాడుతాం.

ప్రశ్న : ఈ సంవత్సరం మీకు సానుకూలంగా లేనట్టున్నది.

నాగార్జున : అవును. సమస్యలు ఒకదాని తర్వాత మరొకటి ఎదురవుతూనే ఉన్నాయి. ఇదే చివరి సమస్య అని ప్రతిసారీ భావిస్తున్నా. కానీ, దేవుడు మరో విధంగా కష్టాల మీద కష్టాలు తెస్తున్నాడు. అయినా, నో ప్రాబ్లం. నేను ఎప్పుడూ బలమైన వ్యక్తిగా నిలబడ్డాను. నా కుటుంబాన్ని రక్షించడంలో నేను సింహంలా ఉంటా. అదృష్టవశాత్తు తెలుగు పరిశ్రమ మొత్తం మాతో నిలబడటానికి ముందుకొచ్చింది. ఇది నా నాన్నగారి మంచితనం, ప్రేమ, ఆశీస్సులు కావచ్చు.

ప్రశ్న : మీ మంచితనం, పరువు ప్రతిష్ఠ పరిస్థితి ఏమిటి?

నాగార్జున : ఆమె వ్యాఖ్యలతో మా పరువు, ప్రతిష్ఠ దెబ్బతిన్నది. ఈ ఇంటర్వ్యూ ద్వారా మీడియా మాకు మద్దతుగా, అండగా నిలబడినందుకు ధన్యవాదాలు.

రేవంత్‌తో కేవీపీ ఢీ అంటే ఢీ

నర్మగర్భ వ్యాఖ్యలతో సీఎంకు బహిరంగ లేఖ

- సీనియర్‌ను గౌరవించడం లేదంటూ వ్యాఖ్యలు
- మూసీ ప్రాజెక్టు రేవంత్ బ్రెయిన్‌చైల్డ్ కాదు.. వైఎస్ హయాంలోనే ప్రారంభమైందని స్పష్టీకరణ
- అప్పుల పాలు చేయొద్దనే నాడు పక్కన పెట్టారని వెల్లడి
- అందుకు భిన్నంగా రేవంత్‌రెడ్డి వెళ్తున్నారని చురకలు
- కూల్చివేతల్లో పారదర్శకత లోపించిందంటూ ఎత్తిపొడుపులు

హైదరాబాద్, అక్టోబర్4 (నమస్తేతెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సై అంటే సై అన్నట్టుగానే వ్యవహరిస్తున్నారు కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు! శుక్రవారం ఆయన నర్మగర్భ వ్యాఖ్యలు, సుతిమెత్తని హెచ్చరికలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖాస్త్రం సంధించారు. కాంగ్రెస్ రాజకీయాల్లో తాను సీనియర్‌ను అని చాటుతూ, రేవంత్ తనకంటే జూనియర్ అని ఎత్తిపొడిచారు. కాంగ్రెస్ పట్ల తన నిబద్ధతను శంకిస్తున్నారంటూ అసహనం వ్యక్తంచేశారు. ఆ మాటకొస్తే.. మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు రేవంత్‌రెడ్డి బ్రెయిన్‌చైల్డ్ కాదని, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే ఆ ఆలోచన రూపుదిద్దుకున్నదని చెప్పుకొచ్చారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రాధామ్యాలను గుర్తెరగకుండా అప్పులు చేస్తున్నదని దెప్పిపొడిచారు. కంటోన్మెంట్‌లో గురువారం నిర్వహించిన డిజిటల్ ఫ్యామిలీ కార్డుల పైలట్ ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ కూల్చివేతలు, హైడ్రాపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఉస్మాన్‌సాగర్‌లో అక్రమంగా ఫాంహౌజ్‌లను నిర్మించుకున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు పేరును కూడా రేవంత్‌రెడ్డి ఉటంకించారు. ఈ నేపథ్యంలో ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. రేవంత్‌రెడ్డి వ్యవహారశైలిని, పాలనాపరమైన విధానాలను పరోక్షంగా ఎత్తిచూపిన ఆ లేఖ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.



నా నిబద్ధత గురించి చెప్పుకోవడం బాధాకరం

'ప్రస్తుత కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కర్ణాటక గుల్బర్గా ప్రాంతంలో పార్టీ ప్రముఖ నాయకుడిగా ఉన్న సమయంలో దాదాపు 1970లోనే కాంగ్రెస్ పార్టీతో నా ప్రస్థానం ప్రారంభించాను' అని కేవీపీ తన లేఖలో పేర్కొన్నారు. తద్వారా పార్టీలో రేవంత్‌రెడ్డి తనకంటే చిన్నవాడని, చాలా తక్కువని అని చూపించే ప్రయత్నం చేశారు.

'కాంగ్రెస్‌లో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తను. ప్రభుత్వం తీసుకునే ప్రతి కార్యక్రమాన్ని, పథకాన్ని త్రికరణశుద్ధిగా సమర్థిస్తాను. చిత్తశుద్ధితో అమలుచేయడానికి శాయశక్తులా కృషి చేస్తాను అని ఈరోజు ఒక కాంగ్రెస్ ముఖ్యమంత్రికి చెప్పవలసి రావడం బాధాకరమే అయినా తప్పడం లేదు' అని పేర్కొనడం ద్వారా తన నిబద్ధతను రేవంత్‌రెడ్డి గుర్తించడం లేదనే విషయాన్ని కేవీపీ ఎత్తిచూపారని కాంగ్రెస్ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు కాంగ్రెస్‌కు అత్యంత ఇష్టమైన ప్రాజెక్ట్ అని, 2004లో డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దీనిపై ప్రత్యేక దృష్టి నిలిపారని పేర్కొనడం ద్వారా అది రేవంత్‌రెడ్డి బ్రెయిన్‌చైల్డ్ ప్రాజెక్టు కాదని, తన మిత్రుడు వైఎస్సే దానికి బీజం వేశారని పరోక్షంగా చెప్పుకొచ్చారు.

2005లోనే సేవ్ మూసీ పథకాన్ని రూ.908 కోట్ల అంచనాతో వైఎస్ ప్రారంభించారని, అయితే నాడు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యమిచ్చి, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేయొద్దనే ఉద్దేశంతో మూసీ ప్రక్షాళన చేపట్టలేదని లేఖలో పేర్కొనడం ద్వారా.. నేడు రేవంత్ సర్కార్ సంక్షేమాన్ని విస్మరించి, మూసీని తలకెత్తుకొని, రాష్ట్రంపై అప్పుల భారం మోపుతున్నదనే రీతిలో మాట్లాడారు.

మూసీ ప్రక్షాళన వల్ల నష్టపోయే ప్రతి పేద, మధ్య తరగతివారికి సంతృప్తికరమైన పునరావాసం కల్పించి, మూసీకి పూర్వస్థితి కల్పించాలంటే, అధిక మొత్తంలో నిధులు అవసరమని గ్రహించి, ఆ పథకాన్ని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించలేకపోయిందని కేవీపీ పేర్కొన్నారు. తద్వారా రేవంత్‌రెడ్డికి వాటిపై ఏమాత్రం అవగాహన, సరైన ప్రణాళిక లేదనే అర్థం వచ్చే రీతిలో పదాలను దట్టించడం గమనార్హం.

రేవంత్‌రెడ్డికి బహిరంగ సవాల్..!

లేఖలో ప్రస్తావించిన, లేవనెత్తిన అంశాలను పరిశీలిస్తే, సీఎం రేవంత్‌రెడ్డికి కేవీపీ నేరుగానే సవాల్ విసిరినట్టు అర్థమవుతున్నది.

తన ఫాంహౌజ్‌పై ఆరోపణలు వచ్చినరోజే సొంత ఖర్చులతో కూల్చడానికి సిద్ధంగా ఉన్నానని తెలియజేశానని గుర్తుచేస్తూ, ఇప్పటికైనా వెంటనే అధికారులను తన ఫాంహౌజ్‌కు పంపించాలని కోరారు. మార్కింగ్ ప్రక్రియ పారదర్శకంగా కొనసాగాలని, మార్కింగ్ చేసే సమయం, తేదీ తనకు ముందే తెలియజేయాలని సూచించారు. తద్వారా ప్రస్తుత ప్రక్రియ పారదర్శకంగా లేదని చెప్పకనే చెప్పారు.

'పల్లంరాజు' వ్యవహారంలా కాకుండా తనకు ముందే తేదీ చెప్పాలని పరోక్షంగా హెచ్చరించారు. 'మీరు, నేను కలుగజేసుకోకుండా, చట్టాన్ని తన పని తాను చేసుకొని పోనిద్దాం' అని కేవీపీ పేర్కొనడం ద్వారా రేవంత్ తనను టార్గెట్ చేస్తున్నారనే సందేశం పంపారు. ముఖ్యమంత్రిగా జోక్యం చేసుకోకుండా ఉంటే చట్టం తన పని తాను చేసుకొని పోతుందని సలహా ఇచ్చారు.

ఈ లేఖలో 'నేను కాంగ్రెస్ కార్యకర్తను.. నా నరనరాన కాంగ్రెస్ రక్తం ఉన్నది.. అనేక ఏండ్ల నుంచి కాంగ్రెస్‌లో ఉన్నాను.. కాంగ్రెస్‌కు నష్టం జరిగే పని చేయను.. అంతరాత్మ.. నా తుది ఊపిరి వరకూ..' అని పదే పదే వ్యక్తీకరించడం ద్వారా తాను రేవంత్ కన్నా ఎక్కువ విధేయుడైన కాంగ్రెస్ వాదినని కేవీపీ ఘంటాబజాయించారు.

మూసీపై కాంగ్రెస్‌లోనే భిన్నాభిప్రాయాలు

మూసీ ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీలోనే భిన్నాభిప్రాయాలు ఉన్నాయని, వాటిని సీఎం రేవంత్‌రెడ్డి పరిగణనలోనికి తీసుకోవడం లేదన్న విషయాన్ని కేవీపీ ఈ లేఖ ద్వారా బహిర్గతం చేశారు. 'పార్టీ శ్రేయోభిలాషులు మూసీ ప్రక్షాళనను మొదటి దశలోనూ, సుందరీకరణను రెండో దశలోనూ చేపడితే బాగుంటుందని మీకు సూచించవవలసినదిగా నన్ను కోరినా.. మూసీ సుందరీకరణపై మీ ఆసక్తిని గమనించి, మీ ఆలోచన, విజన్, సమర్థతపై నమ్మకంతో.. ఆ విషయం మీ దృష్టికి తేలేదు. పేదలకు నష్టం కలుగకుండా ప్రభుత్వం చేపట్టే అన్ని అభివృద్ధి పనులకు ఒక క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ కార్యకర్తగా స్వాగతిస్తాను' అని పేర్కొన్నారు. రేవంత్ వ్యవహార శైలి వల్ల పేదలకు నష్టం కలుగుతున్నదని పరోక్షంగా ఎత్తిచూపారు. 'అజీజ్‌నగర్‌లోని నా కుటుంబసభ్యుల పేరు మీదున్న ఫాంహౌజ్‌పై ప్రతిపక్ష నేతలు ఆరోపణలు చేస్తున్నారు. అది క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ నేతగా తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్నది' అని కేవీపీ పేర్కొన్నారు. నిజానికి కేవీపీ పేరును ప్రతిపక్షాలు ఎప్పుడు మరిచిపోయాయి. ఈ అంశాన్ని లేవనెత్తింది రేవంత్‌రెడ్డే! ప్రతిపక్షాలు అంటూ రేవంత్ తీరును, ఆయన క్రమశిక్షణను కేవీపీ ప్రశ్నించారు.

కొండా సురేఖపై చర్యలు తప్పవు!

కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి శ్యామ్‌ప్రసాద్ మేకా

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): సినీనటులపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన తెలంగాణ మంత్రి కొండా సురేఖపై చర్యలు తీసుకోవాల్సిందేనని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి శ్యామ్‌ప్రసాద్ మేకా స్పష్టంచేశారు. ఆమె చేసిన వ్యాఖ్యలకు కేవలం క్షమాపణ సరిపోదని పేర్కొన్నారు. శుక్రవారం ఓ మీడియా చానల్ డిబేట్‌లో పాల్గొన్న ఆయన మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి ఆమెపై క్రమశిక్షణా చర్యలు చేపట్టాల్సిందేనని చెప్పారు. సురేఖ అంశాన్ని పార్టీ క్రమశిక్షణా కమిటీకి అప్పగించాలని, వారు ఆమెపై చర్యలు చేపట్టాలని కోరారు.

రేవంత్ తీరుపై పెద్దలు సీరియస్

మొదటిపేజీ తరువాయి...

కానున్న సీఎం రేవంత్‌రెడ్డి ఆ తరువాత నేరుగా వచ్చి తమను కలిసి వివరణ ఇవ్వాలని హుకుం జారీ చేసినట్టు గాంధీభవన్ వర్గాలు చెప్పుకుంటున్నాయి. మరోవైపు కాంగ్రెస్ విధేయుడు, సీనియర్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సైతం అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చినట్టు తెలుస్తున్నది.

సురేఖపై ఏం చర్యలు తీసుకున్నారు?

అక్కినేని ఫ్యామిలీపై మంత్రి కొండా సురేఖ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ యావత్ సినీతారాలు కాంగ్రెస్‌పై ఒక్కసారిగా భగ్గుమన్నారు. దీంతో కాంగ్రెస్ హైకమాండ్ ఉలిక్కిపడినట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలోనే రేవంత్‌రెడ్డికి నేరుగా ఫోన్ చేసి సీరియస్ వార్నింగ్ ఇచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. కొండా సురేఖ వ్యాఖ్యలపై ఎందుకు స్పందించడం లేదు? అని ప్రశ్నించినట్టు తెలిసింది. ఈ నెల 6న ఢిల్లీకి వచ్చిన సమయంలో సురేఖ అంశంపై స్పష్టమైన అభిప్రాయం చెప్పాలని తెగేసి చెప్పినట్టు కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి.

కేకేతో రేవంత్ రహస్యమంతనాలు

అధిష్ఠానం వార్నింగ్ ఇచ్చిన నేపథ్యంలోనే ఎన్నడూ లేనివిధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా కాంగ్రెస్ సీనియర్ నేత కే కేశవరావును పిలుపించుకుని దాదాపు గంటకుపైగా రహస్యంగా భేటీ అయినట్టు తెలిసింది. స్పోర్ట్స్ పాలసీ రివ్యూ మీటింగ్‌కు సైతం ఆయనను సీఎం వెంటబెట్టుకుని వెళ్లారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన పరిణామాలపై అధిష్టానం ఏం చర్చించుకుంటున్నది? అనే అంశాలపై ఆరా తీసినట్టు తెలుస్తున్నది. కొండా సురేఖ విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటే అధిష్ఠానం శాంతిస్తుంది అని కూడా కేకే నుంచి సలహా తీసుకున్నట్టు తెలిసింది. ఈ విషయంలో తనకు మద్దతు ఇవ్వాలని కోరినట్టు కాంగ్రెస్ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి.

విషయం పెద్దది కాకుండా చూడండి

అక్కినేని కుటుంబంపై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలతో రంగంలోకి దిగిన అధిష్ఠానం పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌కు ఫోన్ చేసి వివాదం పెద్దది కాకుండా చూడాలని, మంత్రితో క్షమాపణ చెప్పించాలని ఆదేశించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో మహేశ్‌కుమార్‌గౌడ్ మంత్రి సురేఖతో అధిష్ఠానం ఆగ్రహంగా ఉన్నదని మీడియా ముఖంగా క్షమాపణ కోరాలని చెప్పగా, తాను ఇప్పుడు వెనక్కి తగ్గితే ప్రజల్లో పలుచన అవుతానని, ఈ విషయంలో ఎలాంటి సమస్యను ఎదుర్కోవడానికైనా సిద్ధంగా ఉన్నానని సురేఖ చెప్పినట్టు తెలిసింది. కానీ, అనూహ్యంగా గురువారం ఉదయం మంత్రి కొండా సురేఖ మీడియాతో మాట్లాడుతూ సమంత విషయంలో తాను మాట్లాడింది తప్పేనని ఒప్పుకొన్నారు. ఒక మహిళగా తనకు అవమానం జరిగిందని చెప్పే క్రమంలో భావోద్వేగంతో చేసిన వ్యాఖ్యలు ఆమెను బాధపెట్టాయని గుర్తించానని, తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొంటున్నానని ప్రకటించారు. కేవలం సమంత విషయంలో తప్పు మాట్లాడినట్టు చెప్పడంతో నాగార్జునకు పుండు మీది కారం చల్లినట్టయింది. శుక్రవారం టైమ్స్‌నౌ ఇంటర్వ్యూలో కూడా ఆయన ఇదే విషయాన్ని ప్రస్తావించారు. ఇప్పుడు సురేఖ క్షమాపణ చెప్తే మీరు అంగీకరిస్తారా? అని జర్నలిస్టు ప్రశ్నించగా.. ఆ సమయం దాటిపోయిందని తేల్చిచెప్పారు. ఏదైనా కోర్టులో తేల్చుకుంటానని స్పష్టం చేశారు. ఈ వివాదం చిలికిచిలికి గాలివానగా మారుతుండటంపై అధిష్ఠానం తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే నాగార్జునతో రాజీకి కాంగ్రెస్ నేతలు మంతనాలు చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఒకవేళ రాజీ కుదిరితే కేసు వాపసు తీసుకోవాలా వద్దా అన్న మీమాంశ కొనసాగుతుంది. సెక్షన్ 356 బీఎన్ఎస్ ప్రకారం మూడేండ్లలోపు శిక్ష పడే అవకాశం ఉన్న కేసులో రాజీ చేసుకునే వీలుంటుందని నిపుణులు అంటున్నారు.

నేడు కోర్టులో నాగార్జున వాంగ్మూలం!

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మంత్రి కొండా సురేఖపై పరువు నష్టం దావా వేసిన సినీ నటుడు అక్కినేని నాగార్జున వాంగ్మూలం నమోదుకు కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. నాగార్జున వాంగ్మూలాన్ని శనివారం నమోదు చేసే అవకాశాలున్నట్టు సమాచారం. కోర్టు ప్రొసీడింగ్ ఆఫీసర్ (మెజిస్ట్రేట్) శుక్రవారం సెలవుపై ఉండటంతో శనివారం వాంగ్మూలం నమోదుకు కోర్టు సిద్ధమవుతున్నట్టు తెలుస్తున్నది. ఆ తర్వాత సాక్షులుగా ఉన్న యార్లగడ్డ సుప్రియ, వేంకటేశ్వర్లు కూడా తమ వాంగ్మూలాల్ని నమోదు చేయనున్నట్టు సమాచారం. ఈ కేసులో సాక్ష్యాధారాలుగా పెన్‌డ్రైవ్, సీడీలు, పత్రికల్లో వచ్చిన క్లిప్పింగ్‌లు, సోషల్ మీడియాలో వచ్చిన కథనాలకు చెందిన వీడియోలు కోర్టుకు సమర్పించారు. వీటన్నింటినీ పరిశీలించిన అనంతరం కేసు నమోదుకు కోర్టు ఉత్తర్వులు జారీ చేయనుంది. ఆ తర్వాత మంత్రి కొండా సురేఖకు లంగర్‌హౌజ్ పోలీసులు సమన్లు జారీ చేసిన పిదప కోర్టు విచారణ చేపట్టనుంది.

అమలకు ప్రియాంకగాంధీ భరోసా

కొండా సురేఖ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేసిన అక్కినేని అమల నేరుగా ఈ విషయాన్ని కాంగ్రెస్ లోక్‌సభాపక్ష నేత రాహుల్‌గాంధీ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలను అంగీకరిస్తున్నారా? అంటూ ట్విట్టర్ వేదికగా నిలదీశారు. అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన మంత్రి సురేఖపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ ప్రియాంకగాంధీ నేరుగా అక్కినేని అమలకు ఫోన్ చేసినట్టు తెలుస్తున్నది. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై చింతిస్తున్నామని, దిద్దుబాటు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో కొండా సురేఖపై వేటు తప్పదనే ప్రచారం జోరుగా కొనసాగుతున్నది.

ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి పిలుపు..

మరోవైపు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సైతం అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చినట్టు తెలిసింది. కొండా సురేఖ అంశంపై ఆయనను ఆరా తీసినట్టు విశ్వసనీయ సమాచారం. ఉత్తమ్ తండ్రి ఇటీవలనే మృతి చెందిన నేపథ్యంలో ఆయన కర్మకాండల క్రియలు ముగిసిన అనంతరం నేరుగా ఢిల్లీకి రావాలని ఆదేశించినట్టు తెలిసింది. ఇంత హడావుడిగా మంత్రి ఉత్తమ్‌ను ఢిల్లీకి పిలిపించడంపై సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

రగులుతున్న అక్కినేని కుటుంబం

కొండా సురేఖ వ్యాఖ్యలపై తీవ్ర మనోవేదన

హైదరాబాద్, అక్టోబర్ 4(నమస్తే తెలంగాణ): తమ కుటుంబాన్ని ఉద్దేశించి మంత్రి కొండా సురేఖ చేసిన అవమానకర వ్యాఖ్యల పట్ల అక్కినేని కుటుంబం తీవ్ర మనోవేదనకు గురవుతున్నది. మంత్రి తన రాజకీయాల కోసం తమను తీవ్రంగా అవమానించడాన్ని అక్కినేని కుటుంబసభ్యులు తట్టుకోలేకపోతున్నారు. రెండు రోజులుగా వారు ఆరు ట్వీట్లు చేయగా, ప్రతి ట్వీట్‌లో వారి ఆవేదన, ఆగ్రహాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అక్కినేని అమల, అఖిల్ ఘాటు వ్యాఖ్యలతో ట్వీట్లు చేశారు. జుగుప్సాకరంగా చేసిన వ్యాఖ్యల పట్ల సురేఖను క్షమించే సమస్యే లేదని అక్కినేని కుటుంబం స్పష్టం చేసింది. సురేఖ అవమానకర వ్యాఖ్యలపై తొలి రోజే 'ఎక్స్' వేదికగా అమల ఘాటుగా స్పందించారు. 'మీరు మానవ మర్యాదలను విశ్వసిస్తే దయచేసి మీ నాయకులను అదుపులో ఉంచండి. మీ మంత్రితో నా కుటుంబానికి క్షమాపణ చెప్పించి, విషపూరిత ప్రకటనలను ఉపసంహరించుకోమని చెప్పండి' అంటూ రాహుల్ గాంధీని డిమాండ్ చేశారు. కొండా సురేఖ వ్యాఖ్యల పట్ల అక్కినేని అఖిల్ తీవ్ర ఘాటు వ్యాఖ్యలతో ట్వీట్లు చేశారు. నైతికతను మరిచి కొండా సురేఖ వ్యవహరించిన తీరు సిగ్గుచేటని, క్షమించరానిదని మండిపడ్డారు. కొండా సురేఖ లాంటి వ్యక్తిని క్షమించడానికి సమాజంలో చోటు లేదని అన్నారు. ఆమె వ్యాఖ్యలను సహించేది లేదని స్పష్టం చేశారు.

న్యాయం కోసం ఎంత వరకైనా..

సురేఖ మొదట చేసిన వ్యాఖ్యల్లో, ఆ తర్వాత ఇచ్చిన వివరణలోనూ తమ కుటుంబాన్ని తీవ్రంగా అవమానించారని అక్కినేని కుటుంబం ఆవేదన చెందుతున్నది. జాతీయ స్థాయిలో తమను అవమానించిన కొండా సురేఖను క్షమించరాదని భావిస్తున్నది. న్యాయపరంగా తగిన గుణపాఠం చెప్పాలని నిర్ణయించింది. ఇప్పటికే అక్కినేని నాగార్జున నాంపల్లి కోర్టులో పరువునష్టం దావా వేశారు. సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోర్టును కోరారు. సురేఖపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాల్సిందిగా ప్రధాని, రాష్ట్రపతిని సైతం కలిసి విజ్ఞప్తి చేయాలని నాగార్జున భావిస్తున్నట్టు తెలుస్తున్నది.

6 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
శనివారం 5 అక్టోబర్ 2024
www.ntnews.com

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

హైడ్రా విప్పిచెప్పిన 'ఫాంహౌస్' కథ!



ఎస్జీవీ శ్రీనివాస రావు

అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోండి. కేసీఆర్ మీద ప్రతిపక్షాలు ఏమని ప్రచారాలు చేశాయి? ఏ సాకుతో బురద జల్లాయి? బాగా వినిపించిన మాట. ఫాంహౌస్. అవును.. ప్రతిపక్షాలు, పచ్చ లాబీ మేపే మేధావులు, పాత్రికేయులు, లెఫ్ట్, రైటు సిద్ధాంతకర్తలు, కుల గురువులు అందరికందరూ ఫాంహౌస్.. ఫాంహౌస్ అంటూ ప్రచారంతో ఊదరగొట్టారు. వ్యవసాయ క్షేత్రానికి వెళ్లడమే తప్పు అన్నట్టుగా బీఆర్ఎస్ అధినేతపై ఈ మూకలన్నీ మైకులు బద్దలయ్యేదాకా దుష్ప్రచారం చేశాయి. ప్రజల మనసులో విషం నింపాయి. అయితే, కాలం ఒక్కలా ఉండదు. అది ఎదురుతన్నిన రోజు ఒకటి వస్తుంది... వచ్చింది! గ్యారెంటీలను అమలుచేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించడానికి హైడ్రా పేరుతో డ్రామా మొదలుపెట్టింది. అయితే, ఈ డైవర్షన్ డ్రామా అటు కాంగ్రెస్ పార్టీకి ఎదురుతన్నడంతో పాటు ఇటు బీఆర్ఎస్‌కు ఒక గొప్ప మేలు చేసింది. ఈ కూల్చివేతలు, నోటీసుల పర్వం వల్ల హైదరాబాద్ చుట్టుపక్కల ఎందరెందరు కాంగ్రెస్, బీజేపీ నాయకులకు ఎన్నెన్ని ఫాంహౌస్‌లున్నాయో తొలిసారి బయటపడింది. కోట్ల విలువ చేసే ఫాంహౌస్‌లు ఎంత విలాసవంతంగా కొలువుదీరాయో ఫొటోలు, వీడియోలతో సహా బయటపడ్డాయి. ఒక్కో నాయకుడు ప్రభుత్వ భూములు, చెరువులు ఎంత అడ్డంగా ఆక్రమించి మరీ వాటిని కట్టుకున్నారో కూడా ఆధారాలు, మ్యాప్‌లతో సహా వెల్లడైంది.

ఈ డ్రామా వ్యవహారానికి ముందు రాష్ట్రంలో ఒక్క కేసీఆర్‌కే ఫాంహౌస్ ఉందేమో అనే రీతిలో పచ్చ మీడియాగాళ్లు, వెట్టి సోషల్‌మీడియా గాళ్లు పెద్ద ఎత్తున ప్రచారం చేశా రు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేండ్లు 'కేసీఆర్ ఫాంహౌస్‌కు వెళ్లాడు', 'కేసీఆర్ ఫాంహౌస్‌లో ఉన్నారు' అంటూ అదేదో తప్పయినట్టు పచ్చ మీడియా, సోషల్ మీడియాలో పెయిడ్ రాతగాళ్లు ప్రచారాలు చేశారు. బీజేపీ అయితే కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితమయ్యారని, పాలన పడకేసిందని చిత్తం వచ్చిన రీతిలో ప్రచారం చేసి అది నిజమేనని ప్రజలను కూడా నమ్మించింది. ఆ ప్రచారాన్ని ప్రజలూ నమ్మారు. కేసీఆర్‌కు మాత్రమే ఫాంహౌస్ ఉన్నదని విద్యావంతులూ భ్రమపడ్డారు. కానీ, ఇవాళ ఎందరు నాయకులకు ఎన్నెన్ని ఫాంహౌస్‌లున్నాయో బయటపడుతుంటే నోళ్లు వెళ్లబెడుతున్నారు. వాస్తవమేమంటే రాష్ట్రంలో అత్యధిక ఫాంహౌస్‌లు ఉన్నది కాంగ్రెస్ పార్టీ నాయకులకే. బీజేపీ అధికారంలోకి రాలేదు కాబట్టి దానికి ఆ చాన్స్ దొరకలేదు. అసలు ఫాంహౌస్ అనే కల్చర్‌ను తెచ్చింది కూడా కాంగ్రెస్ నాయకులే. వైఎస్ ఇడుపులపాయ రాష్ట్రంలోనే అతిపెద్ద ఫాంహౌస్. అయినా పచ్చమీడియా ఏనాడూ దాన్ని ఆ పేరుతో పిలవలేదు. కానీ, కేసీఆర్ దగ్గరికి వచ్చేసరికి ప్లేటు ఫిరాయించి ఫాంహౌస్ అంటూ ప్రచారాలు చేసింది. కేసీఆర్ మీద జరిగిన దుష్ప్రచారంలో ఫాంహౌస్ అనేదాన్ని ఒక ఆయుధంగా వాడుకున్నారు. ఆ సాదా సీదా ఇంటిని భూస్వాముల గడీలతో పోల్చి, కేసీఆర్ అక్కడ ఏదో విలాసవంతమైన జీవితం గడుపుతున్నారా? అనేంతగా ప్రచారాలు చేసిన వాళ్లూ ఉన్నారు. ఈ ప్రచారం గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఇబ్బందిగా మారింది కూడా.

బండారం బయటపడింది!

కానీ, తాజాగా హైడ్రా రంగప్రవేశంతో కాంగ్రెస్, బీజేపీ నాయకుల్లో ఢిల్లీ లీడర్ల నుంచి గల్లీ లెవల్ లీడర్ల దాక ఎవరెవరికి ఫామ్‌హౌస్‌లున్నాయో హైడ్రా నోటీసులతో తేటతెల్లమైంది. ఈ అంశం మీద ప్రజల్లో ఆసక్తికరమైన చర్చ జరుగుతున్నది. 'ఇంతకాలం కేసీఆర్ ఒక్కడికే ఫాంహౌస్ ఉందనుకున్నాం. కానీ, ఇంతమందికి, ఇన్ని ఫాంహౌస్‌లున్నాయా?' అని ప్రజలు ఆశ్చర్యచకితులవుతున్నారు. సోషల్ మీడియాలో ఈ ఫాంహౌస్‌ల విషయం హాట్‌టాపిక్ అయింది. గండిపేటలో ఫాంహౌస్‌లున్న నాయకులే గతంలో కేసీఆర్ ఫాంహౌస్ మీద చేసిన వ్యాఖ్యలను ఆ నాయకులకే గుర్తుచేస్తూ వారిని ఒక ఆట ఆడుకుంటున్నారు. బీఆర్ఎస్ శ్రేణులు కూడా ఈ ఫాంహౌస్‌ల బండారం బయటపడటం పట్ల ఆనందం వ్యక్తంచేస్తున్నాయి. మొత్తమ్మీద కొన్ని విషయాలు ప్రజలకు తేటతెల్లమయ్యాయి. ఒకటి.. కేసీఆర్‌కే కాదు, దాదాపు అన్ని పార్టీల లీడర్లకూ రాజధానిలో ఫాంహౌస్‌లున్నాయి. రెండు, కేసీఆర్ ఫాంహౌస్ వ్యవసాయ క్షేత్రంలో ఉన్నది. అక్కడ ఆయన వ్యవసాయం చేసుకుంటున్నారు. కాంగ్రెస్ నాయకుల ఫాంహౌస్‌లన్నీ దందాల కోసం కట్టుకున్నారు. మూడు, రాజధానిలో ఎందరు నాయకులకు ఫాంహౌస్‌లున్నాయో మీడియాకు బాగా తెలుసు. అయినా ఏనాడూ ఆ విషయాన్ని మీడియా పొరపాటున కూడా వెల్లడించలేదు. అంతా కలిసికట్టుగా ఒక కుట్రపూరిత ప్రచారం చేశారు.

కేసీఆర్ కొన్నారు, వీళ్లు ఆక్రమించారు!

ఫాంహౌస్‌ల మంచి చెడుల మీద జర్నలిస్టు వర్గాల్లో కూడా కొంత చర్చ జరుగుతున్నది. కేసీఆర్ తన వ్యవసాయ క్షేత్రానికి కావలసిన భూమిని డబ్బులు చెల్లించి కొనుక్కున్నారు. ఒక్క అంగుళం కూడా ఆక్రమించుకున్నది, గుంజుకున్నది లేదు. అందులో ప్రభుత్వ భూమి లేదు. అసైన్డ్ భూమి కూడా లేదు. అలాగే చెరువులు, కుంటలు లేవు. ఎఫ్‌టీఎల్‌లు, బఫర్‌జోన్‌ల వంటి సమస్యలు లేవు. అంతా పారదర్శకం. పైగా, తన వ్యవసాయ క్షేత్రం నుంచి భగీరథ పైపులు వేయడానికి స్వయంగా ఆయనే అనుమతించారు. అందుకోసం కొంత పంట కూడా తొలగించారు. అదే సమయంలో కాంగ్రెస్ నేతల ఫాంహౌస్‌లన్నీ దురాక్రమణలే. పైసా చెల్లించకుండా బరితెగించి జరిపిన అడ్డగోలు ఆక్రమణలు. ప్రభుత్వ భూములు, నాలాలు, చెరువులు, ఎఫ్‌టీఎల్ భూములు, బఫర్‌జోన్‌లో నిర్మాణాలు చేపట్టకూడని నిషేధిత భూములు. చెరువు శిఖం భూములు, ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టి నింపి



అడ్డంగా కబ్జాలు పెట్టిన భూములు ఏవీ వదల్లేదు. అడిగేవాడు లేకపోవడంతో ఒక్క పైసా ఖర్చు లేకుండా జంట నగరాల ప్రజలకు మంచినీరందించే గండిపేటనే అడ్డగోలుగా చెరబట్టి కట్టుకున్న అక్రమ నిర్మాణాలు అందులో ఉన్నాయి. నాలా మార్గాలు, ఎఫ్‌టీఎల్‌లు, బఫర్‌జోన్‌ల పరిధిని ధ్వంసం చేసి మట్టిని నింపి కట్టుకున్న విలాస మందిరాలున్నాయి. పేరుకు ఫాంహౌస్ అయినా ఇందులో ఒక్కడూ వ్యవసాయం చేసినవాడు లేడు. ఇక్కడ జరిగిందంతా ప్రకృతి విధ్వంసం, పర్యావరణ విధ్వంసం, కాలుష్య సృష్టి.

ఎవరివి గడీలు?

కేసీఆర్ ఫామ్ హౌస్‌గా చెప్తున్నది కేవలం నివాస గృహం. సాదా సీదా ఇల్లు. ఎలాంటి హంగులు ఆర్భాటాలు లేని గ్రామీణ వాతావరణం తలపించే ఒక మామూలు నిర్మాణం. పచ్చని పంట చేల మధ్య ఒక సామాన్య రైతు నివసించడానికి అనువైన ఇల్లు. ఫాంహౌస్ అనే పేరుతో అదేదో అద్దాల భవనం అయినట్టు ప్రచారం చేశారు. అయినా, దాన్ని గడీ అంటూ కూడా కొందరు ప్రచారాలు చేశారు. అక్కడేదో జరగరానిది జరుగుతున్నట్టు.. అదో విలాసమందిరమా అన్నట్టు ప్రజలకు నూరిపోశారు. మరి గండిపేట పరిధిలోని ఫాంహౌస్‌ల మాటేమిటి? అవి కేవలం నివాసాలా? రాజ ప్రాసాదాలు తలపించే నిర్మాణాలు. కోట్లకు కోట్లు పోసి కట్టిన బహుళ అంతస్థుల అత్యాధునిక విలాస మందిరాలు. బలిసిన కోటీశ్వరులు వారాంతాల్లో సేద తీరడానికి ఎంజాయ్ చేయడానికి వచ్చే రిలాక్స్ రిసార్టులు. ఆయా ఫాంహౌస్‌ల ప్రాంగణంలో పార్కులు, పెద్ద పెద్ద హాళ్లు. అందులోనే బార్లు, రూఫ్‌టాప్‌లో గండిపేట దృశ్యాలు చూస్తూ ఎంజాయ్ చేసే విలాస మందిరాలు. చుట్టూ ఎవరి చూపు అందనంత ఎత్తులో కోట గోడల్లాంటి ప్రహరీలు, లోపలి దృశ్యాలేవీ కనిపించని స్థాయిలో పెద్ద పెద్ద గేట్లు. కాపలాకు కుప్పలు తెప్పలుగా బౌన్సర్లు. మరి ఎవరివి గడీలు?

అక్కడేం జరుగుతున్నది?

వాస్తవానికి ఆ ఫాంహౌస్ కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం. వ్యవసాయం చూసుకోవడానికే ఆయన అక్కడికి వెళ్లారు. కేసీఆర్ ఫాంహౌస్‌లో ఉండి వ్యవసాయం చూసుకుంటారు. రకరకాల పంటలు పండిస్తారు. వ్యవసాయంలో రకరకాల ప్రయోగాలు చేస్తారు. కొత్త కొత్త పద్ధతులు పాటిస్తారు. కొత్త పంటలు తాను పండించి, తన అనుభవాన్ని అక్కడికి వచ్చే వారితో పంచుకుంటారు. కేసీఆర్ ఫాంహౌస్ కేవలం వ్యవసాయం చేయడం కోసమే కట్టుకున్నది. అక్కడ ఆయనకు వేరే వ్యాపకం లేదు. మరి గండిపేట, తదితర ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు కట్టిన రాజప్రాసాదాల్లో ఏం జరుగుతోంది? దందాలు, సెటిల్‌మెంట్లు, మజాలకు నిలయాలుగా మారాయని పుకార్లు షికారు చేస్తున్నాయి. కేసీఆర్ స్వయంగా విలేకరులను పిలిచి తన వ్యవసాయక్షేత్రంలో అంగుళం అంగుళం వారికి చూపించారు. వ్యవసాయంలో తాను చేస్తున్న ప్రయోగాలను వారికి విడమరిచి చెప్పారు. మరి కాంగ్రెస్ నాయకులు ఏనాడన్నా తమ ఫాంహౌస్‌లలోకి విలేకరులను రానిచ్చారా? అక్కడ పరిస్థితిని చూడనిచ్చారా? అసలా వైపే ఎవరినీ రానివ్వకూడనంత రహస్యం దేనికి? కేసీఆర్ ఫాంహౌస్‌లో అంతా పారదర్శకం. తనను చూడటానికి వచ్చే నాయకులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రైతులు, అధికారులకు స్వయంగా కేసీఆరే తన పాత ఓమ్ని కారులో వ్యవసాయ క్షేత్రమంతా తిప్పి చూపిస్తారు. ఎలాంటి దాపరికం లేదు. కానీ, కాంగ్రెస్ ఫాంహౌస్‌లన్నీ రహస్యాలే. అసలు ఆ ప్రాంతం వైపే ఎవరినీ రానివ్వరు, దందాగాళ్లను తప్ప. వాటికి బౌన్సర్లు నిరంతరం కాపలా కాస్తారు. ఆఖరికి మహిళా జర్నలిస్టులు కూడా వారి దాడికి గురైన సంఘటనలు ఇటీవల జరిగాయి కూడా.

ఎవరిది కాలుష్యం?

కేసీఆర్ ఫాంహౌస్ నుంచి ఎలాంటి వ్యర్థాలు బయటకు రావు. చుట్టూ వ్యవసాయ భూములే కాబట్టి వ్యర్థాల సమస్యే తలెత్తదు. కానీ, ఎఫ్‌టీఎల్ పరిధిలోని కాంగ్రెస్ నేతల ఫాంహౌస్‌ల మాటేమిటి? అందులోని వ్యర్థాలు ఎటు వెళ్తున్నాయి? ఆ వ్యర్థాలు ఏకంగా హైదరాబాద్ నగర ప్రజలు తాగే నీటినే కలుషితం చేస్తున్నాయి. కేసీఆర్ వ్యవసాయం చేసుకుంటున్నారు, పంటలు పండించుకుంటున్నారు. ఆ ఫాంహౌస్ దగ్గరలో 200 ఆవులతో గోశాల కూడా ఉంది. మరి ఈ కాంగ్రెస్ నాయకులు? ఆక్రమించిన ఫాంహౌస్‌లను లక్షల రూపాయల అద్దెలకు ఇచ్చుకుంటున్నారు. గండిపేట ఏదో వీళ్ల అబ్బ సొత్తయినట్టు దాన్ని చెరబట్టి భవంతులు కట్టుకొని దాన్నీ వాణిజ్య అవసరాలకు వాడుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. వీళ్లెవరూ ఈ ఫాంహౌస్‌లలో వ్యవసాయం చేయడం లేదు. ఖరీదైన విందు సమావేశాలు, వినోద సమావేశాలు పెట్టుకుంటున్నారు. గమ్మత్తేమంటే చెరువులను కబ్జాలు పెట్టిన ఈ నాయకులే కేసీఆర్‌ది ఫాంహౌస్ పాలన అంటూ దుష్ప్రచారాలు చేశారు. ప్రజలను నమ్మించారు. పచ్చ మీడియా కూడా తప్పు దారి పట్టించింది. ప్రజలూ పొరపడ్డారు. ఏదో ఊహించుకొని ఏదో అభిప్రాయానికి వచ్చారు. ఏమైనా చివరికి నిజం బయటపడింది. అయితే, జరగవలసిన నష్టం జరిగిపోయింది. అందుకే, ప్రజలు ఏది మంచి, ఏది చెడు అనేది చూడకుండా ప్రచారాలకు మోసపోతే పర్యవసానాలు ఇలాగే ఉంటాయి. ఫాంహౌస్ ఉదంతమే దానికి ఉదాహరణ!

వరి గోస పడవడ్తిమి, భరోసా లేదాయే?

'నమ్మి నానవోస్తే.. పుచ్చి బుర్రైందట..', 'అన్నం పెట్టినోడికి సున్నం పెట్టుడంటే ఇదే..' అన్న సామెతలు మా వూరి చెర్వులోకి గంగ నీళ్లు వచ్చే లిఫ్టు కాల్వ కాడ ఇనవడ్తున్నయ్. అప్పుడే హైద్రావాద్ నుంచి ఆంధ్రానగర్ కట్టపొంటి వస్తున్న నేను వాళ్ల మాటలు విని ఆగిన. అటుదిక్కు చెట్టు కింద బర్లు మేపుకొంటున్న నీరడి పోశన్న, ఈర్నాల శంకరు, గోసమోళ్ల సంజీవు ఇట్ల నలుగురైదుగురు ముచ్చట పెడ్తున్నరు. 'పొద్దుగాల్ల పొద్దుగాల్ల ఏం ముచ్చట వెడ్తున్నరే' అని మందలించిన.



కొండ్లాడ సంతోష్



'నమస్తే సంతన్న.. ఇదేనా రాకడ' అంటూ పలుకరింపులైనయ్. 'ఇగ ఏమైందే అంతగానం వొర్రుతున్నర'ంటూ నేను అడుగంగనే.. పోశన్న అందుకున్నడు. 'గీ కొత్తగొచ్చిన సర్కారోళ్లు సన్న వడ్లు వెయ్యుండ్రి.. ఐదొందల బోనస్ ఇస్తమని చెప్పంగనే.. అప్పోసొప్పో జేసి అవే వడ్లు నాటితిమి.', 'ఇప్పుడే మైందే మరి' అంటే.. 'ఏం గావాలె.. నోట్లె మన్నువడుడు ఒక్కటే తక్కువైంది'.. అంటూ రంది వడవట్టె. 'గట్ల బాధవడకే పోశన్న ఏమైందో జర చెప్పరాదే..' అంటే అంతలోనే ఈర్నాల శంకరు అందుకొని 'మా బాధలు మీకేం తెలుసు. గా కాంగ్రెసోళ్లను నమ్మితే నట్టేట ముంచిండ్రు.. ఇంకేం గావాలె' అన్నడు. 'అరె.. మంచిగ జెప్పుండ్రే.. ఏం సమజైత లేదు' అని అడగగా.. 'పోయినేడాది ఎలక్షన్లగా చేతిగుర్తు రేవంతు మా రైతులకు ఎకురానికి రూ.7,500 పెట్టుబడి సాయంగా ఇస్తమన్నడు. ఓటేసి గెలిపించినం.. ఇప్పుడేమో సన్న వడ్లు నాటితిమి.. ఇంకో పది దినాలైతే పంట చేతికొచ్చే టైం అస్తుంది. ఇప్పటిదాకా పెట్టుబడికి దిక్కే లేకపాయె. ఇంకో ముచ్చట జెప్పాలె.. మొన్న నడిమిట్ల కురిసిన వర్షాలకు పంటలకు మాయదారి రోగమొకటి వచ్చింది. చుట్టుపక్కల ఊర్లల్ల వరి ఆకులన్నీ మాడిపోయినయ్. దానికి మందుకొట్టేందుకు మళ్లీ అప్పు చేయాల్సి వచ్చింది. పంటలకు ఎప్పుడూ చల్లే ఎరువులే కాకుండా ఈసారి పురుగు మందులతో పెట్టుబడి ఎక్కువైంది. అప్పట్లంటే కేసీఆర్ సారు.. వడ్ల నారు పోయంగనే ఠంచనుగా పెట్టుబడి సాయంమిస్తుండే. నాటే యాళ్లకు ఫోన్లన్నీ టింగ్.. టింగ్ మంటూ మొత్తుకుంటుంటే.. నవ్వుకుంట వెళ్లి పైసలు తెచ్చుకొని పంటలు వేసుకునేవాళ్లం. ఇప్పుడేమో గిట్ల అయిపాయే.. ఎవుసం ఎట్ల జేసుడో ఏమో'.. అంటూ కండ్లల్లకెల్లి నీళ్లు తెచ్చుకోవట్టె. 'ఏం రంది వడకురా వస్తయిలే ఏటు వోతయి.. రాకపోతే మన కోసం కొట్లాడే కేసీఆర్ మన ఎన్కాల ఉండనే ఉండె. అస్తయి తీయ్'.. అంటూ సంజీవులు చెప్పిండు.

> **ఇంతల్నే పోశన్న అందుకొని.. 'మన కోసం ఏం అడుగుతడు.. అన్నం పెట్టినోడికి సున్నం పెట్టినోళ్లం.. ఇంక మన గురించి ఆలోచిస్తడా' అంటుండంగనే సంజీవులొచ్చి.. 'గాయన కూడా ఒక రైతేరా పోశిగా.. మన బాధలు ఎరుకనే.. ఎలక్షన్ల మనం ఏదో సోయి తప్పి ఆయనను దూరం జేసుకున్నం. కానీ, ఆయనెప్పుడూ మన రైతుల వెంటే ఉంటడు' అని చెప్పిండు.**

ఇంతల్నే శంకరు కలుగజేసుకొని 'ఏందో ఏమోనే.. మొన్నటిదాకా కౌలు రైతులకు, పట్టా రైతులకు భరోసా ఇస్తమని చెప్పిండ్రు. ఇప్పుడేమో మీరు.. మీరు చూసుకోండ్రి అంటూ అవుతల వడేందుకు చూస్తుండ్రు. నేను మొన్న టీవీల జూసిన గా మంత్రి ఒకాయన ఎవరో ఒకరికే రైతుభరోసా ఇస్తమని చెప్పిండు. ఇంకేంది మన మధ్యల లొల్లివెట్టాలని చూస్తుండ్రు'.. అంటూ గరమైండు. 'మన కాపులోన్నే సక్కంగ జేయలే.. ఇంక భరోసా ఏమి ఇచ్చేటట్టు ఉన్నడు గీ కొత్త సీఎం. ఇంక నిన్న మల్లొక వార్త చెప్పిండు.. సన్నవడ్లకు కింటాలుకు ఐదొందలు ఇస్తమని.. ఇగ మస్తయింది. గీయన మాటలు మనం నమ్మితే.. గంగల వడుడె. నాకైతే అస్తయన్న ఆశ కనవడ్తలేదు. ముందైతే గా భరోసా పైసలైతే ఇయ్యమను' అంటూ మళ్లీ అందుకున్నడు.

మధ్యలో ఒకాయన (కాంగ్రెస్ అభిమాని) వొచ్చి 'అవునే.. నిజమేనే.. మేం కూడా మోసపోయినమనిపిస్తున్నది. ఎలక్షన్ల గాయనను గెలిపించేతందుకు మస్తు జెప్పినం.. ఇప్పుడు ఊర్ల మాకే పతేరా లేకుంట పోయింది' అనుకుంటూ మెల్లిగా జారుకున్నడు. 'గంత మంచిగా టైంకు పెట్టుబడి సాయమిచ్చే.. యాళ్లకు వడ్లు కొని పైసలు అకౌంట్ల ఏసిండు. రైతులకు ఏ రందీ లేకుంట చూసుకోండ్రని ఎక్కడ వోయినా.. ఏ మీటింగ్ పెట్టినా ఆఫీసర్లకు.. మంత్రులకు మంచిగ చెబుతుండే.. దేవుడోలె మనల్ని మంచిగజూసుకున్న కేసీఆర్ సారును మనం దూరం జేసుకొని బాధల్ని నెత్తినపెట్టుకున్నం' అనుకుంట బాధపడ్డరు.

'నిజమేనే ఒక ఇషయం యాదికొచ్చింది. ఒకపారి.. దేశంల మిడతల దండు వచ్చి పంటల మీది వాలి మొత్తం నాశనం జేసింది గుర్తుకున్నదా మీకందరికి? గా టైంల కేసీఆర్ సారు సీఎంగా ఉండె. మనకు ఆ ముచ్చట తెల్వకముందే కేసీఆర్ సారు ఆఫీసర్లతో మాట్లాడి.. ఇటు దిక్కు ఆదిలాబాద్, బాసర, భైంసా, జుక్కల్, మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దుల్ల ఇట్ల తెలంగాణ సుట్టూ గా నీళ్ల మోటర్లు (ఫైరింజన్లు) పెట్టి రెడీగా ఉంచిండు. అప్పుడే అర్థమైందే.. మన కేసీఆర్ సారుకు ఎవుసం మీద.. మన రైతుల మీద ఎంత పీర్తి ఉన్నదో.. అగ్గో గట్ల ఉండాలె సీఎం అంటే.. ఎంతైనా కేసీఆర్.. కేసీఆరే..' అంటూ బర్లు కొట్టుకొని పోయిండ్రంతా.

(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్)

'రాజీ మాటకి మామూలే కానీ, చేతలకొచ్చేసరికి ఒక జీవితకాల యుద్ధమే దాగుంటుంది' అన్నది ఓ తత్త్వవేత్త చెప్పిన సూక్తి. ఈ సూక్తి అర్థవంతంగానే ఉంది కానీ, దాన్ని పాలకులు ఒంట బట్టించుకున్నట్లు లేరు. రాజీపడి జీవించడమంటే ఏదో పెద్ద యుద్ధం చేసినట్టుగా భావించటమే ప్రపంచంలో ఇప్పుడున్న అసలైన సమస్య.

యుద్ధం మిగిలే ఉంది!



డాక్టర్ మహ్మద్ హసన్
99080 59234



కళింగ యుద్ధం అశోకుడి జీవితాన్ని మార్చివేసింది. తర్వాత తన జీవితాంతం ఆయన మళ్లీ యుద్ధానికి పోలేదు. స్వయంగా తన కుమారుడు మహేంద్రుడు, కుమార్తె సంఘమిత్రను బౌద్ధ మత ప్రచారం కోసం దేశవిదేశాలకు పంపినట్టుగా చరిత్ర చెప్తున్నది. గొప్ప చరిత్రకు వేదికగా నిల్చింది నాటి కళింగ యుద్ధం. ఇలా చరిత్రలో జరిగిన యుద్ధాల గురించి చెప్పుకుంటూ పోతే గొప్ప గొప్ప చారిత్రక సందర్భాలను ఉటంకించాల్సి ఉంటుంది. యుద్ధం ద్వారా పాలకుడిలో కలిగిన పరివర్తనకు నిదర్శనం ఆ సంఘటన. ఆ తర్వాత ప్రపంచవ్యాప్తంగా పుట్టుకొచ్చిన పలు విప్లవాలు రాజరిక పాలనలకు తెరదించి ప్రజాస్వామ్య పాలనకు, జాతీయ రాజ్యాలకు బీజం వేశాయి. ఫలితంగా రాజులు, రాజ్యాలు కాలగర్భంలో కలిసిపోయారు.

స్వతంత్ర దేశాలు ఏర్పడినప్పటికీ దేశాల మధ్య సిద్ధాంతపరమైన విభేదాలు, భౌగోళిక, పాలనా, మతపరమైన వివాదాలు నేటికీ సద్దుమణగలేదు. కాగా తరచు ప్రపంచంలో ఏదో ఒక మూలన దేశాల మధ్య లేదా ప్రజలకు, పాలకులకు మధ్య యుద్ధం జరుగుతూనే ఉన్నది. ఉదాహరణకు 2001, సెప్టెంబర్ 11 నాటి సంఘటన ద్వారా ఏకంగా అల్‌ఖైదా ఉగ్రవాద సంస్థను సమూలంగా అంతం చేయడానికి అమెరికా పూనుకున్న ది. ఫలితంగా జరిగిన పోరులో అమెరికా గెలిచిం దా? అల్ ఖైదా ఓడిందా? అన్నది పక్కనపెడితే అమెరికా దుశ్చర్య వల్ల అఫ్ఘాన్ నేటికీ రావణకాష్టంలా మండుతున్నది.

జీవరసాయన ఆయుధాలను తయారు చేస్తున్నారన్న నెపంతో యుద్ధ నేరాలకు సద్దాం హుస్సేన్‌ను బాధ్యుడిగా చేస్తూ అతడిని అమెరికా ఉరి తీయించింది. ఓ పాలకుడిని హత మార్చినంత మాత్రాన ప్రపంచమంతా శాంతి పవనాలు వీస్తాయని ఆశించటం అవివేకపు ఆలోచన. అలా అయితే జర్మనీలో హిట్లర్, ఇటలీలో ముస్సోలిని పాలన అంతమయ్యాక యావత్ ప్రపంచంలో ఎందుకు శాంతిసామరస్యాలు వెల్లివిరియలేదు? అదేవిధంగా ఐరాస స్థాపన తర్వాత ప్రపంచం శాంతియుత సమాజంగా ఎందుకు మారలేదు? నాటినుంచి నేటివరకు పలుదేశాల మధ్య జరిగిన యుద్ధాలను ఐరాస ఎందుకు నివారించలేకపోయింది?

> **గత రెండేండ్లుగా రష్యా-ఉక్రెయిన్ యుద్ధం జరుగుతూనే ఉంది. రెండు దేశాల్లోనూ ఆస్తి, ప్రాణ నష్టం సంభవిస్తున్నది. గతేడాది అక్టోబర్ 7న ప్రారంభమైన హమాస్-ఇజ్రాయెల్ పోరు క్రమంగా పశ్చిమాసియా అంతటా విస్తరిస్తున్నది. ఇప్పటికే వేలమంది పిల్లలు, మహిళలు, వృద్ధులు మరణించారు. వారంతా యుద్ధంతో సంబంధం లేనివారే.**

ఓ పక్క ఆయుధాలు విక్రయిస్తూ, మరో పక్క ప్రపంచ శాంతి అంటూ నీతి వాక్యాలు వల్లిస్తున్న దేశాలు, ప్రపంచంపై ఆధిపత్యం కోసం స్వార్థపు ఆలోచనలు చేస్తున్నన్ని రోజులు యుద్ధాలు జరుగుతూనే ఉంటాయి. అలాంటి దేశాలతో ప్రపంచానికి ఎప్పటికైనా ప్రమాదమే. యుద్ధం ఇంకా మిగిలే ఉంది. రాబందుల రెక్కల చప్పుడు మరుభూమిలో వినిపిస్తూనే ఉంది. ఈ రోజు పశ్చిమాసియా దేశాలు కావచ్చు, ఇంకో రోజు మరో దేశం కావచ్చు యుద్ధం కౌగిట్లో నలిగిపోవడానికి. బాధితులు మాత్రం ఎన్ని తరాలైనా సామాన్యులే. యుద్ధం అనేది నీలో నీ కోసం నిన్ను మార్చుకోవడానికి జరగాలి. అప్పుడే దాని ఫలితం అద్భుతంగా ఉంటుంది.

(2024, అక్టోబర్ 7తో 'హమాస్-ఇజ్రాయెల్' యుద్ధానికి ఏడాది)

ఎటమటం



ఎవరింటికి పుటం పెడుతడో

గుంపు మేస్త్రీ ఎవరింటికి పుటం పెడుతడో తెల్వక జనం తెల్లార్లు జాగారం చేస్తున్నరు. వాళ్లకు పండుగ లేదు, పబ్బం లేదు. పెత్తరమాస నాడు గూడ అమ్మలక్కలు బతుకమ్మ పేరుకే పేర్చిండ్రు గనీ.. మది నిండా గుండెలవిసిపోయే బాధే నాయే. ఆ బాధను కైగడితే బతుకమ్మ పాటైంది.

'గుంపు మేస్త్రీ పాలన ఉయ్యాలో..
గుదిబండ తీరాయె ఉయ్యాలో..
పేదల బతుకుల్లో ఉయ్యాలో..
చీకటి నింపిండు ఉయ్యాలో
గూడు చెదిరిపాయె ఉయ్యాలో..
గుండెలు అవిసిపాయె ఉయ్యాలో..
కాంగ్రెస్ రేవంత్ ఉయ్యాలో..
కాలయముడైపాయె ఉయ్యాలో..'



బతుకమ్మ రాగంతోనైనా ఆ మేస్త్రీకి సుతి ముట్టి బతుకనిస్తాడో అంటున్నారు మహిళలు.




ఇక దసరా పండుగే!

ఆంధ్రా ప్రజలు ఎగిరి గంతేస్తున్నరట! ఎందుకో తెలుసా ఇన్నాళ్లు ఏపీలో నాణ్యమైన మందు దొరక్క మందుబాబులు ఉక్కిరి బిక్కిరైన విషయం తెలిసిందే కదా? అయితే ఎన్నికలకు ముందు 'నాణ్యమైన మందును మీకు అందుబాటులో తెస్తామ'ని మాటిచ్చిన చంద్రబాబు ఆ మాట నెరవేర్చుకున్నారని సంతోషపడుతున్నారట. దసరా సందర్భంగా ఏపీ అంతటా మద్యం దుకాణాలు అందుబాటులోకి రానున్నాయట! ప్రస్తుతం 'జాబు రావాలంటే బాబు రావాలి' నినాదం కాస్తా 'మందు రావాలంటే చంద్రబాబు రావాలి' అనే నినాదంగా మారి ఏపీ మందుబాబుల నోట్లో నానుతున్నదట! ఇంకేం మందు బాబులకు ఇక దసరా పండుగే!



మక్కికి మక్కీ..

వాళ్లిద్దరిది గురుశిష్యుల బంధం. గురువుగారి రాజ్యాంగంలోని పుటకు ఈగ అతుక్కుంటే.. శిష్యుడు ఈగను కొట్టి పుటల పెట్టేదాక నిద్రపోడు. అదేమంటే..! అభివృద్ధిలో బాబు గారితో పోటీ అంటడు. ఆయన బుడమేరు బురుద కడుక్కోవడానికి, బురద రాజకీయాల్లోకి తిరుపతి లడ్డూను లాగిండు. ఈనె రైతు రుణమాఫీ చేయలేక.. రైతులకు మొఖం చూపలేక మూసీ మురికి మొఖం నిండా రుద్దుకొని తిరుగుతున్నడు. ఆ దురద భరించలేక హైడ్రాతో గోక్కున్నడు. జనం గురువును సుప్రీంకోర్టుకు.. శిష్యున్ని హైకోర్టు ఈడ్చిండ్రు. గురువు స్థాయికి తగ్గట్టుగా ఆయనను సుప్రీంకోర్టు తలంటగా.. శిష్యుడు స్థాయికి తగ్గట్టుగా హైకోర్టు మొట్టికాయలు వేసిందని నెటిజన్లు జోకులు పేలుస్తున్నరు.



ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ

బర్రెకు సగేసి దూడను ఎగేసినట్టుంది బీజేపీ సంగతి. అటు జనాన్ని ఎగేస్తోంది, ఇటు సర్కారుకు సగేస్తోంది. హైడ్రాకు సూపర్ పవర్స్ కల్పిస్తూ కాంగ్రెస్ సర్కారు ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. దాన్ని గవర్నర్ ఆమోదించారు. అయితే, కేంద్ర మంత్రులిద్దరు దగ్గర ఉండి మరీ ఆర్డినెన్స్‌కు ఆమోదింపజేశారట. పాపం బీజేపీతో రాహుల్‌గాంధీ కొట్లాడుతుంటే.. రాష్ట్రంలో బీజేపీతో కాంగ్రెస్ దోస్తీ కట్టడం చూసి జనం ముక్కున వేలేసుకుంటున్నారు.

- చిన రాజయ్య

సేవల రంగం కుదేలు

- **సెప్టెంబర్‌లో 10 నెలల కనిష్ఠానికి కార్యకలాపాలు**
- **కొత్తగా లేని వ్యాపారం, అంతర్జాతీయ అమ్మకాలూ పతనం**
- **హెచ్‌ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్**

న్యూఢిల్లీ, అక్టోబర్ 4: దేశీయ సేవా రంగ కార్యకలాపాలు గత నెలలో దారుణంగా పడిపోయాయి. సెప్టెంబర్‌లో 10 నెలల కనిష్ఠానికి దిగజారినట్టు శుక్రవారం విడుదలైన హెచ్‌ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ నెలవారీ సర్వేలో తేలింది. ఆగస్టులో ఈ సూచీ 60.9గా ఉంటే.. సెప్టెంబర్‌లో 57.7కే పరిమితమైంది. గత ఏడాది నవంబర్ తర్వాత ఈ స్థాయిలో గణాంకాలు పతనం కావడం ఇదే తొలిసారి.

నీరసించిన వ్యాపారం, అమ్మకాలు

గత నెల కొత్తగా జరిగే వ్యాపార కార్యకలాపాలు బాగా తగ్గుముఖం పట్టాయని, అంతర్జాతీయ అమ్మకాలు సైతం పడిపోయాయని, ఉత్పాదకత కూడా క్షీణించిందని ఈ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ)లో స్పష్టమైంది. అందుకే ఈ ఏడాదిలో మొదటిసారి 60 కంటే తక్కువకు స్కోర్ దిగజారినట్టు హెచ్‌ఎస్‌బీసీ ఇండియా ప్రధాన ఆర్థికవేత్త ప్రంజుల్ భండారి చెప్పారు. కాగా, మార్కెట్‌లో తీవ్రమైన పోటీ, ధరల ఒత్తిళ్లు, వినియోగదారుల ప్రాధాన్యతలో మార్పులు వంటివి ఇండెక్స్ వృద్ధిలో పతనానికి కారణమైనట్టు ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు.



ప్రమాదంలో తయారీ రంగం

పీఎంఐ తాజా గణాంకాలు భారతీయ తయారీ రంగంలో నెలకొన్న ప్రమాదకర పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. దేశంలోకి పెరుగుతున్న దిగుమతుల కారణంగా ఇప్పటికే స్థానికంగా ఉత్పాదకత పడిపోతున్నది. ఇక కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన 'మేక్ ఇన్ ఇండియా'తో ఒనగూరిందేమీ లేదని ఇటీవల విడుదలైన గణాంకాలే తేల్చాయి. ఈ క్రమంలో దిగుమతుల్ని తగ్గించి, ఎగుమతుల్ని పెంచే దిశగా అడుగులు పడకపోతే భారీ మూల్యమే చెల్లించుకోవాల్సి వస్తుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

చైనాతో జాగ్రత్తగా ఉండాల్సిందే

పొరుగు దేశం చైనాతో పెరుగుతున్న వాణిజ్య లోటుపైనా ఇండస్ట్రీ నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. దేశీయ మార్కెట్‌లో చైనా కంపెనీల వ్యాపార కార్యకలాపాలు చాప కింద నీరులా విస్తరిస్తుండటం ఇప్పుడు భారత ఆర్థిక వ్యవస్థకు పొంచి ఉన్న ప్రధాన ముప్పుగా వారు అభివర్ణిస్తున్నారు. కొన్ని రంగాల్లోకి చైనా కంపెనీల రాకను అడ్డుకుంటున్నప్పటికీ.. ఇతర మార్గాల ద్వారా అక్కడి మూలాలున్న సంస్థలు భారత్‌లోకి ప్రవేశిస్తూనే ఉండటం ఆందోళనకరంగా తయారైంది. దేశీయ స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో చైనా సంస్థలదే హవా అన్న విషయం తెలిసిందే. గృహోపకరణాలు, ఇతర డిజిటల్ పరికరాలు, ఆటో రంగంలోనూ ఆ దేశ ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీంతో దేశీయంగా తయారీ బలపడేలా మోదీ సర్కారు ప్రభావవంతమైన చర్యలు తీసుకోవాలని, ప్రోత్సాహకాలు, రాయితీలు అందిస్తే త్వరితగతిన మెరుగైన ఫలితాలను సాధించవచ్చనీ మెజారిటీ నిపుణులు చెప్తున్నారు. ప్రస్తుత మందగమనం వేళ ఇది చాలా అవసరమని అంటున్నారు.



నయా మాగ్నెట్

ధర రూ.5.99 లక్షలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 4: జపాన్‌కు చెందిన ఆటోమొబైల్ సంస్థ నిస్సాన్.. దేశీయ మార్కెట్‌కు నయా మాగ్నెట్‌ను పరిచయం చేసింది. ఈ కారు ప్రారంభ ధర ఢిల్లీ ఎక్స్‌షోరూం ప్రకారం రూ.5.99 లక్షలు. తొలి పదివేల బుకింగ్‌లకు మాత్రమే ఈ ధర వర్తించనున్నది. 1.0 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్‌తో తయారైన ఈ మాడల్ లీటర్‌కు 20 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. ఆటోమేటిక్ మాడల్ 17.4 కిలోమీటర్లు మైలేజీ. భారత్‌లో వ్యాపార విస్తరణ కోసం మరో 100 మిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టబోతున్నట్లు నిస్సాన్ ఇండియా ప్రకటించింది. ఇప్పటికే సంస్థ 600 మిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టింది.

ఐదోరోజూ అదే తీరు

- **భారీ నష్టాల్లోనే స్టాక్ మార్కెట్లు**
- **సెన్సెక్స్ 809, నిఫ్టీ 235 పాయింట్లు క్షీణత**

ముంబై, అక్టోబర్ 4: దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాలు కొనసాగుతున్నాయి. పశ్చిమాసియా దేశాల్లో ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతుండటం, విదేశీ మదుపరులు భారీగా నిధులను ఉపసంహరించుకోవడంతో వరుసగా ఐదో రోజూ భారీగా నష్టపోయాయి. నష్టాల ప్రారంభమైన సూచీలు చివరివరకు అదే ట్రెండ్‌ను కొనసాగించాయి. ఎఫ్‌ఎంసీజీ, ఎనర్జీ రంగ షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతో వారాంతం ట్రేడింగ్‌లో 30 షేర్ల ఇండెక్స్ సూచీ 800 పాయింట్లకు పైగా నష్టపోయింది 1,835.63 పాయింట్ల శ్రేణిలో కదలాడిన సెన్సెక్స్ చివరకు 808.65 పాయింట్లు కోల్పోయి మూడు వారాల కనిష్ఠస్థాయి 81,688.45 వద్దకు పడిపోయింది. అటు ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ కూడా 235.50 పాయింట్లు జారుకొని 25,014.60 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 25 వేల పాయింట్ల దిగువకు పడిపోయిన సూచీ చివర్లో ఈ భారీ నష్టాలను తగ్గించుకోగలిగింది.



5 రోజులు..16 లక్షల కోట్లు

సూచీల భారీ నష్టాలు మదుపరులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. గత ఐదు రోజుల్లో ఏకంగా మదుపరులు రూ.16 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. గతంలో రికార్డు స్థాయిలో దూసుకుపోయిన బీఎస్‌ఈలో లిస్టైన సంస్థల విలువ అంతే వేగంతో పాతాళంలోకి జారుకున్నది. ఇదే క్రమంలో శుక్రవారం బీఎస్‌ఈలో లిస్టైన కంపెనీల విలువ రూ.16,26,691.48 కోట్లు కరిగిపోయి రూ.4,60,89,598.54 కోట్ల(5.49 ట్రిలియన్ డాలర్లు)కు జారుకున్నది. గత ఐదు రోజుల్లో సెన్సెక్స్ 4,147.67 పాయింట్లు లేదా 4.83 శాతం నష్టపోయింది.

- రియల్టీ రంగ సూచీ 1.60 శాతం, వాహన 1.50 శాతం, టెలికమ్యూనికేషన్ 1.25 శాతం, యుటిలిటీ 1.20 శాతం, కమోడిటీస్ 1.14 శాతం మేర నష్టపోయాయి. కానీ, ఐటీ రంగ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- ఈవారంలో సెన్సెక్స్ 3,883.40 పాయింట్లు(4.60 శాతం), నిఫ్టీ 1,164.35 పాయింట్లు(4.5 శాతం) నష్టపోయింది. గత రెండేండ్లలో ఒక్క వారంలో ఇంతటి స్థాయిలో పతనం చెందడం ఇదే తొలిసారి.
- మహీంద్రా అండ్ మహీంద్రా షేరు 4 శాతం వరకు నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది.
- దీంతోపాటు బజాజ్ ఫైనాన్స్, నెస్లె, ఏషియన్ పెయింట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, భారతీఎయిర్‌టెల్, ఐటీసీ, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎన్‌టీపీసీలు ఒక్క శాతానికి పైగా నష్టపోయాయి.
- అదానీ పోర్ట్స్, కొటక్ బ్యాంక్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, మారుతి, టైటాన్, ఇండస్ఇండ్ బ్యాంక్, ఎల్‌అండ్‌టీ, సన్‌ఫార్మా, టాటా స్టీల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు పతనం చెందాయి.

యాపిల్ మరో 4 స్టోర్లు

న్యూఢిల్లీ, అక్టోబర్ 4: దేశవ్యాప్తంగా ఐఫోన్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని మరో నాలుగు స్టోర్లు ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది యాపిల్ సంస్థ. పుణె, బెంగళూరు, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబైలలో కొత్త స్టోర్లను నెలకొల్పనున్నట్లు యాపిల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డియర్‌డ్రి ఓబ్రియాన్ తెలిపారు. దీంతోపాటు దేశీయంగా తయారైన ఐఫోన్ 16, ఐఫోన్ 16 ప్రొ మ్యాక్స్ సిరీస్ ఫోన్లను ఈ నెలలోనే అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. 2023లో సంస్థ ఢిల్లీ, ముంబైలలో ఒక్కో స్టోర్‌ను ప్రారంభించింది.

సైయెంట్ డీఎల్ఎం చేతికి అమెరికా సంస్థ

హైదరాబాద్, అక్టోబర్ 4: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్న సైయెంట్ డీఎల్ఎం..అంతర్జాతీయ వ్యాపార విస్తరణలో భాగంగా అమెరికాకు చెందిన ఎలక్ట్రానిక్స్ తయారీదారు అల్టెక్ ఎలక్ట్రానిక్సను కొనుగోలు చేసింది. ఒప్పందం విలువ 29 మిలియన్ డాలర్లు(రూ.250 కోట్లకు పైమాటే). 2023లో అల్టెక్ ఎలక్ట్రానిక్స్ 37.2 మిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించింది. వ్యూహాత్మక వ్యాపార విస్తరణలో భాగంగా ఈ కొనుగోలు జరిపినట్లు, ముఖ్యంగా క్లయింట్లకు నూతన సేవలు అందించడానికి వీలు పడనున్నదని పేర్కొంది. ఈ కొనుగోలు పూర్తైన తర్వాత సంస్థ పరిధిలోకి కొత్తగా 80 వేలచదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన తయారీ ప్లాంట్ చేరనున్నది.

స్విగ్గీ స్పీడ్ సర్వీస్ 'బోల్ట్'

న్యూఢిల్లీ, అక్టోబర్ 4: ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ.. కస్టమర్లకు కేవలం 10 నిమిషాల్లోనే సర్వీస్‌ను అందించేలా 'బోల్ట్' పేరిట ఓ స్పీడ్ ఫుడ్ డెలివరీ సర్వీస్‌ను ప్రారంభించింది. వినియోగదారులకు 2 కిలోమీటర్ల వ్యవధిలో ఉన్న కొన్ని ఎంపిక చేసిన రెస్టారెంట్లలో చేసే ఆర్డర్లకే ఈ సౌకర్యం ఉంటుందని శుక్రవారం సంస్థ ప్రకటించింది. కాగా, రాబోయే వారాల్లో మరిన్ని నగరాలకు ఫుడ్ డెలివరీ సేవలను విస్తరించాలని స్విగ్గీ చూస్తున్నది.



శుక్రవారం ముంబైలో బీఎండబ్ల్యూ లగ్జరీ స్పోర్ట్స్ కార్ మాడల్ ఎం4 సీఎస్‌ను దేశీయ మార్కెట్‌కు పరిచయం చేస్తున్న ఆ కంపెనీ భారతీయ విభాగం అధ్యక్షుడు విక్రమ్ పవా. ఈ ఏడాది బీఎండబ్ల్యూ తెచ్చిన 25వ మాడల్ ఇది. దీని ధర రూ.1.89 కోట్లు.


పసిడికి పండుగ కళ

- **చారిత్రక గరిష్ఠ స్థాయికి ధరలు**
- **తులం రూ.78,450గా నమోదు**

న్యూఢిల్లీ, అక్టోబర్ 4: బంగారం ధరలు మళ్లీ ఆల్‌టైమ్ హైకి చేరాయి. పండుగ సీజన్ కావడంతో అంతా పసిడి కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నట్టు మార్కెట్ వర్గాలు చెప్తున్నాయి. ఈ క్రమంలోనే దేశ రాజధాని ఢిల్లీలో తులం 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) పుత్తడి రేటు శుక్రవారం మునుపెన్నడూ లేని విధంగా రూ.78,450గా నమోదైంది. గురువారం ముగింపుతో పోల్చితే రూ.150 పెరిగింది. హైదరాబాద్‌లో ఇది రూ.77,670గా ఉన్నది. ఇక 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) గోల్డ్ 10 గ్రాముల విలువ కూడా రూ.200 ఎగిసి ఇంతకుముందెప్పుడూ లేనట్టుగా భౌతిక మార్కెట్‌లో రూ.78,100కి చేరింది. మొత్తానికి నవరాత్రుల సందర్భంగా గోల్డ్ మార్కెట్ కోలాహలంగా మారడం బులియన్ ట్రేడర్లలో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నది.

రూ.80,000 దిశగా..

జ్యుయెల్లర్స్, రిటైలర్ల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ కనిపిస్తుండటంతో రాబోయే రోజుల్లో ధరలు మరింత పెరుగుతాయన్న అంచనాలు గట్టిగా వినిపిస్తున్నాయిప్పుడు. ఈ నెలాఖరున దీపావళి కూడా ఉండటంతో పసిడి 10 గ్రాములు 80,000 మార్కును తాకే అవకాశాలే ఎక్కువని అంటున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా స్టాక్



మార్కెట్లు ఇంకా పడిపోతే ఇన్వెస్టర్ల నుంచీ ఆదరణ పెరుగుతుందని చెప్తున్నారు. ఇదే జరిగితే గోల్డ్ రేట్లు ఊహకందని స్థాయిలో ఈ నెల రోజుల్లోనే పెరిగిపోతాయన్న విశ్లేషణలూ వస్తుండటం గమనార్హం.

వెండి రేట్లూ పైపైకి..

బంగారం ధరలకుతోడు వెండి రేట్లూ పరుగులు పెడుతున్నాయి. ఢిల్లీలో కిలో వెండి ధర రూ.1,035 ఎగిసి రూ.94,200గా ఉన్నట్టు అఖిల భారత సరఫా అసోసియేషన్ తెలిపింది. హైదరాబాద్‌లో లక్షపైనే పలుకుతుండటం గమనార్హం. సాధారణ కొనుగోలుదారులతోపాటు ఇన్వెస్టర్లు, ఇండస్ట్రీ వర్గాల నుంచి డిమాండ్ ఎక్కువగా కనిపిస్తున్నట్టు వ్యాపారులు చెప్తున్నారు. ఇదిలావుంటే మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)పై ఫ్యూచర్స్ ట్రేడ్‌లో డిసెంబర్ నెల డెలివరీకిగాను గోల్డ్ కాంట్రాక్ట్స్ 10 గ్రాములు రూ.76,375 పలికింది. కిలో వెండి కూడా రూ.93,197గా నమోదైంది. ఇక గ్లోబల్ మార్కెట్‌లో ఔన్స్ గోల్డ్ 2,678.90 డాలర్లు, సిల్వర్ 32.37 డాలర్లుగా ట్రేడ్ అవుతున్నది.

మార్కెట్లోకి లావా అగ్నీ 3 స్మార్ట్‌ఫోన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 4: దేశీయ మొబైల్ తయారీ సంస్థ లావా ఇంటర్నేషనల్..అగ్నీ 3 స్మార్ట్‌ఫోన్‌ను పరిచయం చేసింది. రూ.19,999 నుంచి రూ.22,999 ధరల శ్రేణిలో ఈ స్మార్ట్‌ఫోన్ లభించనున్నది. మీడియా టెక్ డిమెన్సిటీ 7300 ఎక్స్ ఆక్టా-కోర్ ప్రాసెసర్, డ్యూయల్ స్క్రీన్, ట్రాక్ స్టెప్స్ వంటి ఫీచర్స్ ఉన్నాయి. ఈ సందర్భంగా కంపెనీ ఈడీ సునీల్ రైనా మాట్లాడుతూ..రూ.20-25 వేల స్మార్ట్‌ఫోన్ల విభాగంలో 10 శాతం మార్కెట్ వాటా లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



సురేఖను క్షమించను

నాగచైతన్య, సమంత విడాకుల విషయంలో మంత్రి కొండా సురేఖ చేసిన అనుచిత వ్యాఖ్యలపై సినీ పరిశ్రమ నుంచి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమైన విషయం తెలిసిందే. సోషల్‌మీడియా వేదికగా సురేఖ మాటలపై సినీ తారలు మండిపడ్డారు . తాజాగా అఖిల్ అక్కినేని సురేఖ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో వరుస పోస్టులు చేశారు. మంత్రి సురేఖను ఎట్టి పరిస్థితుల్లో క్షమించేది లేదని హెచ్చరించారు. 'కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు నీచ స్థాయిలో ఉన్నాయి. ప్రజా సేవకురాలిగా రక్షణ కల్పించాల్సిన ఆమె నైతిక విలువలను విస్మరించి దారుణమైన మాటలతో తెగబడింది. ఆమె ప్రవర్తించిన విధానం, మాట్లాడిన మాటలు ఏమాత్రం క్షమించరానివి. ఆమె వ్యాఖ్యలతో సమాజంలో గౌరవమర్యాదలు కలిగిన కుటుంబం మనసు గాయపడింది. స్వార్థ రాజకీయ యుద్ధంలో గెలిచేందుకు ఉన్నతమైన విలువలు, సామాజిక హోదా ఉన్న వ్యక్తులపై దాడి చేసి వారిని బలి పశువులు చేశారు. ఈ విషయంలో అక్కినేని కుటుంబ సభ్యుడిగా నేను మౌనంగా ఉండదలచుకోలేదు. ఇలాంటి సిగ్గులేని వ్యక్తికి ఖచ్చితంగా శిక్ష పడాలి. మన సమాజంలో ఇలాంటి వ్యక్తులకు స్థానం లేదు. వారిని ఎట్టి పరిస్థితుల్లో క్షమించొద్దు' అని అఖిల్ తన ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు.



దక్షిణాదిలో వివక్ష చూపిస్తారు

దక్షిణాది చిత్రసీమలో హీరోలకు ఇచ్చినంత ప్రాధాన్యత నాయికలకు ఇవ్వరని, ఏ విషయంలోనూ పెద్దగా పట్టించుకోరని ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది కథానాయిక మాళవికా మోహనన్. ఇటీవల విడుదలైన హిందీ చిత్రం 'యుధ్రా'లో ఈ భామ నటనకు ప్రశంసలు దక్కాయి. ఈ సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సౌత్ సినిమా ఇండస్ట్రీ గురించి మాట్లాడుతూ 'దక్షిణాదిలో హీరో కేంద్రంగానే సినిమాకు సంబంధించిన అన్ని వ్యవహారాలు జరుగుతాయి. కథానాయికలకు చాలా తక్కువ ప్రాధాన్యతనిస్తారు. సినిమా సక్సెస్ అయితే ఆ క్రెడిట్ మొత్తం హీరోకే ఆపాదిస్తారు. ఒకవేళ పరాజయం పాలైతే అందులో నటించిన హీరోయిన్‌ను అన్‌లక్కీ అని, ఆమె వల్లే సినిమా ఫ్లాప్ అయిందని మాట్లాడతారు' అని చెప్పింది. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్‌మీడియాలో హాట్‌టాపిక్‌గా మారాయి. తమిళ, మలయాళ, కన్నడ చిత్రాల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ సొగసరి 'రాజా సాబ్' చిత్రంతో తెలుగు చిత్రసీమకు పరిచయమవుతున్నది. ప్రభాస్‌తో కలిసి నటించడం చాలా ఆనందంగా ఉందని, అభినయానికి ఆస్కారం ఉన్న మంచి పాత్ర ద్వారా టాలీవుడ్‌లో ఎంట్రీ ఇవ్వడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పింది.

దళపతి 69 ప్రారంభం



తమిళ అగ్ర హీరో దళపతి విజయ్ 69వ చిత్రం శుక్రవారం చెన్నైలో ఘనంగా ప్రారంభమైంది. రాజకీయ రంగ ప్రవేశం నేపథ్యంలో తన కెరీర్‌లో ఇదే ఆఖరి చిత్రమని విజయ్ గతంలోనే ప్రకటించిన విషయం తెలిసిందే. కేవీయన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె నారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రానికి హెచ్.వినోద్ దర్శకత్వం వహిస్తున్నారు. పూజా హెగ్డే కథానాయిక. పాన్ ఇండియా స్థాయిలో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. శనివారం నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుకానుంది. వచ్చే ఏడాది అక్టోబర్‌లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. బాబీ డియోల్, గౌతమ్ మీనన్, ప్రియమణి, ప్రకాష్‌రాజ్, మమిత బైజు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సత్యన్‌సూర్యన్, సంగీతం: అనిరుధ్ రవిచందర్.



కొత్త ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా

'కొత్త కంటెంట్‌ని ఆడియన్స్ ఆదరిస్తారన్న నమ్మకంతో చేసిన సినిమా 'స్వాగ్'. అనుకున్నట్టే బాగా రిసీవ్ చేసుకుంటున్నారు. ముఖ్యంగా నా కేరక్టర్లు, గెటప్స్‌కి మంచి స్పందన వస్తున్నది. పొద్దున్నుంచీ ఈ సినిమా తాలూకు అభినందనలను అందుకుంటూనే ఉన్నా. ఆడియన్స్‌కి ఓ కొత్త ఎక్స్‌పీరియన్స్‌ని ఇచ్చే సినిమా 'స్వాగ్' ' అని హీరో శ్రీవిష్ణు చెప్పారు. ఆయన హీరోగా రూపొందిన ఎమోషనల్ ఎంటర్టైనర్ 'స్వాగ్'. రీతువర్మ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో మీరాజాస్మిన్ ప్రత్యేక పాత్ర పోషించారు. హసిత్ గోలి దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్‌ని నిర్వహించారు. దర్శకుడు హసిత్ గోలీ మాట్లాడుతూ 'కథలోని కొత్త విషయాలను హత్తుకునేలా చెప్పాం. ఆడియన్స్ రెస్పాన్స్ మా కష్టాన్ని మరిచిపోయేలా చేసింది. శ్రీవిష్ణు నటన గురించి అందరూ మాట్లాడుకుంటున్నారు. కథను, హీరోను నమ్మి అన్ని విధాలుగా మాకు సహకరించిన విశ్వప్రసాద్‌గారికి థ్యాంక్స్ చెప్పుకుంటున్నా' అన్నారు. ఎక్కువకాలం గుర్తుండిపోయే సినిమా అని నమ్మే 'స్వాగ్' తీశామని, అన్ని చోట్లా అద్భుతమైన స్పందన వస్తున్నదని నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ తెలిపారు. ఇంకా కథానాయికలు రీతూవర్మ, దక్ష నగార్కర్ కూడా మాట్లాడారు.



వస్తా..వస్తానులే

గోపీచంద్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వం'. శ్రీను వైట్ల దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, చిత్రాలయం సంస్థలు నిర్మిస్తున్నాయి. ఈ నెల 11న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలోని మూడో గీతం 'వస్తానులే..' శుక్రవారం విడుదలైంది. చేతన్ భరద్వాజ్ స్వరపరచిన ఈ గీతాన్ని వెంగి రచించారు. కపిల్ కపిలన్ ఆలపించారు. ఈ రొమాంటిక్ గీతంలో నాయకానాయికలు గోపీచంద్, కావ్యా థాపర్‌ల కెమిస్ట్రీ ఆకట్టుకుంది. విజువల్స్ బాగున్నాయి. యాక్షన్, ఫ్యామిలీ ఎమోషన్ అంశాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, గోపీచంద్ పాత్ర మునుపెన్నడూ చూడని విధంగా కొత్త పంథాలో ఉంటుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కేవీ గుహన్, సంగీతం: చేతన్ భరద్వాజ్, నిర్మాతలు: టీజీ విశ్వప్రసాద్, వేణు దోనేపూడి, దర్శకత్వం: శ్రీను వైట్ల.

ఏ ఒక్కర్నీ నిరాశపరచదు



'ఈ సినిమా షో ఇప్పటికే చాలా మందికి వేశాం. అద్భుతమైన స్పందన వచ్చింది. ఈనెల 6న విజయవాడలో, 8న తిరుపతిలో షోలు వేస్తున్నాం. విడుదల తేదీకి ముందే ఓవర్సీస్‌లో హ్యాపీడేస్, శతమానంభవతి సినిమాల షోలు వేశాం. అవి పెద్ద హిట్స్ అయ్యాయి. ఆ సెంటిమెంట్‌తోనే ఈ మూవీని కూడా ఓవర్సీస్‌లో ఈ 10న విడుదల చేస్తున్నాం. 11న ఇక్కడ ప్రీమియర్స్ వేసి, 12న సినిమాను గ్రాండ్‌గా రిలీజ్ చేస్తాం. పూర్తి వినోదాత్మకంగా సాగే ఈ సినిమా అందరికీ నచ్చుతుంది' అని దిల్‌రాజు అన్నారు. శిరీష్ సమర్పణలో దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్‌రెడ్డి, హన్షితరెడ్డి నిర్మించిన చిత్రం 'జనక అయితే గనక'. సుహాస్, సంగీర్తన జంటగా నటించిన ఈ చిత్రానికి సందీప్‌రెడ్డి బండ్ల దర్శకుడు. ఈ నెల 12న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దిల్‌రాజు మాట్లాడారు. ఈ సినిమా ఏ ఒక్కర్నీ నిరాశపరచదనీ, ప్రేక్షకుల స్పందన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని సుహాస్ చెప్పారు. ఈ సినిమా ఆద్యంతం ఐడియాలజీలపై ప్రయాణమేనని, తండ్రి, గ్రాండ్ మదర్, భార్య, భర్త.. ఇలా అందరికోణంలో ఈ కథ సాగుతుందని నిర్మాత హర్షిత్ రెడ్డి చెప్పారు. ఇంకా దర్శకుడు సందీప్‌రెడ్డి, కథానాయిక సంగీర్తన కూడా మాట్లాడారు.

నచ్చితేనే ఎంకరేజ్ చేయండి..



ధృవ సర్జా టైటిల్ పాత్రలో నటించిన భారీ యాక్షన్ థ్రిల్లర్ 'మార్టిన్'. ఎ.పి.అర్జున్ దర్శకుడు. ఉదయ్ కె.మెహతా, సూరజ్ ఉదయ్ మెహతా నిర్మాతలు. ఈ నెల 11న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన సీనియర్ హీరో అర్జున్ సర్జా, సీనియర్ డైరెక్టర్ బి.గోపాల్ చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. 'ఈ మూవీ చూడండి. నాకు టాలెంట్ ఉందని అనుకుంటే, ఆ తర్వాత నా సినిమాలను ఎంకరేజ్ చేయండి.' అని ధృవ సర్జా అన్నారు. ఈ సినిమా విజయంపై నిర్మాత ఉదయ్ కె.మెహతా నమ్మకం వ్యక్తం చేశారు. ఇంకా కథానాయిక వైభవి శాండిల్య కూడా మాట్లాడారు.

మిస్టర్ ఇడియట్ టీజింగ్



అగ్ర హీరో రవితేజ తమ్ముడు రఘు కుమారుడైన మాధవ్ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'మిస్టర్ ఇడియట్'. సిమ్రాన్‌శర్మ కథానాయిక. 'పెళ్లిసందడి'ఫేం గౌరి రోణంకి దర్శకత్వంలో జె.జె.ఆర్.రవిచంద్ర ఈ చిత్రాన్ని నిర్మించారు. నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా ఈ సినిమా నుంచి 'కాంతారా.. కాంతారా..' అంటూ సాగే పాటను మేకర్స్ విడుదల చేశారు. కాసర్ల శ్యామ్ రాసిన ఈ పాటను అనూప్ రూబెన్స్ స్వరపరచగా, రాహుల్ సిప్లిగంజ్ ఆలపించారు. కాలేజ్‌లో హీరోయిన్‌ను టీజ్ చేస్తూ హీరో ఈ పాట పాడతాడనీ, యువతరాన్నికి నచ్చే సినిమా ఇదని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి మాటలు: శ్యామ్, వంశీ, కెమెరా: రామ్‌రెడ్డి.

మాస్ జాతరలో



యువ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న తాజా చిత్రం 'క'. సుజీత్, సందీప్ దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మిస్తున్నారు. త్వరలో పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయబోతున్నారు. ఈ సినిమా నుంచి 'మాస్ జాతర' అనే పాటను ఈ నెల 7న విడుదల చేయబోతున్నారు. సామ్ సీ సంగీతాన్నందించిన ఈ పాట హుషారెత్తించే బీట్‌తో ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు. దర్శకులు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'గ్రామీణ నేపథ్యంలో నడిచే పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. కథానుగుణంగా సంగీతానికి చాలా ప్రాధాన్యత ఉంటుంది. ఈ చిత్ర మలయాళ థియేట్రికల్ హక్కులను అగ్ర హీరో దుల్కర్ సల్మాన్ సొంతం చేసుకున్నారు' అని తెలిపారు. నయన్‌సారిక, తన్వీరామ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: విశ్వాస్ డానియేల్, సంగీతం: సామ్ సీఎస్, దర్శకత్వం: సుజీత్, సందీప్.

పకోడి జీవితంలోకి తొంగి చూస్తే?



రామ్‌కార్తీక్, కశ్వి జంటగా నటిస్తున్న చిత్రం 'వీక్షణం'. మనోజ్ పల్లేటి దర్శకుడు. పి.పద్మనాభ రెడ్డి, అశోక్‌రెడ్డి నిర్మాతలు. ఈ నెల 18న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్ చేతుల మీదుగా ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. చిత్ర యూనిట్‌కి భరద్వాజ్ శుభాకాంక్షలు అందించారు. పక్కోడి జీవితంలోకి తొంగి చూస్తే ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయో తెలిపే సినిమా ఇదని దర్శకుడు చెప్పారు. అందరికీ గుర్తింపు తెచ్చే సినిమా ఇదని హీరో రామ్‌కార్తీక్ నమ్మకంగా చెప్పారు. ఇంకా చిత్రయూనిట్ మొత్తం మాట్లాడారు.

స్పై యూనివర్స్ ఆల్ఫా

యష్‌రాజ్ ఫిల్మ్స్ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న స్పై యూనివర్స్ మూవీ 'ఆల్ఫా'. ఆదిత్య చోప్రా నిర్మాణ సారథ్యంలో రూపొందుతోన్న ఈ భారీ యాక్షన్ ఎంటర్టైనర్‌కు శివరావెల్ దర్శకుడు. వచ్చే ఏడాది క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న సినిమా విడుదల కానుంది. అలియాభట్ టైటిల్ రోల్ పోషిస్తున్న ఈ చిత్రంలో శార్వారి కీలక పాత్ర పోషిస్తున్నది. అలియా, శార్వారీ ఇందులో సూపర్ ఏజెంట్స్‌గా నటిస్తున్నారని, స్పై యూనివర్స్‌గా రూపొందుతోన్న ఈ చిత్రం దర్శకుడు శివ్ రావెల్ ప్రతిభకు అద్దం పడుతుందని మేకర్స్ చెబుతున్నారు. స్టన్నింగ్ విజువల్స్, ఉద్వేగపూరిత సన్నివేశాలు, ఊహించని మలుపులతో అద్భుతంగా 'ఆల్ఫా' ఉంబోతున్నదని మేకర్స్ పేర్కొన్నారు.





మెన్షన్ హౌస్ మల్లేష్

శ్రీనాథ్ మాగంటి, గాయత్రి రమణ, సాయి కామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రధారులుగా, బాల సతీశ్ దర్శకత్వంలో కనకమేడల ప్రొడక్షన్స్ పతాకంపై రాజేష్ నిర్మిస్తున్న చిత్రానికి 'మెన్షన్ హౌస్ మల్లేష్' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ని దర్శకుడు శైలేష్ కొలను లాంచ్ చేసి చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. హీరో శ్రీనాథ్ మాగంటి వైట్ అండ్ వైట్‌లో బ్లాక్ షేడ్స్‌తో.. కింగ్ చైర్స్‌లో కూర్చుని ఇంటెన్స్‌గా చూస్తూ ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. ఇంకా గాయత్రి రమణ, సాయి కామాక్షి భాస్కర్ల, రాజేష్, మురళీధర్‌గౌడ్, రాజ్‌కుమార్ కసిరెడ్డిలను కూడా ఈ పోస్టర్‌లో చూడొచ్చు. త్వరలో విడుదల కానున్న ఈ సినిమాకు కెమెరా: అమ్మ ముత్తు, సంగీతం: సురేశ్ బొబ్బిలి.





ఉర్వీ సర్వజనేశ్వరీ జయకరీ మాతా కృపాసాగరీ
నారీనీలసమానకుంతలధరీ నిత్యాన్నదానేశ్వరీ।
సాక్షాన్మోక్షకరీ సదా శుభకరీ కాశీ పురాధీశ్వరీ
భిక్షాం దేహి కృపావలంబనకరీ మాతాஉన్నపూర్ణేశ్వరీ॥

అన్నపూర్ణాదేవి



నేటి అలంకారం

అన్నం పరబ్రహ్మ స్వరూపమని ఉపనిషత్తులు చెబుతున్నాయి. ఒక చేతిలో మధురసాలతో కూడిన మాణిక్యపాత్ర, మరొక చేతిలో అన్నాన్ని అనుగ్రహించే రతనాల గరిటె ధరించిన రూపంలో అన్నపూర్ణాదేవి దర్శనమిస్తుంది. ఈ అవతారంలో అమ్మ ఎర్రని శరీర ఛాయతో, మెడలో తారాహారాలు ధరించి, నిండు చంద్రుడిలా ప్రకాశించే ముఖంతో, విశాలమైన త్రినేత్రాలతో భాసిల్లుతుంటుంది. తన బిడ్డల ఆకలి తీర్చటానికి దుర్గాదేవి.. అన్నపూర్ణగా అవతరించింది. ఈ తల్లిని ఉపాసించిన వారికి ఏ లోటూ ఉండదు. బ్రహ్మతేజస్సు, వాక్సిద్ధి కలుగుతాయి. అంతేకాదు, తనను కొలిచినవారి సకల కార్యభారాన్నీ ఈ తల్లే వహిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. అన్నపూర్ణకు దద్యోజనం (పెరుగన్నం), కట్టెపొంగలి నివేదనగా సమర్పించాలి. ఈ రోజు అన్నపూర్ణాదేవి స్తోత్రాలు పారాయణం చేయాలి. శక్తికొద్దీ అన్నదానం చేయాలి.

నమస్తే తెలంగాణ

జిందగీ

హైదరాబాద్ | శనివారం 5 అక్టోబర్ 2024 www.ntnews.com

చెరకుతో చెక్

'చెరకు రసం' అద్భుతమైన ఔషధమని ఆయుర్వేదం అంటున్నది. ముఖ్యంగా, గర్భిణుల ఆరోగ్యానికి తక్షణ రక్షణ కల్పిస్తుందని తేల్చింది. విటమిన్లు, మినరల్స్ సమృద్ధిగా లభించే 'చెరకు'తో ఎన్నో సమస్యలకు చెక్ పెట్టవచ్చు.

గర్భిణులు ఎదుర్కొనే మరో సమస్య.. మలబద్ధకం. చెరకులో ఫైబర్ ఎక్కువగా ఉండి, పేగుల కదలికలను ప్రోత్సహిస్తుంది. దాంతో మలబద్ధకం సమస్య తగ్గుముఖం పడుతుంది. మలబద్ధకంగా అనిపించినప్పుడు చెరకు తినడం మంచిది.

గర్భిణులు జలుబు, దగ్గు మందులను వాడకూడదని వైద్యులు సూచిస్తారు. ఆ సమయంలో చెరకు రసం తీసుకుంటే.. జలుబు, దగ్గు తగ్గుముఖం పడతాయి.

చెరకు రసంలో ఉండే ఫోలిక్ యాసిడ్.. గర్భస్థ పిండంలో ఏర్పడే న్యూరల్ ట్యూబ్ డిఫెక్ట్ సమస్య నుంచి కాపాడుతుంది.

వాంతులు, వేవిళ్ల కారణంగా.. కొందరు గర్భిణులు సరిగ్గా భోజనం చేయరు. దాంతో విపరీతమైన నీరసం ఆవహిస్తుంది. అలాంటప్పుడు గ్లాసు చెరకు రసం తీసుకుంటే.. క్షణాల్లో చురుగ్గా తయారవుతారు. అసిడిటీని తగ్గించడంలోనూ ఇక్షు రసం చక్కగా పనిచేస్తుంది.

నీళ్లు తక్కువగా తీసుకోవడం వల్ల గర్భిణులు డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంటుంది. చెరకు రసంలో శరీరానికి కావాల్సిన ఎలక్ట్రోలైట్స్ పుష్కలంగా లభిస్తాయి. డీహైడ్రేషన్‌ను తగ్గించడంలో ఇవి చక్కగా పనిచేస్తాయి.

చెరకు రసంలో అల్లం, నిమ్మరసం కలుపుకొని తాగడం మంచిది. ఈ పానీయంలో విటమిన్ సి, యాంటి ఆక్సిడెంట్లు ఎక్కువగా లభిస్తాయి. ఇవి తల్లీబిడ్డల్లో రోగ నిరోధక శక్తిని పెంచడంతోపాటు ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడతాయి.



చెరకులో ఉండే యాంటి ఎమెటిక్ లక్షణాలు.. వికారం, వాంతుల నుంచి ఉపశమనం కలిగిస్తాయి.

పిగ్మెంటేషన్, చర్మం పొడిబారడం లాంటి సమస్యలూ గర్భిణుల్లో కనిపిస్తాయి. చెరకు రసంలో ఉండే గ్లైకోలిక్ యాసిడ్.. చర్మ సమస్యలను దూరం చేస్తుంది.

ఇందులో విటమిన్ ఎ, బి, సితోపాటు క్యాల్షియం, మెగ్నీషియం, పొటాషియం లాంటి మినరల్స్ అధిక మోతాదులో ఉంటాయి. ఇవి తల్లీబిడ్డల ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తాయి. అయితే, చెరకు రసాన్ని మితంగా తీసుకుంటేనే మంచిది. పరిమితికి మించి తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది.

ఆమె ఆకాసమంతే!

ఒక హీరో వరుస విజయాలు సాధిస్తే... పట్టుదల, స్వయం కృషితో ఎదిగాడు అని కితాబిస్తారు! అదే ఒక కథానాయిక సినీరాజ్యమేలితే.. ఆమె ప్రతిభను గుర్తించకపోగా, ఆమె కటౌట్ వెలిగిపోవడానికి 'కమిట్‌మెంట్' కారణమని కామెంట్ చేస్తారు. ఈ తరహా చౌకబారు విమర్శలు ఇండస్ట్రీ జనాలపై నాసిరకం మనుషులు ఎప్పుడూ చేసేవే!! అదేం దౌర్భాగ్యమో రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్నవాళ్లూ దిగజారుతున్నారు. రాజకీయ లబ్ధి కోసం సంస్కారహీనంగా నోరుజారుతున్నారు.

ఇష్యూను డైవర్ట్ చేయాలని మూసీ గబ్బును మించి కంపుగొలిపే మాటలన్నారు. తమ పొలిటికల్ మైలేజ్ కోసం కథానాయిక సమంతను టార్గెట్ చేశారు. తన అద్భుతమైన నటనతో పద్నాలుగేండ్లుగా వెండితెరను ఏలుతున్న నటిపై బురదజల్లారు. సాటి మహిళ అని కూడా చూడకుండా మహిళా మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు వ్యక్తిత్వ హననమే! తన ప్రతిభతో అందనంత ఎత్తుకు ఎదిగిన నటి సమంత. ఈ వ్యాఖ్యలు ఆమె ప్రతిష్ఠను ఇసుమంతైనా కదల్చలేవు. అదే సమయంలో, మంత్రివర్యురాలు తెంపరి మాటలు హుందాగా సాగిపోయే తెలంగాణ రాజకీయాలకు 'కొండ'ంత చేటు.

తెలుగునాట పరిచయం అక్కర్లేని పేరు సమంత. ఓ పెద్దింటి కోడలు కాకమునుపే ఆమె స్టార్. ఇంకా చెప్పాలంటే తెలుగులో తన మొదటి సినిమా 'ఏ మాయ చేసావే!' మొదటి ఆటతోనే సమంత బిగ్‌స్టార్ అయిపోయింది. కేరళ తీరం నుంచి టాలీవుడ్‌కు తరలివచ్చిన వసంతంలా కనిపించింది దర్శక, నిర్మాతలకు! అందుకే, అవకాశాలు వెల్లువెత్తాయి. ఆమె కాల్షీట్ల కోసం ఎదురుచూశారు. 'ఏ మాయ చేసావే'లో మెచ్యూర్డ్ లేడీగా అలరించిన ఆమె.. రెండో చిత్రం 'బృందావనం'లో బబ్లీ పెర్ఫార్మెన్స్‌తో ముచ్చటగొలిపింది. 'దూకుడు'తో తనకు సాటెవ్వరు అనిపించుకుంది. 'ఈగ'లో బిందుగా కనువిందు చేసింది. 'బిందు జోలికొస్తే చంపేస్తా' అని సినిమాలోని ఈగ మాత్రమే కాదు.. ఆ చిత్రాన్ని చూస్తున్న ప్రేక్షకులూ ఫీలయ్యేంతలా ఆ పాత్రను పండించింది సమంత. ఇండస్ట్రీలోకి వచ్చిన రెండో ఏడాదే 'ఎటో వెళ్లిపోయింది మనసు' సినిమాకు గానూ ఉత్తమ నటిగా నంది పురస్కారం అందుకుంది.

'ఈగ' సక్సెస్ తర్వాత సమంత సినీ జర్నీ మెరుపువేగం పుంజుకుంది. తెలుగుతోపాటు తమిళ సినిమాల్లోనూ పాత్రలు వెతుక్కుంటూ ఆమె తలుపుతట్టాయి. కేవలం అందం ఒక్కటే ఉంటే.. సక్సెస్ వచ్చినంత వేగంగా వెనక్కి మళ్లిపోతుంది. అందుకు తగ్గ అభినయం పండించగలదన్న నమ్మకం కుదిరినప్పుడే.. ఇండస్ట్రీ ఆదరిస్తుంది. తన పాత్రకు ఆమె అయితేనే న్యాయం చేస్తుందన్న విశ్వాసం ఉంటేనే.. దర్శకుడి ఎంపిక అవుతుంది. ప్రతి భావాన్నీ కొలిచినట్లు పలికించే సమంత రాక సినీ సృజనశీలురకు కొత్త ఉత్సాహాన్నిచ్చింది. కథానాయకుడి చుట్టూనే కథ అల్లుకున్నా.. సమంత పాత్రను చక్కెర గుళికలా తీర్చిదిద్దేవారు. పొడిపొడిగా పలుకుతూనే మనసు తడిచేసే నేర్పరి ఆమె. అందుకే ఏడాదికి ఆరేడు సినిమాలు చేసేంత బిజీగా మారిపోయింది.



'సీతమ్మ వాకిట్లో..'

సిరిమల్లెల నవ్వులు పూయించినా, 'అత్తారింటికి దారేది'లో శశిలా మెరిసినా.. సమంత మార్కు స్పష్టంగా కనిపించింది. ఆమె నటనలో మరోకోణం ఆవిష్కరించిన సినిమా 'మనం'. 'బిట్టూ..' అంటూ కొడుకుపై అవ్యాజమైన ప్రేమ కురిపించే సన్నివేశాల్లో ఆమె అచ్చంగా అమ్మగా దర్శనమిస్తుంది. కమర్షియల్ సినిమాల్లో హొయలు ఒలికించినా, ప్రయోగాత్మక చిత్రాల్లో తన నటనకు పరిధులు ఉండవని నిరూపించింది సమంత. అందుకు ఉదాహరణే 'రాజుగారి గది 2'. ఇక సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన 'రంగస్థలం' ఈ నటిని మరోమెట్టు పైకి ఎక్కించింది. హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమా 'యూ టర్న్'తో సమంత కెరీర్ కొత్త మలుపు తీసుకుంది. తమిళంలో వచ్చిన 'సూపర్ డీలక్స్'లో బోల్డ్‌గా నటించి పాత్ర డిమాండ్‌కు న్యాయం చేసింది. ఇక 'ఓ బేబీ' సమంత కెరీర్‌లో ద బెస్ట్ అని చెప్పొచ్చు. పాతికేండ్ల పడుచుగా మారిన ఏడుపదుల ముదుసలి పాత్రను ఆమె పోషించిన తీరు అద్భుతం. 'ఫ్యామిలీమ్యాన్-2' వెబ్‌సిరీస్ ఈ కథానాయిక స్టామినాను పాన్ ఇండియాకు పరిచయం చేసింది. ఇలా చెబుతూ పోతే, సమంత కెరీర్‌లో ఆల్ టైమ్ హిట్స్ ఎన్నో! సినిమాలు ఫెయిల్ అయ్యాయేమో కానీ, నటిగా మాత్రం ఆమె విఫలమైన సందర్భం లేదు!


వ్యక్తిగత జీవితంలో ఒడుదొడుకులు సహజం. సమంత జీవితంలోనూ చికాకులు ఉన్న మాట వాస్తవం. నాగచైతన్యను ప్రేమించి పెండ్లి చేసుకుంది. కొన్నాళ్ల తర్వాత ఇద్దరికీ పొసగలేదు. పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్నారు. ఈ దశలో కొంత కుంగుబాటుకు గురైందామె! 'యశోద' సినిమా విడుదలకు ముందు మయోసైటిస్ అనే జబ్బుకు గురైంది. ఆమె తనకు వచ్చిన వ్యాధి గురించి సోషల్ మీడియాలో షేర్ చేసినప్పుడు నలుగురూ నాలుగు రకాలుగా స్పందించారు. కొందరు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కొందరు మాత్రం 'సమంత సానుభూతి కోసం ప్రయత్నిస్తున్నద'ని వెకిలిగా కామెంట్ చేశారు. ఈ వ్యాఖ్యలు తనను మరింత ఒత్తిడికి గురి చేశాయని సమంత అప్పట్లో స్పందించింది. అనారోగ్యం నుంచి కోలుకున్న ఆమె ఇప్పటికీ లైమ్‌లైట్‌లోనే ఉంది. ఇప్పుడు తన చేతినిండా సినిమాలు లేకపోవచ్చు. కానీ, ఆమె ఆల్వేస్ ఆకా'సమంతే'!

సినిమాల్లో బిజీగా ఉన్న రోజుల్లోనూ, వ్యక్తిగత జీవితంలో ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడూ, అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడూ.. సందర్భం ఏదైనా ఆమె ధైర్యంగానే ఉంది. హుందాగానే వ్యవహరించింది. తన వ్యక్తిత్వాన్ని కించపరిచేలా సాక్షాత్తూ ఓ మహిళా మంత్రి అనరాని మాటలన్న ఈ సందర్భంలోనూ అంతే ఔన్నత్యాన్ని ప్రదర్శించింది. తన ప్రయాణాన్ని చిన్నచూపు చూడొద్దని విన్నవించుకుంది. విడాకుల అంశాన్ని ప్రస్తావిస్తూ వ్యక్తుల గోప్యత విషయంలో జాగ్రత్తలు పాటించాలని సోషల్ మీడియా వేదికగా సున్నితంగా హెచ్చరించింది. చిరంజీవి మొదలుకొని సినిమా ఇండస్ట్రీ వాళ్లంతా సమంత వెన్నంటి ఉన్నామని ప్రకటించారు. ఇక మంత్రివర్యుల విషయానికి వస్తే.. తను చేసిన కామెంట్లను ఉపసంహరించుకుంటున్నాను అని పేర్కొన్నారు. అంతలోనే మళ్లీ వివాదానికి ఆజ్యం పోశారు. అయినా, వ్యాఖ్యలను రికార్డుల్లోంచి తొలగించడానికి ఇది చట్టసభ కాదు. మహిళా మంత్రి ప్రజాక్షేత్రంలో నోరుజారారు. దిద్దుకోలేని తప్పు చేశారు. బేషరతుగా క్షమాపణలు వేడుకున్నా.. ఆ నీతిమాలిన కామెంట్లకు నిష్కృతి ఉండదు. ఒక ఆడపిల్లను, స్వయం ప్రతిభతో ఎందరికో ఆదర్శంగా నిలిచిన మహిళను పొలిటికల్ మైలేజ్ కోసం వాడుకున్న తీరు.. సమంత అభిమానులనే కాదు, తెలుగువాళ్లందరినీ సిగ్గు సిగ్గు అనేలా చేసింది.

... కణ్వాస

మీ భద్రత మీ బాధ్యతే!

కొందరికి ఒంటరిగా ఉండటం ఇష్టం! మరికొందరికి అది అనివార్యం. మనకు అందరూ దూరమైతే.. మిగిలేది ఒంటరితనం! మనమే అందరికీ దూరంగా వెళ్తే.. ఏకాంతం! ఇలా ఏకాంతంలో ఆనందాన్ని వెతుక్కునే అమ్మాయిలు ఇప్పుడు ఎంతో మంది. అయితే, అమ్మాయిలు ఇలా ఒంటరిగా జీవించడం తప్పుకాదు. సరైన భద్రతా చర్యలు పాటించకపోతేనే.. లేనిపోని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. నగరాల్లో ఒంటరిగా నివసించే మహిళల కోసం.. ఈ భద్రతా చిట్కాలు!



అద్దె ఇండ్లలో ఉండేవారిలో చాలామంది ఇంటి ఓనర్లు ఇచ్చిన తాళాలనే వాడుతుంటారు. ఇలాంటి సందర్భాల్లో డూప్లికేట్ తాళాలు వేరేవాళ్ల చేతికి వెళ్లే అవకాశం ఉంటుంది. అందుకే.. మీ ఇంటి తాళం మీరే కొనుక్కోండి. ఓ సెట్‌ను ఎప్పుడూ మీతోనే ఉంచుకోండి. మిగిలిన వాటిని సురక్షితంగా దాచుకోండి.

ఇంట్లో ఉన్నా.. బయట ఉన్నా.. మీ భద్రత గురించి పట్టించుకోవడంలో హోమ్ సెక్యూరిటీ సిస్టమ్ ముందుంటుంది. అందుకే, అత్యాధునిక హోమ్ సెక్యూరిటీ సిస్టమ్‌ను ఇంట్లో అమర్చుకోండి. అనుమతి లేకుండా ఎవరైనా ఇంట్లోకి ప్రవేశిస్తే.. ఇది మిమ్మల్ని అలర్ట్ చేస్తుంది. అత్యవసర సమయాల్లో మీకు సహాయపడుతుంది.

ఏ సమయంలోనైనా బయటి ప్రపంచంతో కమ్యూనికేట్ చేయడానికి మొబైల్ ఫోన్ అత్యుత్తమ మార్గం. అందుకే, వీలైతే రెండు ఫోన్లు దగ్గర పెట్టుకోండి. రెండిటినీ ఎప్పుడూ ఆన్‌లోనే ఉంచండి. ఒక మొబైల్‌లో చార్జింగ్ లేకపోయినా.. మరొకటి ప్రయత్నించే అవకాశం ఉంటుంది.

మీరు ఎంత ఆరోగ్యకరంగా ఉన్నా.. ఎప్పుడైనా మెడికల్ ఎమర్జెన్సీ రావొచ్చు. ఒంటరిగా నివసించేవారు ఇంట్లో ఫస్ట్ ఎయిడ్ కిట్‌ను తప్పకుండా ఉంచుకోవాలి. దానిని ఎలా ఉపయోగించాలో తెలుసుకోవడం కూడా ఎంతో ముఖ్యం.


అందానికి ఓట్ వేద్దాం

యవ్వనంగా కనిపించే చర్మం ఎవరికి మాత్రం ఇష్టం ఉండదు. పండుగ వేళ అలాంటి లుక్ కావాలంటే ఓట్స్‌తో దోస్తీ చేస్తే సరి. అందుకోసం మూడు స్పూన్ల ఓట్స్ పొడి, ఒక స్పూన్ పసుపు పొడి, రెండు చుక్కల విటమిన్-ఇ నూనె, ఒక స్పూన్ బాదం నూనె కలిపి మెత్తటి మిశ్రమంలా కలుపుకొని ముఖానికి రాయాలి. ఆరిన తర్వాత కడిగేయాలి. ఇది చర్మం మీది గీతల్ని, ముడతల్ని పోగొట్టి మృదువుగా ఉండేలా చేస్తుంది. ఇందులోని విటమిన్-ఇ చర్మ కణాలను రిపేర్ చేయడానికి ఉపయోగపడితే, పసుపు చర్మాన్ని యవ్వనంగా ఉంచుతుంది.



ఒక్కేసి పువ్వేసి చందమామ

శివుడికి శ్రీ గద్దె చందమామ
మాకు సారె గద్దె చందమామ
రెండేసి పూలేసి చందమామ
రెండు జాములాయే చందమామ
శివపూజ యాలాయే చందమామ
శివుడు రాకపాయే చందమామ
మూడేసి పూలేసి చందమామ
శివుడింకా రాడాయే చందమామ
శివుని పూజ యాలాయే చందమామ
గోరంట చెట్లల చందమామ
గోడపెట్ట పాయే చందమామ
నాల్గేసి పూలేసి చందమామ
నాల్గు జాములాయే చందమామ
శివ పూజ యాలాయే చందమామ
శివుడు రాకపాయే చందమామ
రుద్రాక్ష వనములో చందమామ
నిద్రించవాయే చందమామ
ఐదేసి పూలేసి చందమామ
ఐదు జాములాయే చందమామ
శివుడింకా రాడాయే చందమామ
శివుని పూజ యాలాయే చందమామ
బంతి వనములోన చందమామ
బంతులాడవాయే చందమామ
ఆరేసి పూలేసి చందమామ
ఆరు జాములాయే చందమామ
శివ పూజ యాలాయే చందమామ
శివుడింకా రాడాయే చందమామ
మల్లె వనములోన చందమామ
మాటలాడవాయే చందమామ
ఏడేసి పూలేసి చందమామ
ఏడు జాములాయే చందమామ
రత్నాల గౌరు చందమామ
నీరాసి కలుపుళ్ల చందమామ
ఎనిమిదో పువ్వేసి చందమామ
ఎనిమిది జాములాయే చందమామ
తీగె తీగల బిందె చందమామ
రాగి తీగల బిందె చందమామ
తొమ్మిదో పువ్వేసి చందమామ
తొమ్మిది జాములాయే చందమామ
రాశువాడలేసి చందమామ
రాశిగలపరారే చందమామ
పదేసి పూలేసి చందమామ
పది జాములాయే చందమామ
తీగె తీగల బిందె చందమామ
రాగి తీగల బిందె చందమామ
శివపూజ యాలాయే చందమామ
శివుడు రాకపాయే చందమామ
శివుడికి శ్రీ గద్దె చందమామ
మాకు సారె గద్దె చందమామ
శివుడికి శ్రీ గద్దె చందమామ
మాకు సారె గద్దె చందమామ



నేటి బతుకమ్మ

నానే బియ్యం బతుకమ్మ

పండుగ పూట సమర్పించే ప్రతి నివేదనలో ఒక పరమార్థం ఉన్నది. బతుకమ్మ ఆట తర్వాత ప్రసాదాన్ని అందరికీ పంచుతారు. అలసట తీరాలంటే ఆహారం తీసుకోవాలి. బతుకమ్మ ఆడి ఆడి అలసిన పిల్లలకు అమ్మకు నివేదించిన ప్రసాదం పెడతారు. ప్రసాదం అంటే పది మందితో కలిసి పంచుకునేది. రాక్షస సంహారం కోసం తొమ్మిది రోజుల పాటు పోరాడిన జగన్మాత ఆకలితో అలసిపోయి ఉంటుందనే భావనతో నాలుగో రోజు నానిన బియ్యంతో చేసిన నైవేద్యాలు సమర్పిస్తారు. బియ్యాన్ని కడిగి, నానబెట్టి, ఆ తర్వాత ఆరబెట్టి.. మెత్తని పిండిగా చేస్తారు. అందులో పాలు, చక్కెర, నెయ్యి వేసి పాలకాయల్లాగా చిన్న ఉండలుగా చేస్తారు. వీటిని పచ్చిపిండి ముద్దలని పిలుస్తారు. ఇవంటే అమ్మకు ఎంతో ప్రీతి. అందుకే నానిన బియ్యంతో చేసిన పదార్థాలు నైవేద్యం పెడతారు.

• ఆర్.కమల